వాసుడు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప fb.com/vaartha
Published from Kadapa,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 32 పేజీలు: 10+4 వెల: 6.50




## వన్యప్రాణుల మధ్య ప్రధాని 'షికారు'

### పులి పిల్లలకు పాలు పట్టించి.. వానరాలను అక్కున చేర్చుకుని!



వంతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో జంతువుల మధ్య ప్రధాని మోడీ

**అహ్మదాబాద్, మార్చి 4:** గిరి అభయారణ్యంలో సఫారీ నిర్వహించిన ప్రధానిమోడీ తన గుజరాత్ పర్యటనలో మంగళవారం గాయపడి ఇబ్బందుల్లో ఉన్న జంతవులను సంరక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రిలయన్స్ వంతారాను సందర్శించారు. ప్రధానిమోడీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఏర్పాటుచేసిన ఈ వంతారాలో అనేక జంతు సంరక్షణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొసళ్లు, సింహాలు, పులులు, ఏనుగులు, జీబ్రాలు, వివిధ జాతుల వానరాలను అక్కున చేర్చు కున్నారు. ఒక పులి, సింహం పిల్లల సంరక్షణ కేంద్రంలో వాటికి పాలు పట్టించారు. ఖడ్గమృగానికి కూడా పానీయాన్ని అందించారు. జామ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వంతారాను



రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబాని ప్రారంభించారు. ఈ వంతారాను సందర్శించాలన్న మోడీ అభిమతంతో అంబాని కుటుంబం మొత్తం ఎదురేగి మోడీకి >>2

# మూడేళ్లలో భూముల రీసర్వే పూర్తి



### శాసనసభలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

### గత ప్రభుత్వంలో బొమ్మలు వేసుకోవాలనే పిచ్చితో తప్పుల తడకగా రీసర్వే

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వంలో తప్పుల తడకగా సాగిన భూముల రీ సర్వేను సరిదిద్దుతున్నామని, తమ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిన రీ సర్వేలో ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా చాలా పకడ్బందీగా కొనసాగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి హడావిడి లేకుండా భూయజమానులందర్నీ ఒప్పించి ప్రతిష్టాత్మకంగా రీ సర్వే ప్రాజెక్ట్‌ను మూడేళ్ల సమయంలో పూర్తి చేస్తామని చెప్పారు. జనవరి 20వ తేదీన తమ ప్రభుత్వం భూముల రీ సర్వేను తిరిగి ప్రారంభించిందని, అయితే ఈసారి ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా ఎన్నుకొని రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామాన్ని బ్లాకులుగా విభజించి, ప్రతి బ్లాక్‌కు అధికారులను కేటాయించి రోజుకు 20 ఎకరాల మేరకే రీసర్వే చేయిస్తున్నామని చెప్పారు. రీ సర్వే చేసే ముందు ఆ భూమికి సరిహద్దులో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు ఇచ్చి వారి సమక్షంలోనే రీసర్వే చేస్తున్నారని చెప్పారు. ఒక బ్లాక్‌లో ఉన్న భూ యజమానులందరికీ వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరికీ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తున్నామని చెప్పారు.

శాసనసభలో మంగళవారం ప్రశోత్తరాల సమయంలో భాగంగా రీసర్వే అంశంపై టిడిపి సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, కూన రవికుమార్, బోనెల విజయచంద్ర, రాజగోపాల్ అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ కాలంలో 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారని, కానీ ఆ రీ సర్వే అంతా తప్పుల తడకగా మారిందన్నారు. రీ సర్వేకు సంబంధించి భూ యజమానులకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని, రీసర్వే పూర్తయిన తర్వాత భూ యాజమానులు అభ్యంతరాలు తెలిపేందుకు 60 రోజులగా ఉన్న గడువును 21 రోజులకు కుదించారన్నారు. నిబంధనల ప్రకారం కాకుండా సరిహద్దు రాళ్లపైన తమ బొమ్మలు వేసుకోవా >>2



మంగళవారం అసెంబ్లీలో ఆర్థిక కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

# యేటా 60 రోజులు అసెంబ్లీ!

### నెలలో కనీసం రెండుసార్లు ఆర్థిక కమిటీల సమావేశం జరగాలి: స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** శాసన సభా ఆర్థిక కమిటీలు నెలలో కనీసం రెండు సార్లు సమావేశం కావాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. మంగళవారం రాష్ట్ర శాసన సభా భవనంలో శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ), శాసనసభ అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్ కమిటీ) మరియు ప్రభుత్వ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ)ల ప్రాథమిక సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేయడంలో ఇప్పటికే చాలా ఆలస్యమైంది అన్నారు. కమిటీ మెంబర్లు చాలా చురుగ్గా ఉండాలని, తద్వారా అసెంబ్లీ ప్రొసీడింగ్స్ లో కానీ, అసెంబ్లీని నడిపించడం ఎంతో సులభమవుతుందన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో బడ్జెట్ సమావేశాలు 60 రోజులు పాటు జరిగేవని, అవి అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా జరిగేవన్నారు. అలాంటివి నేడు 15 రోజులకు తగ్గిందన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన అన్నిరాష్ట్రాల స్పీకర్ల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఏ రాష్ట్రమైనా సరే అసెంబ్లీ సమావేశాలను సంవత్సరానికి కనీసం 60 రోజులపాటు జరపాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు.

ఇందుకు అన్ని రాష్ట్రాల సభాపతులు ఆమోదం తెలిపారన్నారు. కాబట్టి ఈ కమిటీలు నెలలో కనీసం రెండు సార్లు సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఏ ఉద్దేశంతో ఈ కమిటీలు ఏర్పాటు చేశారో ఆ లక్ష్యాల సాధనకు అనుగుణంగా సభ్యులందరూ సహకరించి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి పబ్లిక్ ఆడిట్ జనరల్ వారి సలహాలు, సూచనలను కమిటీ సభ్యులు తప్పక పరిగణలోకి తీసుకోవాలన్నారు. తాము కూడా ఈ కమిటీలకు సంపూర్ణ సహకారాలను అందిస్తామన్నారు.

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఈమూడు కమిటీలు ఎంతో ముఖ్యమైనవని, సంబంధించిన ఛైర్మన్లు, సభ్యులందరూ అర్థవంతంగా చర్చల్లో పాల్గొనాలని అన్నారు. అలాగే క్షేత్ర స్థాయి పర్యటనలు కూడా చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీలు తరచూ సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కమిటీల సమావేశాలను మినీఅసెంబ్లీలుగా భావించి పాల్గొనాలన్నారు. ఈ సమావేశాలు శాసనసభ సమావేశాలు అంత ముఖ్యమైనవిగా భావించాలన్నారు. ఈ సమావేశాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించి మంచి పేరును తీసుకురావా లన్నారు.పబ్లిక్ అకౌంట్స్ కమిటీ >>2



మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

# 'దిశ' స్థానంలో ఇక 'శక్తి'

### - రాష్ట్ర హోం మంత్రి అనిత

**విజయవాడ, మార్చి4, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించేందుకు దిశ యాప్ స్థానంలో కొత్తగా శక్తి యాప్ తీసుకొస్తున్నట్లు హోం మంత్రి అనిత ప్రకటించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులు, దిశ చట్టంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పలు ఆరోపణలు చేశారు. దిశ యాప్‌ను కొనసాగించకపోవడం వల్ల స్త్రీలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఈ యాప్‌ను కొనసాగించాలని కోరారు. దీనిపై >>2

# విద్యుత్ ఛార్జీలు పెరగవు..

### గత ప్రభుత్వం ఐదేళ్లలో 9 సార్లు పెంచింది..

### ఛార్జీల పెంపుపై మాట్లాడే అర్హత వారికి లేదు: మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలను ఇప్పటి వరకు పెంచలేదు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పెంపు ఉండబోదని శాసన మండలి సాక్షిగా ప్రకటించారు. శాసన మండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు శివరామిరెడ్డి, అరుణ్ కుమార్, రవిబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఐదేళ్ల వైఎస్సార్సీ ప్రభుత్వంలో విద్యుత్ రంగాన్ని సర్వ నాశనం చేసిన తీరును సభకు వివరించారు. తద్వారా వైఎస్సార్సీ నేతలు చేస్తున్న సత్యదూరమైన ఆరోపణలను తిప్పి కొట్టారు. విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైఎస్సార్సీ పార్టీనాయకులకు కనీసం మాట్లాడే అర్హత కూడా లేదని మండిపడ్డారు. వైఎస్సార్సీ ప్రభుత్వం చివరి రెండేళ్ల పాలనలో ప్రజలపై రూ.15,000 కోట్ల విద్యుత్ భారం మోపిందని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.8,113 కోట్లకుపైగా విద్యుత్ ఛార్జీలను పెంచి ఇఆర్సీకి పంపిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా మరో రూ.11,000 కోట్లు పెంపుపై ఇఆర్సీకి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి కావాల్సి ఉండగా, దానిని దాదాపు 20 నెలల కాలానికి సాగదీసిందని తెలిపారు. వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ ప్రతిపాదనలతో పెరిగిన రూ.15,000 కోట్ల విద్యుత్ భారాన్ని కూటమి ప్రభుత్వంపై మోపేలా ప్రజలను మభ్య పెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఛార్జీలు పెంచిన వాళ్లే రోడ్లెక్కి ధర్నాలు చేయడం, ప్రశ్నలు వేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

**తెలుగు దేశం ప్రభుత్వంలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఎపి**

రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి పరంగా అనేక అవాంతరాలు ఎదుర్కొందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. 2014 లో అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. 2014-2019 మధ్య కాలంలో ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని వివరించారు. 2019 ఎన్నికల సమయానికి ఆంధ్రప్రదేశ్ మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. టిడిపి హయాంలో విద్యుత్ రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్సీ విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కృష్ణపట్నం రెండో ఫేజ్, ఇబ్రహీపట్నం వీటీపీఎస్ ఐదో ఫేజ్ ప్లాంట్లను షట్ డౌన్ చేయించి ఉత్పత్తిని నిలిపి వేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థం ఉన్న పోలవరం ప్రాజెక్ట్ 2019 సమయానికి 70 శాతం పూర్తయినా... వైఎస్సార్సీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో మిగిలిన 30 శాతం పూర్తి చేయలేదని చెప్పారు. అంతే కాకుండా కొత్త పవర్ ప్లాంట్ల నిర్మాణాలు లేకుండా చేశారని ఆరోపించారు. పునరుత్పాదక విద్యుత్ రంగానికి సంబంధించి గత ప్రభుత్వం సోలార్, విండ్ ఉత్పత్తిని కూడా ఆపేశారన్నారు. షార్ట్ టైం పవర్ పర్చేజ్ ల పేరుతో సుమారు రూ.10,000 కోట్లతో విద్యుత్ కొనుగోళ్ల చేసి ఆ భారం ప్రజలపై వేశారని మంత్రి వెల్లడించారు. విద్యుత్ సంస్థల నిధుల్ని కూడా బేవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని ఎద్దేవా చేశారు.జగన్ లేఖతో రాష్ట్రానికి అపార నష్టం....అడ్డగోలు విద్యుత్ కొనుగోళ్లతో రాష్ట్ర ఖజానాపై భారం మోపడమే కాకుండా పిఎం కుసుమ్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌కు వద్దంటూ వైఎస్సార్సీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనకు అద్దం పడుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. పిపిఎలను రద్దు చేయడమే కాకుండా... ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని తెలిపారు. పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి తరిమేశారని వాపోయారు. అంతే కాకుండా విదేశీ ప్రతినిధులతో తిట్లు కూడా తిన్నారని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు.



మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి నాదేండ్ల

# రేషన్ కార్డు కాదు.. రైస్ కార్డు జారీ

### -మంత్రి నాదెండ్ల

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** రేషన్ కార్డు బదులు రైస్ కార్డుగా జారీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శాసనసభకు వివరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డును సర్టిఫికెట్ మాదిరిగా ప్రజలు భావిస్తున్నారని, అందుకే ఎపిలో ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి వివరాలను కేంద్రానికి తెలియచేశామని మనోహర్ స్పష్టం చేశారు. అర్హత ఆధారంగానే రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామని మంత్రి శాసన సభకు వివరించారు. శాసనసభలో తెల్ల రేషన్ కార్డులపై బిజెపి శాసనసభ్యుడు విష్ణుకుమార్ రాజు, టిడిపి సభ్యుడు బుచ్చయ్య చౌదరి అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందించారు.

ఈ కెవైసి నిర్వహణ కారణంగా బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు నిలిపివేశామని అన్నారు. రేషన్ కార్డుల ఈ కెవైసి వివరాల కోసమే ఆదాయపుపన్ను చెల్లిస్తున్న వారి వివరాలను కేంద్రానికి సమర్పించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.94కోట్ల రేషన్‌కార్డులు ఉంటే >>2

### ప్రభుత్వ ఉద్యోగాల అర్హత

# 42 యేళ్లకు పెంపు

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిపిఎస్సీ సహా అన్ని నియామక ఏజెన్సీలు నిర్వహించే యూనిఫాం సర్వీసు ప్రత్యక్ష నియామకాలకు అర్హత వయస్సును 2 ఏళ్లకు సడలిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 సెప్టెంబర్ 30 తేదీ వరకూ ఈ సడలింపు వర్తిస్తుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. యూనిఫాం సర్వీసు కానీ ఇతర ప్రత్యక్ష నియామకాలకు అర్హత వయస్సును 34 నుంచి 42 ఏళ్లకు సడలిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎపిపిఎస్సీ సహా ఇతర నియామక ఏజెన్సీలు చేపట్టే ప్రత్యక్ష నియామకాలకు ఈ సడలింపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ సడలింపు 2025 సెప్టెంబర్ 30 వరకూ వర్తించేలా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అంశంపై గత కొన్నేళ్లుగా అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు.

### పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# కూటమి హవా

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి హవా కొనసాగింది. గత 8 నెలల చంద్రబాబు పాలనకు ఈ ఫలితాలు అద్దం పడుతోన్నాయి. అంతేకాదు.. గత అసెంబ్లీ ఎన్నికల వేళ నమోదైన ఓట్ల షేర్ కంటే.. ఈ ఎన్నికల ఫలితాల్లో వచ్చిన ఓట్ల షేర్ భారీగా పెరిగింది. టిడిపి అభ్యర్థులు పోటీ చేసిన రెండు స్థానాల్లో వారు తిరుగులేని మెజార్టీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 67 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో 8 నెలల పాలనను దీవించేలా తీర్పు వచ్చిందనే ఓ చర్చ సైతం సాగుతోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. నేడు అంతకు మించి అంటే.. 65 శాతంపైగా ఓట్ షేర్‌తో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం లభించింది. ఉమ్మడి కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు1,45,057 ఓట్లు పోలవడం ద్వారా మొత్తం ఓట్లలో 67.51 శాతానికి పైగా సాధించారు. ఇంకా చెప్పాలంటే.. 82,320 ఓట్ల భారీ మెజారిటీతో ఆయన ఘన విజయం సాధించారు. ఇక ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కూటమి తరఫున బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్ 1,24,702 ఓట్లు >>2

# తప్పు చేసిన ఎవరినీ వదలం

### రెడ్‌బుక్ తనపని తాను చేసుకుపోతోంది: విజయోత్సవ సభలో మంత్రి లోకేష్



మంగళవారం మంగళగిరిలో జరిగిన వియోత్సవ సభలో మంత్రి లోకేష్

**మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** రెడ్ బుక్ దాని పని అది చేసుకుంటూ పోతోందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీల విజయోత్సవ సభ గుంటూరు జిల్లా మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సభకు సిఎం చంద్రబాబు, కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ క్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాతూ ఇచ్చిన మాట ప్రకారం తప్పు చేసిన ఎవ్వరినీ వదిలేది లేదని తేల్చిచెప్పారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రతీ ఎన్నికలో విజయం కూటమిదేనని మంత్రి ఉద్ఘాటించారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో కనీవిని ఎరుగని సంక్షేమం అందించిన ఘనత మనదేనని వెల్లడించారు. ప్రజలు కొట్టిన దెబ్బకి పులివెందుల ఎమ్మెల్యే ఇంకా కోలుకోలేదని ఎద్దేవా చేశారు. ఒకరోజు ఎమ్మెల్యేగా జగన్ ముద్ర వేసుకున్నాడని అన్నారు.

ప్రజలు ఇవ్వని ప్రతిపక్షహోదా కోసం ఒకరోజు అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడిగి బెంగుళూరు వెళ్లిపోతాడని దుయ్యబట్టారు. వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో మనం ఎదుర్కొన్న పట్టభద్రుల ఎన్నికలు గేమ్ చేంజర్‌గా మారాయని మంత్రి లోకేశ్ అన్నారు. 2023 పట్టభద్రుల ఎన్నికల్లోనే వైఎస్సార్సీకి దిమ్మ తిరిగి సీన్ రివర్స్ అయిందని లోకేశ్ గుర్తు చేశారు. దేశానికి సంక్షేమం పరిచయం చేసింది ఎన్టీఆర్ అని కొనియడారు. పింఛన్ పెంచినా, అన్న క్యాంటీన్లు ప్రారంభించినా, తల్లికి వందనం ప్రారంభించినా, రైతులకు అన్నదాతా సుఖీభవ కింద నిధులు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు అన్నీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని వెల్లడించారు. యువత గెలిపించిన గెలుపు ఇది అని స్పష్టం చేశారు. మార్చి నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు.


మంగళవారం న్యూఢిల్లీలో పలువురు ఐఆర్ఎస్ ట్రైనీలు రాష్ట్రపతి ముర్మును కలుసుకొన్న దృశ్యం

# ప్రధాని 'షికారు'

>> స్వాగతం పలికింది. వన్యప్రాణుల ఆసుపత్రి, జంతువులకోసం ఏర్పాటుచేసిన ఎమ్మార్రై, సిటిస్కాన్‌లు, ఐసియులు తదితరవాటితో ఉన్న పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ తదితర విభాగాలను కూడా పరిశీలించారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు జిరాఫీలకు ఆహారం అందించారు. మోడీ వంతారా పర్యటనలోని ఫోటోలు, విడియోలు తన సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. దేశ విదేశాల్లో గాయపడిన ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి చికిత్సచేసి సంరక్షించి పునావాసం కల్పించడం వంతారా లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి, గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో మూడువేల ఎకరాల్లో ఉంది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగులకోసం ప్రత్యేక దవాఖానా ఉంది. ఇది ప్రపంచంలోనే పెద్దది. సుమారు రెండువేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేలసంఖ్యలో ఉద్యోగులు కూడాపనిచేస్తున్నారు.


మంగళవారం న్యూఢిల్లీలోని డిఆర్‌డిఓ భవన్‌లో టెక్నాలజీ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# తొలి సెమీఫైనల్ భారత్‌దే!

## కంగారూలపై టీమిండియా విజయం

**దుబాయి, మార్చి 4:** ఛాంపియన్స్‌ట్రోఫీ 2025లో టీమిండియా ఫైనల్‌కు చేరింది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన మొదటిసెమీఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. ముందు బ్యాటింగ్‌చేసిన ఆసీస్ 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ టార్గెట్‌ను టీమ్ ఇండియా 48.1 ఓవర్లలో నాలుగు వికెట్లు తేడాతో ఛేదించింది.దీనితో 2023 వన్డేప్రపంచకప్ ఫైనల్ ఓటమికి ఆసీస్‌పై భారత్ తనప్రతీకారం తీర్చుకున్నట్లయింది. విరాట్‌కోహ్లీ 98 బంతుల్లో ఐదుఫోర్లతో 84 రుగులుచేసి జట్టు విజయంలో కీలకంగాకొనసాగాడు. శ్రేయస్ అయ్యర్ 62 బంతుల్లో మూడు ఫోర్లు 45 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 34 బంతుల్లో రెండుఫోర్లు రెండు సిక్స్‌లతో 42 పరుగులు, హార్థిక్ పాండ్య 24 బంతుల్లో ఫోర్, మూడు సిక్స్‌లతో 28 పరుగులుచేసాడు. రోహిత్‌శర్మ 29 బంతుల్లో మూడుఫోర్లు ఒక సిక్స్‌తో 28 పరుగులుచేస్తే అక్షర్‌పటేల్ 30 బంతుల్లో ఒకఫోర్ ఒకసిక్స్‌తో 30 బంతుల్లో ఒకఫోర్ ఒకసిక్స్‌తో 27 పరుగులతో పర్వాలేదనిపించాడు. శుభ్‌మన్‌గిల్ 8 పరుగులకే వెనక్కితిరిగాడు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా రెండు, బెన్ ద్వార్షుయిస్,నాథన్ ఎల్లిస్, కూపర్ కనోలి ఒక్కో వికెట్‌తీసారు. 9వ తేదీ ఫైనల్‌మ్యాచ్ దుబాయిలో జరుగుతుంది. బుధవారం దక్షిణాఫ్రికా,న్యూజిలాండ్‌మధ్య జరిగే సెమీఫైనల్2లో విజేతగా నిలిచినజట్టు తుదిపోరులో భారత్‌తో తలపడుతుంది. కోహ్లీని ప్లేయర్ ఆఫ్‌దిమ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇక ఆసీస్ బ్యాటర్లలో కెప్టెన్ స్టీవ్‌స్మిత్ 96 బంతుల్లో నాలుగుఫోర్లుఒక సిక్స్‌తో 73 పరుగులుచేసాడు. అలెక్స్‌కేరీ 57 బంతుల్లో 8ఫోర్లు ఒకసిక్స్‌తో 61 పరుగులుచేసి అర్థసెంచరీలుచేసారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ 33 బంతుల్లో ఐదుఫోర్లు, రెండుసిక్స్‌లతో 39, మార్నస్ లబుషేన్ 29, బెన్ ద్వార్షుయిస్ 19, జోష్ ఇంగ్లీస్ 11, నాథన్ ఎల్లిస్ 10, మ్యాక్స్‌వెల్ ఏడు పరుగులుచేసాడు. భారత బౌలర్లలో మహ్మద్‌షమీ మూడు, రవీంద్ర జడేజా రెండు వరుణ్‌చక్రవరినత రెండు, లక్షర్‌పటేల్ హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ తీసారు.

# కూటమి హవా

>> పొందారు. అంటే మొత్తం ఓట్లలో 62.59 పైగా ఆయన సాధించారు. ఇంకా చెప్పాలంటే.. 77,4610 ఓట్లపైగా పోలై.. భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల్లో 59.28 శాతం ఓట్ షేర్‌కాగా.. నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరింత పెరిగి 62.59 శాతం ఓట్ షేర్‌కు చేరింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణా గుంటూరు జిల్లాల్లో 58.19 శాతం ఓట్ షేర్ రాగా.. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది భారీగా పెరిగి 67.51 శాతం ఓట్ షేర్‌కు చేరింది. గత ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సాధారణ ఎన్నికల్లో 58 శాతం ఓట్ షేర్ రాగా...నేడు 65 శాతం ఓట్ షేర్‌ను కూటమి సాధించింది. తాజా గెలుపుతో మొత్తం 5 పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో 5 గురూ కూటమి అభ్యర్థులే ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 3 పట్టభద్రుల స్థానాలు గెలిచిన కూటమి...నేడు మరో రెండు స్థానాలను గెలుచుకొని.. 5 స్థానాలకు చేరుకుంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో వైకాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇచ్చిన వారికి మూడవ స్థానం దక్కింది.

# 'దిశ' స్థానంలో ఇక 'శక్తి'

>> స్పందించిన హోం మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు.మహిళల భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అనిత పేర్కొన్నారు. ఉమెన్ సేఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంగీకరించారని తెలిపారు. గంజాయి నివారణకు ఈగల్ అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అమల్లోకి తెచ్చామని చెప్పారు. దిశ యాప్ డౌన్‌లోడ్ కోసం గత ప్రభుత్వం టార్గెట్లు పెట్టి మగవాళ్లతోనూ డౌన్‌లోడ్ చేయించారని అనిత ఆరోపించారు. ఈ క్రమంలోనే హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ మండలిలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో శాసన మండలిలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఛైర్మన్ మోషేను రాజు సభను కాసేపు వాయిదా వేశారు. గత ప్రభుత్వం దిశ చట్టాన్ని తెచ్చినట్లు ప్రచారం చేసుకుందే తప్ప ఎక్కడా చట్టబద్ధత కల్పించలేదని హోం మంత్రి అనిత విమర్శించారు. ఈ చట్టం అనుగుణంగా ఎన్ని కేసులు పెట్టారో చర్చించేందుకు సిద్ధమన్నారు. దీన్ని గురించి గొప్పగా చెబుతోన్న వైఎస్సార్సీ సభ్యులు ఈ చట్టానికి చట్టబద్దత కల్పించారో లేదో గుండెలపై చేయి వేసుకుని చెప్పాలని నిలదీశారు. దిశ యాప్ ద్వారా గత ప్రభుత్వం ఎంత మంది మహిళలను రక్షించారో వైఎస్సార్సీ సభ్యులే చూడాలన్నారు.

# రేషన్ కార్డు కాదు.. రైస్ కార్డు జారీ

>> 4.26 కోట్ల మందికి ఇందులో లబ్ధి కలుగుతోందని మంత్రి వివరించారు. సొంతవాహనం కాకుండా టాక్సీ కలిగిన వారికి కూడా రేషన్ కార్డు పొందేందుకు అర్హత ఉందని మంత్రి వెల్లడించారు. ఏదైనా కారణాల వలన రేషన్ కార్డులో సభ్యుల పేర్లు తొలగింపు విషయం ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ వారి అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎవరైనా రేషన్ కార్డులలో పేర్ల తొలగించాలి అనుకుంటే జాయింట్ కలెక్టర్‌కు ఎప్పుడైనా అర్జీ పెట్టుకోవచ్చని శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానంగా చెప్పారు.

**తమిళనాడుతో పోలిస్తే ఎపి ఐఐసీ కేటాయిస్తున్న భూమి విలువలు తక్కువ**

తమిళనాడుతో పోలిస్తే ఎపి ఐఐసి కేటాయిస్తున్న భూమి విలువలు ఎపిలో చాలా తక్కువ ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ శాసనసభకు వివరించారు. వెయ్యి కోట్లకు పైబడిన పెట్టుబడులు ఉంటే అతి తక్కువ రేటుకే భూములు కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు. కృష్ణా జిల్లా మల్లవెల్లిలోనూ అతి తక్కువ ధరకు మాత్రమే భూములు కేటాయిస్తున్నామని వెల్లడించారు. అయితే దీనిపై స్పందించిన సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలకు కేటాయిస్తున్న భూముల ధరలు చాలా తక్కువ ఉంటున్నాయని రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఓ పారిశ్రామిక వాడ పెట్టాలని నిర్ణయించిన తరుణంలో భూముల ధరల్ని మరోమారు సమీక్షించుకోవాల్సి ఉందని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రపంచ స్థాయి పెట్టుబడుల హబ్‌గా ఎపి

## - మంత్రి జనార్దన్ రెడ్డి

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు హబ్‌గా తీర్చిదిద్దనున్నా మని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేసారు.వినూత్నమైన ఆలోచన విధానంతో, ప్రణాళికలతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతుందన్నారు.ఏ రంగంలోనైనా రాష్ట్రాన్ని అంతర్జాతీయ,జాతీయస్థాయిలో ఉన్నతంగా ఉంచాలన్నదే ప్రభుత్వం ఆలోచన విధానం అన్నారు. విజయవాడలోని నోవా టెల్ హోటల్ లో మారిటైం, లాజిస్టిక్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ పై ఆంధ్ర ప్రదేశ్ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ తో నిర్వహించిన సదస్సులో మంత్రి ప్రసంగిస్తూ మారిటైమ్ లాజిస్టిక్స్ రంగాల్లో రాష్ట్రం యొక్క సామర్థం మరింత మెరుగుపడేలా భాగస్వామ్య పక్షాలతో చర్చలు ఉపయోగ కరమన్నారు.పోర్టుల అభివృద్ధిలో లాజిస్టిక్స్ రంగం చాలా కీలకమైనది. 2030 నాటికి లాజిస్టిక్స్ వ్యయం జీడీపీలో సింగిల్ డిజిట్ కూ తీసుకురావాలనేది 2022 నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ లక్ష్యాల్లో ఒకటన్నారు.ఆ దృక్పథంతోనే అత్యంత వేగవంతంగా అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు.పోర్టులకు జాతీయ రహదారుల అనుసంధానంతో పాటు, విస్తృత స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కీలకమైనభాగస్వాముల సంప్రదింపుల సదస్సు ముగించే సందర్భంగా మీ అందరితో మాట్లాడటం నాకు ఎంతో గౌరవం, ఆనందం కలిగిస్తోందన్నారు.. నేడు ఈ సదస్సులో చర్చకు వచ్చిన అంశాలు, ఎంతో విలువైనవి... ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు హబ్‌గా మరియు మారిటైమ్ లాజిస్టిక్స్ రంగాల్లో రాష్ట్రం యొక్క నాయకత్వ స్థాయి పటిమ, సంకల్పానికి మరింత బలం చేకూర్చే విధంగా ఈ చర్చలు ఉన్నాయన్నారు..2022 లో మన ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్రమోదీగారికి జన్మదినం పురస్కరించుకుని 2022 సెప్టెంబర్ 17 నేషనల్ లాజిస్టిక్స్ పాలసీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2030 నాటికి లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (లిశి)లో భారత్ టాప్ 25 లో ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తోంది.. ఇందుకనుగుణంగా తాజాగా ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (లిశి) 2023 ప్రకారం భారత్ 38 వ స్థానానికి చేరుకోవడం సంతోషించదగ్గ అంశం.. ఈ నివేదిక ప్రకారం మన దేశంలో పోర్టులు టర్న్ అరౌండ్ టైమ్ 0.9 రోజులుగా గుర్తించింది.. ఇది అభివృద్ధి చెందిన దేశాలు అమెరికా, ఆస్ట్రేలియా, బెల్జియం, జర్మనీ, సింగపూర్, రష్యా, న్యూజిలాండ్ వంటి దేశాలతో పోలిస్తే చాలా మెరుగ్గా ఉంది.పోర్టుల అభివృద్ధిలో లాజిస్టిక్స్ రంగం చాలా కీలకమైనది.. ఏదైనా ఒక ఉత్పత్తిని మన దేశం నుంచి దిగుమతి, ఎగుమతులు చేసుకోవడానికి ప్రస్తుతం దాదాపుగా 14 శాతం మేర జీడీపీలో లాజిస్టిక్స్ కే ఖర్చయ్యే పరిస్థితి ఉంది.. 2030 నాటికి దీనిని సింగిల్ డిజిట్ కూ తీసుకురావాలనేది 2022 లాజిస్టిక్స్ పాలసీ లక్ష్యాల్లో ఒకటి.. అంటే 6 - 8 శాతం కూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలనే ఆలోచనతో భారత్ పనిచేస్తోంది.ఇక మన రాష్ట్రం విషయానికి వస్తే... 1053 కి.మీ సుదీర్ఘ సముద్రతీరంతో కూడిన అపారమైన వనరులను వినియోగించుకునే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన మారిటైమ్ పాలసీ 2024-29ను కూడా ప్రకటించింది.. ఈ పాలసీ ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మకంగా, ప్రపంచస్థాయి పోర్టులతో మరియు ధృఢమైన మౌలిక సదుపాయాల కల్పనతో అద్వితీయ అభివృద్ధి దిశలో పయనించే విధంగా ఎంతోగానో తోడ్పాటునివ్వనుంది.

2030 నాటికి భారత మారిటైమ్ గేట్ వేగా ఏపీని మార్చేందుకు వీలుగాఈ పాలసీ కార్యాచరణ రూపొందింది. ఈ పాలసీ ప్రకారం ప్రపంచంలోని 20 భారీ పోర్టుల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్ లో ఉండే విధంగా సామర్థం పెంచుకోనుంది. 2047 నాటికి దేశంలోని పోర్టుల్లో నిర్వహిస్తున్న మొత్తం కార్గోలో 20 శాతం ఏపీలోనే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించడం జరిగింది. నౌకల టర్న్ అరౌండ్ సమయాన్ని 15 గంటల కంటే తక్కువకు తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. పోర్టు సంబంధిత వ్యవహారాల్లో 5 వేల మంది నిపుణులను 2028 సంవత్సరం నాటికల్లా తయారు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. రాష్ట్రంలో మారిటైమ్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయనుంది.

# నేటి నుంచి రెండురోజుల పాటు సిఎం ఢిల్లీ పర్యటన

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు 5, 6 తేదీల్లో మరో సారి ఢిల్లీ వెళ్లనున్నారు. 5న ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ పయనమవుతారు. ఆ రోజు ఢిల్లీలో ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. అదేరోజు రాత్రి ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు చేరుకుంటారు. 6వ తారీఖున ఉదయం తన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ నుంచి మళ్లీ ఢిల్లీకి వెళతారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని 7వ తేదీన అమరావతికి చేరుకుంటారు.

# యేటా 60 రోజులు అసెంబ్లీ!

>> ఛైర్మన్ బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఈ పదవి తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, తనను ఛైర్మన్‌గా నియమించినందుకు సభాపతికి ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా, వివేకవంతంగా తమ కమిటీ పనిచేస్తుందన్నారు. ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావు మాట్లాడుతూ తనను ఛైర్మన్‌గా నియమించినందుకు శాసనసభాపతికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ తనకు అప్పగించిన కమిటీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఛైర్మన్ కూనా రవికుమార్ మాట్లాడుతూ ఈ కమిటీల ప్రారంభ సమావేశాన్ని ప్రారంభించాల్సిందిగా శాసనసభ స్పీకర్ను అభ్యర్థించినప్పుడు వారు అంగీకరించినందుకు, అలాగే ఈ కమిటీకి నన్ను అధ్యక్షునిగా నియమించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎప్పటికప్పుడు కంట్రోల్ ఆడిటర్ జనరల్ వారు సూచనలు అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే సంస్థలు ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయ లేదా అనే అంశాలను పరిశీలిస్తామన్నారు. అకౌంటెంట్ జనరల్ వారు పంపే సమాచారాన్ని పరిశీలించి ఆడిట్ పేరాలలోని లోటు పాట్లపై తరచూ సమావేశాన్ని నిర్వహించి, సభ్యుల సహకారంతో అన్ని అంశాలను పూర్తి చేస్తామని తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్య దేవర, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ తల్లూరి భాస్కర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, శాసనసభ అంచనాల కమిటీ మరియు పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీల సభ్యులతో పాటు పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గ్లోబల్ టూరిజం హబ్‌గా రాష్ట్రం


ఐటిబి 2025 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

## జర్మనీలో మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం జర్మనీ రాజధాని బెర్లిన్ చేరుకున్న మంత్రి దుర్గేష్ కు ఎన్ఆర్ఐలు, జనసైనికులు, వీరమహిళలు ఎయిర్ పోర్టులో ఘనస్వాగతం పలికారు. జర్మనీలోని బెర్లిన్ ఎక్స్ పో సెంటర్ సిటీలో 4 మార్చి నుండి 6 మార్చి వరకు జరుగనున్న ఐటీబీ బెర్లిన్2025 సదస్సు కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతినిధిగా మంత్రి దుర్గేష్ వెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాటకు అక్కడి అధికార బృందం సాదర స్వాగతం పలికింది. అనంతరం బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్ సిటీలో ఐటీబీ2025 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ జర్మనీలోని భారత రాయబారి హెచ్.ఈ అజిత్ గుప్తేతో కలిసి పాల్గొన్నారు. ఆ కార్యక్రమం తర్వాత బెర్లిన్ మేయర్ కయ్ వేగ్నర్ ని మంత్రి కందుల దుర్గేష్, ఏపీ టూరిజం ఎండీ ఆమ్రపాలి కాటా ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు తామంతా తోడుంటామని అక్కడి బృందం చెప్పడం గర్వంగా ఉందన్నారు. ఏపీ అంతర్జాతీయ పర్యాటక క్షేత్రాలతో ఆహ్లాదకరమైన దిశలో ఉందన్నారు.

# మూడేళ్లలో భూముల రీసర్వే పూర్తి

>> లనే పిచ్చితో హడావిడిగా రీ సర్వే చేశారన్నారు. పాస్ పుస్తకాలపైన తన బొమ్మలు వేసుకోవాలనే పిచ్చి తప్ప రీసర్వేను సక్రమంగా చేయాలనే ఆలోచన అప్పటి జగన్ రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. దీంతో భూ విస్తీర్ణం, సరిహద్దు, పేర్లు దిద్దుబాటు, భూ వర్గీకరణ సమస్యలపైన భూ యజమానులు అసంతృప్తివ్యక్తం చేశారు.

వీటన్నింటీని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం రీసర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించిందని చెప్పారు. వీటికి సంబంధించి దాదాపు 2,79,712 అర్జీలు రాగా 2,57,881 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన 21,831 అర్జీలను మార్చి 31లోగా పరిష్కరిస్తామని చెప్పారు. వచ్చిన అర్జీల్లో విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు సంబంధించి 99,216 అర్జీలు రాగా 89,473 అర్జీలను పరిష్కరించామని, జాయింట్ ఎల్పీఎమ్ (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) సమస్యపై 64,441 అర్జీలు రాగా 57,527 అర్జీలను పరిష్కరించామని, పేర్లు మార్పు, వ్యక్తిగత వివరాలు, భూమి వర్గీకరణ వంటి రెవెన్యూ అంశాలకు సంబంధించి 1,16,055 అర్జీలు రాగా 1,10,881 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. జాయింట్ ఎల్పీఎమ్ లలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఒకే ఎల్పీఎమ్ లో వేర్వేరు భూ యజమానులు ఉండడంతో వారిని వ్యక్తిగత ల్యాండ్ పార్సిల్స్ గా సబ్ డివిజన్ చేసేంత వరకు వారు తమ ఆస్తులను మ్యుటేషన్ లేదా రిజిస్ట్రేషన్ చేయించడానికి ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. జాయింట్ ఎల్పీఎమ్ లను విడగొట్టి రిజిస్ట్రేషన్ కు అనుకూలంగా మార్చేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ సబ్ డివిజన్ సిటిజన్ సర్వీసులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

సబ్ డివిజన్ చేసుకునే భూ యజమానులకు 01.01.2025 నుండి ఆరు నెలల పాటు ఫీజు నుండి మినహాయింపు నిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు సబ్ డివిజన్ కోసం 71,337 దరఖాస్తులు రాగా 62,816 దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. 22 ఏ 1(సి)లో పెట్టిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉపసంఘం సిఫార్సులతో ఈ భూములపై తగిన నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 05-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల షష్ఠి మ.12.52
కృత్తిక రా.1.07
వర్జ్యం మ.1.52-3.22
దు.ము.12.04-12.51
శుభసమయం : ఉ.6.00-7.00, సా.4.30-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు. ఊహించని సంఘటనలు ఖరుగుతాయి.

**వృషభం :** అనుకోని ప్రయాణాలలో తొందరపాటు వద్దు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించు కొంటారు.

**మిథునం:** ముఖ్యమైన వనులలో ఆటంకాలు ఎదురైన నిదానంగా పూర్తి చేస్తారు దైవదర్శనాలు.

**కర్కాటకం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు. సేవ కార్యక్రమాలలో పాల్గుంటారు.

**కన్య :** సోదరుల నుండి ధన లాభం పొందుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. తీర్థయాత్రలు.

**తుల :** దూరపు బంధువుల నుండి వచ్చిన వార్త చాలా సంతోషం కలుగుతుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**ధనుస్సు:** ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం, వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి.

**మకరం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఇంటాబయటా అనుకూలం.

**కుంభం:** ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వ హిస్తారు. రుణాలు కొంత వరకు తీరుస్తారు.

**మీనం :** మీ కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు ఏర్పడిన సమీర్థ వంతంగా పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎడిసి అధికారులతో వరల్డ్ బ్యాంకు బృందం భేటీ

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) అధికారులతో వరల్డ్ బ్యాంకు బృందం సమావేశమైంది. ఎడిసి సిఎండి డి. లక్ష్మీపార్థ సారథితో బ్యాంకు ప్రతినిధులు రుణం మంజూరు చేస్తున్న ప్రాజెక్టు నిర్మాణాలపై చర్చించారు. ముఖ్యంగా అమరావతి నగరానికి కావాల్సిన మంచినీటి సరఫరాపై చర్చ జరిగింది. మంచినీటి సరఫరా వ్యవస్థకు చేపడుతున్న ముఖ్యమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై అధికారుల నుంచి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో నివసించే ప్రజలకు తాగునీటి లభ్యతకు గల అవకాశాలతో పాటు, నీటిని శుద్ధి చేసి పంపిణీ చేసే వ్యవస్థపై ఏడీసీ అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు రూపొందించినట్టు సీఎండీ వారికి స్పష్టం చేశారు. రాజధాని నగరంలో ఐకానిక్ భవనాలు,ఇతరంశాలపై ఈ సమావేశంలో కీలకంగా చర్చించారు.


# గోదావరిలో బోటు బోల్తా

## పుష్కరఘాట్ వద్ద ఘటన, ఇద్దరి మృతదేహాలు లభ్యం

## సురక్షితంగా బయటపడ్డ పది మంది

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో, మార్చి 4 ప్రభాతవార్త:** పుష్కర్ ఘాట్ వద్దనున్న హేవ్ లాక్ వంతెన వద్ద గోదావరిలో బోటు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ప్రమాదం నుంచి పది మంది సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం మధ్యాహ్నం గోదావరి మధ్యలో సేద తీరేందుకు 23 మంది పుష్కర ఘాట్ నుంచి బోట్లో బయలుదేరి బ్రిడ్జి లంకకు వెళ్లారు. తిరిగి రాత్రి ఏడు గంటల సమయంలో అక్కడి నుంచి 12 మందిని పుష్కరఘాటు తెచ్చి దించేశారు. మరలా బ్రిడ్జిలంక వెళ్లి మిగిలిన 11 మందిని బోట్పై తీసుకొస్తుండగా, హేవ్లాక్ వంతెన 8వ నంబర్ పిల్లర్ను బోటు ఢీకొంది. బోటు పాక్షికంగా ధ్వంసమై, నీరు చేరడంతో నదిలో బోల్తాపడింది. మత్స్యకారులు బోటు నడిపే వ్యక్తితో పాటు, పది మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాజమండ్రి సింహాచలనగర్కు చెందిన ఇస్త్రీ పనిచేసే చవల అన్నవరం (52), కాతేరుకు చెందిన ఏసీ మెకానిక్ గాడ రాజు(23) గల్లంతయ్యారు. స్థాని కులు ఈ విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు సమా చారం ఇవ్వడంతో, సెంట్రల్ జోన్ డీఎస్పీ రమే షబాబు ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది, జిల్లా అగ్ని మాపకాధికారి లూథర్కింగ్, సహాయ అగ్నిమాప కాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, తమ సిబ్బందితో పుష్కరాల రేవుకు చేరు కున్నారు. గల్లంతైన వారి కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.

# ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం



**హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:** ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యకు యత్నించింది. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నిజాంపేటలోని తన స్వగృహంలో నిద్రమాత్రలు మింగింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కల్పన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కల్పన ఆత్మ హత్యకు యత్నించిన విషయం తెలియగానే పోలీసులు ఆమె ఇంటికి వెళ్లి పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా, కల్పన ఆత్మహత్యకు యత్నించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా టాలీవుడ్‌లో అత్యంత పాపులర్ సింగర్ కల్పన ఒకరు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ చిత్రాల్లో అనేక పాటలు పాడారు.

## రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్పు

### - మైనారిటీ మంత్రి ఫరూక్

### - ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు

**విజయవాడ,మార్చి 4,ప్రభాతవార్తప్రతినిధి:** రంజాన్ మాసంలో రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలకు పని వేళల మార్పు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ మేరకు అమరావతిలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందు గానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గత నెలాఖరులోనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 3 తేదీ నుంచి 30 తేదీ వరకు ఉర్దూ విద్యాబోధన పాఠశాలల పని వేళలను మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, తదితర సంస్థల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మార్పు చేశామన్నారు. రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు,ఉర్దూ మీడియం సమాంతర విభాగం మరియు ఉర్దూ మీడియం డైట్ కళాశాలలకు పనివేళల్ల మార్పు వర్తిస్తుందని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు మత పరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి ఒక గంట ముందుగా బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం మరియు ఉర్దూ పాఠశాలల పని వేళల మార్పు పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ముస్లిమ్ సమాజం మరియు తన తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

## స్వచ్ఛాంధ్ర దిశగా ప్రభుత్వం ముందుకు

### మంత్రి నారాయణ

### 2047 నాటికి జీరో వేస్ట్ వాతావరణంలో నివసించే లక్ష్యం



రాజస్థాన్‌లోని వేస్ట్‌మేనేజ్‌మెంట్ పద్ధతులను అక్కడి అధికారులు మంత్రి నారాయణకు వివరిస్తున్న దృశ్యం

**విజయవాడ, మార్చి4, ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యంగా ఏపీలో స్వచ్ఛతా కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళ్తున్నామని పొంగూరు మంత్రి నారాయణ తెలిపారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ లో జరుగుతున్న 12 వ ఆసియా పసిఫిక్ రీజినల్ త్రీ ఆర్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం సదస్సులో మంత్రి నారాయణ పాల్గొన్నారు. సమీకృత వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సంస్కరణలపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సులో చర్చిస్తున్నారు...ఈ సదస్సుకు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్,పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు...కేంద్ర మంత్రితో కలిసి వివిధ దేశాల పెవిలియన్ లను మంత్రి ఆనారాయణ పరిశీలించారు... ఆ తర్వాత వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపైఏపీ విజన్ ను సదస్సులో వివరించారు మంత్రి... 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలనేది ఆంధ్రప్రదేశ్ లక్ష్యం అన్నారు మంత్రి... స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర టార్గెట్ గా ముందుకెళ్తున్నామన్నారు...సీఎం చంద్రబాబు విడుదల చేసిన 2047 విజన్ డాక్యుమెంట్ లో స్వచ్ఛాంధ్ర అనేది కీలక భూమిక పోషిస్తుందన్నారు..పరిశుభ్రత, పర్యావరణ సమతుల్యత, సమగ్ర ఆర్థిక వ్యవస్థ స్వచ్ఛాంధ్ర లక్ష్యాలుగా పెట్టుకున్నామన్నారు.వేస్ట్ మేనేజ్ మెంట్, పొల్యూషన్ కంట్రోల్, వాతావరణ పరిస్థితులు సమతుల్యం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నా మన్నారు.. దీంట్లో భాగంగా వ్యర్థాల నిర్వహణ ద్వారా ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి,బయో సీఎన్జీ ప్లాంట్స్ ఏర్పాటు,ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల ను నెలకొల్పుతున్నామన్నారు..2047 నాటికి జీరో వేస్ట్ క్లైమేట్ రెసిడెన్స్ సాధించేందుకు ఏపీ కట్టుబడి ఉందన్నారు మంత్రి నారాయణ. జాతీయ,అంతర్జాతీయ భాగస్వామ్యంతో వేస్ట్ వాల్యూ సొల్యూషన్స్,క్లైమేట్ అర్బన్ ప్లానింగ్ ద్వారా సమీకృత వృద్ధి సాధించేలా ముందుకెళ్తామన్నారు. అటు అమరావతి నిర్మాణంలో ఉత్తమ పద్ధతులతో ఆకట్టుకునేలా సర్క్యులర్ ఎకానమీ దిశగా సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.స్వచ్ఛాంధ్ర అనేది కేవలం పరిశుభ్రత మాత్రమే కాదని...భవిష్యత్తు తరాలకు నీరు,భూమిని పరిరక్షించాలనే ప్రతిజ్ఞ తో పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు... ఈ సదస్సులో వివిధ దేశాలలో వేస్ట్ మేనేజ్ మెంట్ కోసం తీసుకుంటున్న చర్యలను మంత్రి అధికారులు పరిశీలించారు..ఆ తర్వాత జైపూర్ సమీపంలోని సేవాపుర గ్రామంలోని లెగసీ వేస్ట్ రెమెడియేషన్ ప్లాంట్ ను మంత్రి బృందం పరిశీలించింది...ప్రస్తుతం ఏపీలో 55 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ ఉంది...దీన్ని వివిధ పద్ధతుల ద్వారా తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది...రాజస్థాన్ లో ఉపయోగిస్తున్న టెక్నాలజీని లెగసీ వేస్ట్ మేనేజ్ మెంట్ కోసం ఉపయోగించుకునేందుకు అక్కడి విధానాన్ని మంత్రి బృందం పరిశీలించింది. సదస్సులో వ్యర్థాల నిర్వహణ,పర్యావరణ పరిరక్షణపై కేంద్రంతో కలిసి పనిచేసేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ తో మున్సిపల్ శాఖ,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు ఒప్పందం చేసుకున్నారు...

మంత్రి తో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్,మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,డైరెక్టర్ సంపత్ కుమార్,స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

## తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం ఉచితంగా స్థలాలు కేటాయించండి

### - పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టిటిడి లేఖలు



**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మాన్ని మరింతగా విశ్వవ్యాప్తిచేయడంలో భాగంగా దేశంలోని అన్నిరాష్ట్రాల రాజధానుల్లో దేవదేవుని ఆలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కోరారు. ఈ మేరకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన లేఖరాశారు. రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని దేశంలోని ప్రజలందరికీ చేరువచేయడంతోబాటు హిందూ సనాతన ధర్మాన్ని తెలియజేసేందుకు ఆలయాల నిర్మాణం అవసరం ఉందన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదని, దేవాలయాలు సమాజ అభివృద్ధికి దోహదపడుతాయని తెలిపారు. ప్రతిరాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలని, దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా శ్రీవారి ఆలయాలు ఉండాలన్నారు. కోట్లాదిమంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారని, వాటిని విద్య, వైద్యం, సహా ఇతర సేవా కార్యక్రమాల కోసం ఖర్చుచేస్తున్నామన్నారు.రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఉచితంగా స్థలం ఇస్తే శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ఛైర్మన్ నాయుడు లేఖలో పేర్కొన్నారు.

## అపహరణకు గురైన బాలిక క్షేమంగా తల్లివద్దకు

### - నిందితురాలు ప్రైవేట్ ఉద్యోగిని



**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఆస్థానమండపం వద్ద పనిచేసే కార్మికురాలు కె.కరుణశ్రీ,కె.నరసింహులు కుమార్తె దీక్షిత(04)ఉన్నఫళంగా సోమవారం సాయంత్రం అపహరణకు గురైంది. తల్లిదండ్రులు రాత్రి 7.30గంటల ప్రాంతంలో పాపను గమనించగా కనిపించకపోవడంతో హడావిడిగా ఆందోళనతో తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యేలోపు ఆ మహిళ బాలికను తీసుకుని ఆర్టీసి బస్టాండు మీదుగా బస్సులో తిరుపతికి వెళ్ళినట్లు గుర్తించారు. సిసికెమెరా పుటేజీ సాయంతో బాలికను తీసుకెళ్ళిన మహిళ ఫోటోను కూడా పోలీసులు సామాజిక మాధ్యమాల్లో, టిటిడి వాట్సాప్‌గ్రూపుల్లో, పోలీసు వాట్సాప్‌గ్రూపుల్లో, మీడియా గ్రూపుల్లో ప్రసారం చేశారు. అప్పటికే సమాచారం అందుకున్న తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు,విజిలెన్స్ సిబ్బంది తిరుపతి పోలీసులను అప్రమత్తం చేశారు. బాలిక ఆ చూకీ కోసం పోలీసు బృందాలు నాలుగు విడిపోయి సిసికెమెరాల పుటేజీ ఆధారంగా గుర్తించారు. తిరుమలలో పారిశుధ్యవిభాగంలో శానిటరీ వర్కర్స్ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ(50) విధులు ముగించుకుని బాలికను ఎత్తుకెళ్ళింది. సిసికెమెరా ఆధారంగా గుర్తించడంతోబాటు తోటి కార్మికుల సహాయంతో ఆమె సెల్‌ఫోన్‌నంబర్‌ను కనుగొన్నారు. ఆమె ఫోన్ కాల్స్ ట్రాక్‌లో ఆమె తిరుపతి బస్టాండుకు సమీపంలోని చిన్నకాపువీధిలో నివాసముంటున్నట్లు రాత్రి 11గంటలకు కనుగొన్నారు. ఆమె వివరాలతో తిరుపతి పోలీసులు ఆమె ఇంటిని చుట్టుముట్టారు. అప్పటికే బాలికతో సహా ఉన్న వెంకటరమణమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికను సురక్షితంగా రాత్రి 12గంటలకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుమల,తిరుపతి పోలీసులు సకాలంలో స్పందించి టీమ్ వర్కుతో బాలిక ,నిందితురాలి కదలికలు కనిపెట్టడంతోబాటు కొన్నిగంటల వ్యవధిలోనే పట్టుకోవడంతో నెలకొన్న ఉత్కంఠ తెరపడింది. బాలికను తల్లిదండ్రులకు సురక్షితంగా చేర్చారు. మంగళవారం ఉదయం తిరుమల 1టౌన్ పోలీసుస్టేషన్‌లో తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సిఐలు విజయకుమార్, రాముడు సిబ్బంది పనితీరును ఎస్పీ అభినందించారు. తిరుమలలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం సిసికెమెరాల నిఘా ఉండాలని ఆదేశించారు.

## సమన్వయంతో విధులు, రోప్ పార్టీలతో భక్తులకు భద్రత

### - తెప్పోత్సవాలపై తిరుపతి ఎస్పీ హార్షవర్ధన్‌రాజు తనిఖీలు

**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈనెల 9వతేదీ నుండి ఐదురోజులు జరిగే వార్షిక తెప్పోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తెప్పోత్సవాలు జరిగే పుష్కరిణిలో ,చుట్టూ రోప్‌పార్టీలతో భద్రత చేపట్టాలని, భక్తులు తోపులాటకు అవకాశం లేకుండా వరుసక్రమంలో అనుమతించాలని సూచించారు. టిటిడి విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకుని తిరుమల పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. తెప్పోత్సవాలకు ముందే మంగళవారం మధ్యాహ్నం తిరుమలలోని స్వామివారి పుష్కరిణిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సిఐలు విజయకుమార్,రాముడుతో కలసి తనిఖీ చేశారు. తెప్పోత్సవాల్లో స్వామివారి ఉత్సవర్లు ఊరేగింపు, తెప్పలకు భక్తులను అనుమతించే విషయం, తెప్ప ప్రదక్షణ సమయంలో భద్రతపరంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి ముందుగానే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు ప్రశాంత సేవలందించాలన్నారు.

## అమరావతి ఎలివేటెడ్ కారిడార్‌పై చంద్రబాబు దృష్టి

### డిపిఆర్ సిద్ధం చేసేందుకు టెండర్లు పిలిచిన ఎడిసిఎల్

**రాజంపేట అర్బన్, మార్చి 4 ప్రభాతవార్త** రాష్ట్ర రాజధాని అమరావతిలో ట్రాఫిక్ సమస్య భవిష్యత్తులో ఉండకుండా ముందు జాగ్రత్తగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలివేటెడ్ కారిడార్ పై దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఔటర్ రింగ్ రోడ్డుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో తాజాగా పనిలో పనిగా ఎలివేటెడ్ కారిడార్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 50 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ఏపీ సి ఆర్ డి ఏ, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎ డి సి ఎల్) టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. తాజాగా అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి నిర్ణయం తీసుకుని సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) రూపొందించేందుకు మంగళవారం టెండర్లు కూడా పిలిచింది. డిపిఆర్ టెండర్లు చివరి గడువు ఈనెల 26 గా పేర్కొన్నారు. ఇదే రోజున టెండర్లు ఓపెన్ చేయడంతో పాటు టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేస్తామని ఎడిసిఎల్ పేర్కొంది.

## హంద్రీనీవా ద్వారా రాప్తాడులోని 38 చెరువులకు నీరందించాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిటాల సునీత విజ్ఞప్తి

**అనంతపురం, మార్చి 4, ప్రభాతవార్త బ్యూరో** రాప్తాడు నియోజకవర్గంలోని సాగు, త్రాగునీరు, రైతుల సమస్యల్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అమరావతికి వెళ్లిన ఎమ్మెల్యే సునీత మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. నియోజకవర్గంలో ప్రధానంగా హంద్రీనీవా ద్వారా నీరందించే అంశం గురించి చర్చించారు. హంద్రీనీవా 2వదశలో కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. లైనింగ్ పనులు చేస్తే రాప్తాడు నియోజకవర్గంలో 38చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా.. తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా రాప్తాడులో 70వేల ఎకరాలకు పైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందన్నారు. ఇప్పటి వరకు డిస్ట్రిబ్యూటరి సిస్టమ్ లేనందున తాత్కాలికంగా హంద్రీ నీవా నీటిని కాలువ ద్వారా చెరువులకు సరఫరా



చేస్తున్నారు. ఆయకట్టును స్థిరీకరించి.. పంట కాలవల అభివృద్ధి చేస్తే భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయన్నారు. దీని వలన పరోక్షంగా మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. కావున మా విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. మరోవైపు జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

2018లో అప్పట్లో మీ మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు.

## ఉద్యోగాల నోటిఫికేషన్లకు ముందే ఎస్సీ వర్గీకరణ చేయాలి

**విజయవాడ మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎలాంటి వివాదాలు సమస్యలు లేకుండా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బాగాపొద్దు పోయిన తరువాత వారంతా సమావేశమయ్యారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ల కంటే ముందే ఎస్సీ వర్గీకరణ చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు.ముందు వర్గీకరణ పరిధిలో కీలకంగా ఎస్సీలు ఎవ్వరంతా అనే గణన అవసరమన్నారు.వర్గీకరణ డిమాండ్‌లను గుర్తించాలన్నారు. తెలంగాణలో జరిగిన ఎస్సీ వర్గీకరణపైనా చర్చించారు. తెదేపా ఎమ్మెల్యే రామాంజనేయులు, వర్ల కుమారరాజా, బండారు శ్రావణిశ్రీ ఎంఎస్ రాజుతో పాటు పలువురు మాదిగ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైల్వే రిటైర్డ్ సిబ్బందికి కాంట్రాక్టు పద్ధతిలో పునర్నియామకాలకై ప్రతిపాదనలు

**గుంతకల్లు రైల్వే,మార్చి 4,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను రైల్వేలో ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డ్ సిబ్బందిచే కాంట్రాక్టు పద్ధతిలో పునర్ నియామకాలు చేపట్టేందుకు సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. రైల్వే డివిజన్‌లోని మెడికల్,ఇంజనీరింగ్,డీజిల్ షెడ్‌లలో (గుంతకల్లు,గుత్తి),సి అండ్ డబ్ల్యూ, కమర్షియల్,విద్యుత్ రన్నింగ్,టిఆర్‌డి, జనరల్ సర్వీసులు,ఆపరేటింగ్ విభాగాలలో వేతన లెవెల్-1 నుంచి వేతన లెవెల్-07వరకు ప్రస్తుతం ఉన్న ఖాళీలను రిటైర్డ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో పునర్ నియామకాలు ద్వారా నియమించుకొని ఖాళీల సమస్యను కొంతవరకు నివారించనున్నారు.

## కాలినడకమార్గంలో మళ్లీ చిరుత

### - గాలిగోపురం సమీపంలో మెట్లదారిలో హాల్‌చల్

**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి అలిపిరి నడకమార్గంలో గాలిగోపురం సమీపంలోని మెట్లపై చిరుతపులి సంచరించడాన్ని స్థానిక దుకాణాదారులు కనుగొన్నారు. సోమవారం అర్ధరాత్రి దుకాణాలన్నీ కట్టేసిన తరువాత వ్యాపారులు సమీపంలోనే నిద్రించారు. అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ఓ చిరుత గాలిగోపురం అటవీప్రాంతం నుండి మెట్లమార్గంలో రావడాన్ని సిసికెమెరాల్లో గుర్తించారు. భక్తుల సంచారం లేని సమయంలో ఒక్కసారిగా చిరుతపులి సంచరించడంతో కలకలం రేపింది. అక్కడి దుకాణాల్లో సిసికెమెరాల్లో ఈ విషయం రికార్డుఅయ్యింది. నడకమార్గంలో పిల్లిని వెంబడిస్తూ చిరుత ఇలా వచ్చిందని దాన్ని పట్టుకుని అటవీప్రాంతంలోకి వెళ్ళినట్లు సిసికెమెరాల పుటేజీ ద్వారా కనుగొన్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు, విజిలెన్స్ అధికారులకు తెలియజేయడంతో తెల్లవారు జామున 3గంటలకు భక్తులను అప్రమత్తం చేశారు.ఇప్పటికే నడకమార్గంలో చిరుతపులి సంచారంతో భక్తులు భయంతో నడకసాగిస్తున్నారు. 60మందివరకు భక్తులను గుంపుగా భద్రత సిబ్బంది నడుమ కొండకు అనుమతినిస్తున్నారు. ఇప్పటికే గతనెలలో చిరుతపులి నడకమార్గంలో సంచారంతో ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే 12ఏళ్ళలోపు పిల్లలను,వారి తల్లిదండ్రులతో అనుమతినిస్తున్న విషయం విదిదమే. సాధారణ భక్తులను కూడా నడకదారిల్లో రాత్రి 9.30గంటల వరకు గుంపులుగా పంపుతున్నారు. రెండు వారాల క్రిందట కనిపించిన చిరుత మళ్ళీ మంగళవారం తెల్లవారుజామున మెట్లమార్గంలో రావడంతో అటు స్థానిక వ్యాపారులు భక్తులు హడలిపోతున్నారు. వేసవికి ముందే శేషాచలం అటవీప్రాంతంలో చిరుతల సంచారం మొదలైంది. ఎప్పుడో వస్తాయి పోతాయి అనుకుంటే అంతా పొరబడినట్లే. గత దశాబ్ధకాలంగా తిరుమల కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో తరచూ చిరుతలు సంచరిస్తూ భక్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత మూడునెలల క్రిందట చిరుతల సంచారంతోఏకంగా రాత్రి 9గంటల తరువాత



ఉదయం 6గంటల వరకు ఘాట్‌లో ద్విచక్రవాహనాల ప్రయాణాన్ని నిషేధించిన టిటిడి తాజాగా కాలినడకమార్గంలో చిరుతపులి సంచరించడంతో భక్తులు వణికిపోతున్నారు. చిరుత ఆనవాళ్ళను గుర్తించే పనిలో అటవీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న నడకమార్గాల్లో రక్షణగోడలచుట్టూ ఇనుపకంచె ఏర్పాటుచేస్తే ఇలాంటి ప్రమాదం ఉండదనేది భక్తుల అభిప్రాయం. తిరుమలకు కాలినడక మార్గాల్లో సాధారణ రోజుల్లో 20వేలమందివరకు ,వారాంతంలో 40వేలమంది వరకు భక్తులు వస్తుంటారు.

## ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు, కైలాస నాథుడు,భోళాశంకరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి పల్లకి సేవతో ముగిసాయి.శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాలతో అధికారుల పర్యవేక్షణలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై భక్తులు, స్థానికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అంతేకాక ఉత్సవాలు ప్రారంభానికి రెండు నెలలముందు ఇఓ బాధ్యతలు స్వీకరించారు. దాంతో నెల రోజుల నుంచి ఓ వైపు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మరో వైపు మంత్రులు, జిల్లా ఉన్నత అధికారులు నభూతో నభవిష్యత్తు ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటనలు చేశారు. బడ్జెట్‌ను పెంచు కుంటామని కాసులతో సంబంధం లేకుండా ఉత్సవాల్ని నిర్వహిస్తామని ప్రకటించటంతో భక్తులు ఎంతో సంబరపడ్డారు. అయితే ఆచరణలో అధికారుల మధ్య సమన్వయ లోపం శాపంగా మారింది. ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన సుదర్శనం,సత్వర దర్శనం చేయిస్తామని ప్రకటించిన నాయకులు అధికారులు, సమన్వయంతో పని చేసి విజయం సాధించారు. చక్కటి ప్రణాళికలు రూపొం దించుకున్న అధికారులు, ఆచరణలో విజయం సాధించారు.సామాన్యుని ఉచిత దర్శనం లక్ష్యం విజయవంతం చేయగల్గినారు. మహాశివరాత్రి పర్వదినాన ఎవ్వరైనా సరే తమ ఇష్టదైవం ముల్లోకాల్ని మహేశ్వరుని సుదర్శనం చేసుకోవాలని భావిస్తారు. ఈ మేరకు విజయవంతం చేయగల్గినారు. రెండు వరుసల ఉచిత దర్శనం సత్ఫలితాలనిచ్చింది. పలుకుబడికి స్వస్తి చెప్పారు. సాధారణ భక్తునికి సైతం లింగోద్భవ అభిషేక దర్శనం సాధించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే 13రోజుల ఉత్సవాల్లో కేవలం ఒకే ఒక రోజు ఆలయంలో శివరాత్రి పర్వదినం వేకువ జాముప లింగోద్భవ అభిషేకం.మిగిలిన కార్యక్రమాలన్ని ఉత్సవాలే. గ్రామోత్సవమే. అయితే ఆ ఒక్కరోజు ఉత్సవమే విమర్శలకు అవకాశం కల్పిస్తుంది.ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఈ విమర్శలకు స్వస్తి చెప్పారు. ఉచిత దర్శనంకు సంబంధించిన క్యూలైన్లు ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అలయాధికారి స్పష్టంగా భక్తులకు వివరించలేకపోయారు. ఇక విఐపిలకు మాత్రమే దక్షిణ గోపుర దర్శనం అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గ్రామోత్సవాలు 13 రోజులు భక్తుల మన్ననల్ని అందుకున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సమయ పాలన ఉదయం రాత్రి ఉత్సవాల్ని సకాలానికి తీసుకురావటంతో భక్తులు దర్శనం చేసుకున్నారు. అంతేకాక ఈ ఏడాది ఉత్సవాలకు శాసనసభ్యుడు వారి సహచరుల ఎసిబ్బంది ఎంతో జవాబుదారి తనంతో పని చేశారు.ఇక ఉత్సవాల్లో అలం కారాలు అబ్బో అనిపించాయి. రథోత్సవానికి లక్షలాది మంది జనం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పని చేసిన వారికి భోజనాల ఏర్పాటులో చక్కగా నిర్వహించారు.

## విశ్వవిద్యాలయ కులపతులను బెదిరించి రాజీనామా చేయించారు

### విపక్ష నేత బొత్స సత్యనారాయణ

**సచివాలయం,మార్చి 4,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 17మంది ఉపకులపతులు రాజీనామాలు చేయడంపై మ ండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ప్రారంభమైన బడ్జెట్ చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు.ప్రభుత్వంలోని కొందరు మంత్రులు టిడిపి నాయకులు ఉపకులపతులను బెదిరించి రాజీనామ చేయించినట్లు రాష్ట్ర ప్రజానీకంలో అనుమానాలు ఉన్నాయని తెలిపారు.ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజీనామా అంశాలకు అధికార ప్రభుత్వానికి సంబంధం లేదని ఇది పూర్తిగా గవర్నర్ ఆధ్వర్యంలో నియమించబడతారని తెలిపారు.,దీనికి సంబంధించి పదిమంది కొన్ని కారణాలు చూపుతూ రాజీనామా లేఖలు రాసినట్లు మానవ వనరుల ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.అవసరమైతే ప్రివిలైజ్ కమిటీ వేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని సభ్యులకు తెలిపారు. వైకాపా సభ్యులు పని కట్టుకొని బెదిరించేదని ఆరోపణలు చేయడం సరికాదని ఇది సభా ఉల్లంఘన కింద వస్తుందని వివరణ ఇచ్చారు,ఈ విషయంపై మండల ఛైర్మన్ మోషన్‌రాజు మాట్లాడుతూ బడ్జెట్‌పై చర్చ అనంతరం ఈ విషయాలపై చర్చిద్దామని చర్చను కొనసాగించేలా సభ్యులు సహకరించాలని సూచించారు.గత ప్రభుత్వంలో అర్హతలు లేకుండా ఇషా ్టనురాజ్యంగా సొంత బంధువులను వ్యక్తులను ఉపకులపతులుగా నియమించాలని అందుకే కూటమి ప్రభుత్వం రాగానే వారే వ్యక్తిగతంగా వారి సమస్యలను వివరిస్తూ రాజీనామా లేఖలు రాసినట్లు మాత్రమే లోకేష్ సభ్యులకు తెలిపారు.

## కల్తీ నెయ్యి కేసులో నిందితులు మూడురోజుల సిట్ కస్టడీకి

### - అపూర్వవినయ్‌కాంత్‌చావ్డా బెయిల్ పిటిషన్ విచారణ రేపటికి వాయిదా

**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలో కల్తీనెయ్యి కేసులో నిందితులు ఫొమిల్‌జైన్, అపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను మూడురోజులుపాటు సిబిఐ సిట్ అధికారుల కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. ప్రధాన సూత్రధారుల్లో నిందితులుగా ఉన్న నలుగురిలో ఈ ఇద్దరినీ ఇప్పుడు సిట్ కస్టడీకి రెండవసారి అనుమతించడం, ఇదే కేసులో అపూర్వవినయ్‌కాంత్‌చావ్డా బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 6వతేదీ గురువారానికి న్యాయమూర్తి వాయిదావేశారు. కాగా కల్తీనెయ్యికేసులో నిందితులు ఏ3 విపిన్‌జైన్, ఏ4షోమిల్‌జైన్‌లకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ వారి తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ గురువారం విచారణకు రానుంది. కాగా సిబిఐ సిట్ అధికారులు సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురళీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు సేకరించిన కీలక ఆధారాలు ఆధారంగా కల్తీనెయ్యి వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేసి అసలు కీలక సూత్రధారులు ఎవరనేది వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటికే గతనెలలో ఐదురోజులపాటు నలుగురు నిందితులను సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని విచారణ చేసినా పూర్తి విషయాలు వెల్లడించలేదనేది తెలిసింది.

వార్త

మాటకు మాట ప్రతీకారం కాదు
మౌనమే దానికి సమాధానం.

-ప్లినీ

# శీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు!

'కలలు కనండి, వాటిని నిజం చేసుకోండి' అన్న మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలాం ప్రసంగం విద్యార్థిలోకానికి మంచి సందేశమిస్తుంది. ఇలాంటి స్ఫూర్తిదాయక ప్రసంగాలు, ప్రవచనాలు ఎన్నివిన్నా అఖిలలోక జగత్తు తన్మయత్వంతో విని ఆనందిస్తుంది. ఆ మధ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎక్కడో ఉన్న చైనా బాటలో పిల్లల్ని కనమంటూ ప్రసంగం ఎత్తుకునేసరికి అఖిలాంధ్ర ప్రజానీకం విస్మయం చెందింది. అటుపై మొన్నీమధ్య ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మోహన్ భగవత్ కూడా పిల్లల్ని కనాల్సిన ఆవశ్యకత గురించి విశేష స్ఫూర్తి కలిగించే విషయాలను అందించారు. అవన్నీ ఒక ఎత్తయితే దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ నాయకులు పలు అంశాలపై 'యూటర్న్'లు తీసుకొని ఆసక్తికర ప్రచారం చేపట్టడమే నేటి విశేషం. 2026లో కేంద్రప్రభుత్వం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను చేపట్టనుంది. ఆ కార్యక్రమంలో జనాభా ప్రాతిపదికగా చేపడితే ఆయా రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యలు మారిపోతాయి. అదే ఈ అలజడికి ప్రధాన కారణం. కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని బిజెపియేతర రాజకీయ పార్టీల అధినేతలు అభిప్రాయపడుతున్నారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించగా, ఉత్తరాదిలో జనాభా విస్ఫోటనం నందున జనాభా ప్రాతిపదికను తీసుకుంటే ఉత్తరాదికి లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుంది. తమిళనాడులో ప్రస్తుతం 39 ఉండగా 8 స్థానాలు తగ్గుతాయి. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు నాలుగేసి స్థానాలు తగ్గుతాయని అంచనా వేశారు. తాజాగా దేశంలోని చాలా రాష్ట్రాలు రేపొచ్చే డిలిమిటేషన్ తమతమ రాష్ట్రాల కొంప ముంచుతుందనే ఆలోచనలోకి వచ్చాయి. వారి వాదనలో నిజంలేకపోలేదు. అయినా ఎన్నికలు, నియోజకవర్గాలు, రాజకీయ భవిష్యత్‌ల గురించి ఆలోచనలను విశ్లేషిస్తూ కొన్ని విస్మయం కలిగించే సందేశాలిస్తున్నారు. అంతేకాదు జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల నిర్ణయం జరిగితే ఉత్తరాదిన లోక్‌సభ స్థానాలు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ నియోజక వర్గాలు తగ్గిపోతాయని, ఒక రాజకీయ విశ్లేషణ మొదలైంది. ఇప్పటికిప్పుడు నవదంపతులు అర్జంట్‌గా పిల్లల్ని కనేస్తే నియోజకవర్గాలు పెరుగుతాయనే రాజకీయ ఆవేదనను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రస్తావించారు. అదేదో ఆదేశం కాదు ఆవేదన మాత్రమే. ఇదే స్టాలిన్ గతంలో ఒకసారి మాట్లాడుతూ కొత్త దంపతులు సంతానం విషయంలో తొందరపడొద్దనీ సమయం తీసుకోవాలని కోరారు. మళ్లీ అదే నీటితో నిన్నమొన్నటి నాగపట్నం మీటింగ్‌లో స్టాలిన్ మారిన పరిస్థితుల రీత్యా పెళ్లయిన వెంటనే యువ దంపతులు పిల్లల్ని కనే పనిలో పడాలని, అలా పుట్టిన వారికి ఓ తమిళ నామకరణం చేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఏ యువ జంటయినా కొంతకాలం ఎంజాయ్ చేశాక సంతానం గురించి ఆలోచించాలనే ధోరణిలో ఉన్నారు. వివాహానికే తొందర పడటం లేదు. వాళ్లఆలోచనలు మార్చడం ఎవరికీసాధ్యం కాదనే రోజుల్లోకి వచ్చాము. ఒకప్పుడు తమిళనాడు కుటుంబ నియంత్రణ కార్యక్రమాల్లో ముందుండేది. కానీ స్టాలిన్ తాజా పిలుపు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనన్నది భవిష్యత్ లోనే తెలుస్తుంది. ఏమయినా కేంద్రప్రభుత్వ విధానాల రూపకల్పన దారి తప్పినప్పుడు దాని దుష్ఫలితాలు ఎలా ఉంటాయన్నది బేరీజు చేసుకోవాల్సి ఉంటుంది. అవేమీ ఆలోచించకుండా సమయోచిత నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్రప్రభుత్వం ఏకపక్ష ధోరణిని అవలంబిస్తే దేశ సామాజిక ప్రయోజనాలు దెబ్బతినే అవకాశముంది. ఏ పెళ్లికయినా వెళ్లి దంపతులు ఆశీర్వచనానికి వచ్చినప్పుడు చెప్పేది 'దీర్ఘసుమంగళీభవ'! అనడం కద్దు. ఈ వచనానికి అర్థం, భార్యాభర్తలిద్దరికీ సుఖసంతోషాలతో ఉండమని దీవెన. కానీ స్టాలిన్ ఈ మధ్య కొళత్తూర్ గ్రామంలో ఓ పెళ్లికెళ్లి వధూవరుల్ని శీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు! అని దీవించారు. తమిళనాడు భవిష్యత్ గురించి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఎంత ఆరాటపడ్డారో అంతే స్థాయిలో స్టాలిన్ కూడా ఆరాటపడ్తున్నారు. అందుకే కేంద్రంతో తలపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఆ రాష్ట్రంలోని ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన 40రాజకీయ పార్టీలకు ఆహ్వానాలు పంపారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు జనాభా నియంత్రణ వంటి అన్ని అంశాలలోనూ ఉత్తరాదికన్నా గణనీయమైన మెరుగైన పనితీరు కనబరించాయని బిజెపియేతర రాష్ట్రాల వాదన. జనాభా కంటే ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న ఆర్థిక సహకారాన్ని దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల విభజన చేపట్టడం అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాది రాష్ట్రాల దన్ను ఎక్కువగా ఉన్నందున అందిస్తున్నందున నియోజకవర్గాలు తగ్గనీయ రాదని కోరుతున్నారు. దక్షిణాది ప్రాంతాల రాజకీయ ప్రాతినిధ్యం ఏ విధంగానూ తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేసినా,నమ్మేపరిస్థితి కానరావడం లేదు. అందుకే దక్షిణాది రాజకీయవేత్తలకు సందేహాలున్నాయి. కాగా నియోజకవర్గాల సంఖ్య పెరగడం కోసం ఉన్నట్టుండి జనాభాను పెంచుకోవాలన్న స్టాలిన్ పిలుపును మిగతా రాష్ట్రాలు అనుసరించకపోవడం విశేషం. జనాభా సంఖ్యను పెంచడమే తరుణోపాయమనే ప్రతిపాదన ఎవరికీ రుచించడం లేదు. ఆలోచించాల్సిన విషయం.

> నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో, విజయం అంత అధికంగా లభిస్తుంది.
>
> బెర్నార్డ్ షా



> ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.
>
> సిసిరో



## ప్రజావాక్కు



### రాజ్యాధినేతలు పట్టుదల వీడాలి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో రష్యా,ఉక్రెయిన్ మధ్య యుద్ధ నివారణ నిమిత్తం జరిగిన శాంతి చర్చలు చాలా వాడిగావేడిగా మాటల యుద్ధం జరిగింది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థితికి మర్యాదాలు దిగజారాయి. ట్రంప్ అనేక రకాలుగా జెలెన్‌స్కీని భయపెట్టాలని చూసినా ఈయన లొంగలేదు సరికదా గట్టిగానే మాట్లాడడం జరిగింది. నీవల్ల మూడవ ప్రపంచయుద్ధం రానున్నదన్నా జెలెన్‌స్కీ ఏమాత్రం తొణకలేదు. ఇదివరలా ప్రపంచ యుద్ధానికి ఎవరూ సిద్ధంగా లేరు.ఈసంభాషణలను అమెరికాలోని డెమోక్రటిక్ పార్టీయే కాకుండా మొత్తం యూరోపియన్ దేశాలన్నీ ట్రంప్‌ను తప్పుపట్టడం జరిగింది.మరొకసారి ఇటువంటిసంధి చర్చలు భారత ప్రధాని నరేంద్రమోడీసమక్షంలో ఇండియాలో జరగాలి.రెండు యుద్ధరాజ్యాధినేతలు వారి పట్టుదలలను తగ్గించుకోవాలి. స్నేహబంధాలను పెంచుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సీజన్ టిక్కెట్లు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలో బస్సులలో ప్రయాణం చేయాలంటే చంటి పిల్లలు వృద్ధులు, వికలాంగులు చాలా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఉంటుంది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో ప్రతి బస్సులోప్రయాణికులలో మహిళల ప్రయాణికుల సంఖ్యతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. వికలాంగుల సీట్లను కూడా వారికి ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ శాఖ వారు వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.ప్రతి బస్టాండ్‌లో సెక్యూరిటీ గార్డ్‌తో వికలాంగులను, వృద్ధులను, పసి పిల్లలను, మహిళలను క్యూలైన్‌లో బస్సులలో ఎక్కించవలసినపరిస్థితి వస్తుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### ఆత్మపరిశీలనే మార్గం

ఫాంహౌజ్ నుండి పరిపాలన చేయడం, కుటుంబ పరిపాలననుప్రోత్సహించడం,ప్రతిపక్షాలను బూతులు తిట్టడం, అవినీతిని అరికట్టలేకపోవడం,1000ఎకరాలున్న భూస్వాములకు రైతు బంధు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, సంక్షేమ పథకాలు తాయిలాలుగా ఇస్తే ప్రజలు ఓట్లువేస్తారని భావించడంతోనేఅధికారాన్ని కోల్పోయాడు.

- పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, తిరుమలగిరి సాగర్

### పెండింగు స్కాలర్ షిప్‌లు చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదలచేయాలి. ప్రైవేటు యాజమాన్యాలు కాలేజీ ఫీజు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికేట్‌లు ఇస్తామని అంటున్నారు.దీంతో ఉన్నతచదువులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు. కావున వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్ రిలీజ్ చేస్తే ప్రైవేటు విద్యాసంస్థలకు కూడా ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి విద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వీలు ఉంటుంది. కాబట్టి వీలైనంత త్వరగా స్కాలర్ షిప్‌లు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### బస్సులు నడపాలి

పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ పట్టణాలకు బస్సులు నడపాలి. పలు గ్రామాలకు చాలా తక్కువ సంఖ్యలో బస్సులు నడుస్తున్నాయి. ఇలాంటి గ్రామాలకు దగ్గరలో ఉన్న గ్రామాలను అనుసంధానం చేస్తూ, పట్టణాలకు బస్సులు నడపాలి. ఇలా చేయడం వల్ల చాలా మంది సామాన్య ప్రజలకు ప్రజా రవాణా సుగమం అవుతుంది. ఆర్టీసి వారు ప్రజల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచాలి. ఉదయం, సాయంత్రం వేళలో మరిన్ని బస్సులు నడుపుటకు చర్యలు తీసుకుంటే చాలా బాగుగా ఉంటుంది. ఆర్టీసీవారు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### కల్తీమయం

నేడు ఏది చూసినా కల్తీమయమే. శీతల పానీయాలు, పచ్చళ్లు, పాలు, నీళ్లు, నెయ్యి,నూనెలు, సౌందర్య ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు,మిఠాయిలు,ఆహారపదార్థాలు, అన్నిటిలోను కల్తీయే. ముఖ్యంగా మనం తినే వివిధ పదార్థాలలో కల్తీ బాగా జరుగుతుంది. అధిక లాభాలకు ఆశపడి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు, నాసిరకం వస్తువులు కలిపి కొందరు వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. కొన్నిచోట్ల తక్కువ ధరకే టిఫిన్లు, ఆహారం లభిస్తుండడంతో వాటిని తిని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని పేరున్న హోటళ్లు, రెస్టారెంట్‌లు సైతం ఆహారం కల్తీ చేస్తుండడం శోచనీయం. కాబట్టి ప్రజలు కల్తీ బారినపడకుండా జాగురూకతతో ఉండాలి. కల్తీని నివారించడం ఒక్కరి వల్లనే కాదు అందరి వల్ల అది సాధ్యం.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# డబ్ల్యుహెచ్‌ఒపై అమెరికా నిధుల ప్రభావం

**ఆధునిక డిజిటల్ యుగంలో పెరుగుతున్న మానవతప్పిదాలు, దెబ్బతింటున్న జీవవైవిధ్యాలు, జంతువులతో మనిషికి పెరుగుతున్న అనుబంధాలతో రానున్న రోజుల్లో ప్రమాదకర మహమ్మారులు వచ్చేఅవకాశాలు ఎక్కువగా ఉన్నందున, ప్రపంచ దేశాలు ఒకే వేదిక మీదచేరి ప్రపంచ ఆరోగ్యసమస్యలకు తగు పరిష్కారాలను వెంటవెంటనే కనుగొనడానికి ఏకతాటిమీద నిలబడాల్సిందిపోయి, నేడు అమెరికా ట్రంప్‌ఆవేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచదేశాలకే కాకుండా అమెరికాకు కూడా ప్రతికూలంగా మారవచ్చని తెలుసుకోవాలి. ఒకవేళ అమెరికా తొలగితే డబ్ల్యుహెచ్‌ఒను కాపాడుకోవడానికి ఇతర దేశాలు పెద్దమనసు చేసుకొని నిధుల కొరతలేకుండా జాగ్రత్తపడుతూ, అమెరికా ట్రంప్‌పశ్చాత్తాపం చెందేవిధంగా గుణపాఠం నేర్పుతూ అమెరికా పెద్దరికాన్ని ప్రశ్నార్థకం చేయాలి. ఏ దేశం తొలగినా ప్రపంచ ఆరోగ్య సంస్థను మిగిలిన దేశాలు కాపాడుకోవాలని కోరుకుందాం.**

బి.మధుపాళి

డెబ్భైఎనిమిదేళ్లు దాటుతున్న నవ యువకుడు డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా 20 జనవరిన ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆగమేఘాల మీద వందకు పైగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై సంతకం చేయడంతో సమీప భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా వాటి ప్రభావం ఏమేరకు పడనుందో అనే చర్చ సర్వత్రా వినిపిస్తున్నది. అక్రమ వలసదారులను తిరిగి తమతమ దేశాలకు పంపడం ప్రారంభమైనది. భారత్‌కు చెందిన 20వేలకు పైగా యువత వద్ద సరైన పత్రాలు లేవని, 2,467 మందిని ఇప్పటికే అక్రమ వలసదారులుగా గుర్తించామని యూఎస్‌ఏ ఇమ్మిగ్రేషన్ అధికారులు తెలపడం వింటున్నాం. మొదటి బ్యాచ్‌గా 104 మంది భారతీయ యువతను అక్రమ వలసదారులంటూ వారి సైనిక విమానంలో 06 ఫిబ్రవరి 2025న అమృత్‌సర్‌లో దించడం జరిగిపోయింది. మన ప్రధాని నరేంద్ర మోడీ 13 ఫిబ్రవరిన అమెరికా పర్యటన ఖరారైన వేళ ఈ డిపోర్టేషన్ జరగడం కొంత ఆశ్చర్యకరంగా తోస్తున్నది. అక్రమ వలసదారుల సమస్యతోపాటు చైనా,మెక్సికో, కెనడా లాంటి పలు దేశాలపై దిగుమతి సుంకాలు అధికంగా విధించడానికి కూడా నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా ఐక్యరాజ్యసమితిలో ఒక ప్రధాన అంగంగా సేవలందిస్తున్న 'ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్' లేదా 'డబ్ల్యుహెచ్‌ఒ' నుంచి తాము తప్పుకుంటున్నామని కూడా ఒక సంచలన నిర్ణయం ప్రకటించడం జరిగింది. ఈ నిర్ణయం వల్ల ప్రపంచ మానవాళి ఆరోగ్య పరిరక్షణ యజ్ఞానికి తీవ్ర విఘాతం కలుగుతుందని, దీనితో అమెరికాకు కూడా కొంత నష్టం వాటిల్లవచ్చని వివరిస్తున్నారు. రెండవప్రపంచ యుద్ధం మిగిల్చిన గాయాలకు లేపనాలు రాసుకుంటూ ప్రపంచ దేశాలు విశ్వమానవ ఐక్యత సాధనే ఏకైక మార్గమని, 3వ ప్రపంచ యుద్ధం రాకుండా జాగ్రత్త పడడానికి 194దేశాలు ఒకే వేదికపైచేరి ఐక్యరాజ్యసమితి అనే పెద్దన్నను 1948లో ఏర్పాటు చేయడం, అందులో ఒక ప్రధాన విభాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ లేదా డబ్ల్యుహెచ్‌ఒ అనే సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. డబ్ల్యుహెచ్‌ఒ సంస్థకు ఆర్థికవనరుల విరాళాలను ప్రపంచ సభ్యదేశాలు, ముఖ్యంగా అభివృద్ధిచెందిన దేశాలు ప్రతిఏటా పెద్ద మొత్తంలో అందిస్తూ వస్తున్నాయి. డబ్ల్యుహెచ్‌ఒ వేదికగా ప్రపంచ వ్యాప్తంగా ఎగిసిపడే కరోనా, జికా, హెచ్‌ఐవి లాంటి వైరస్ అంటు రోగాలు, వైరస్ మహమ్మారి విపత్తుల హెచ్చరికలు, దీర్ఘకాలిక హృదయనాళ, మధుమేహ, బిపీ, క్యాన్సర్‌లాంటి అసంక్రమిక వ్యాధుల పట్ల ప్రపంచవ్యాప్త నిఘా, అధ్యయనాలు, అవసర దేశాలకు టీకాలు అందించడం, టీకాలను రూపొందించడం, అత్యవసర మందుల సరఫరా, వైద్య సహాయాలు చేయడం లాంటి లక్ష్యాలు అధిగమించే మహత్తర బాధ్యతలను నిర్వహిస్తున్నది. ప్రపంచ మానవాళిని హడలెత్తిస్తున్న పోషకాహారలోపం, టీకా మందుల కొరత, అత్యల్ప ఆదాయదేశాల్లో ఆకలి చావులకు తగు పరిష్కారాలను చూపడంలో కూడా డబ్ల్యుహెచ్‌ఒ విశేష కృషిచేసింది, చేస్తున్నది. ప్రపంచం నుంచి పోలియో, స్మాల్‌పాక్స్, ట్రాకోమా (అంధత్వ కారణ) నిర్మూలన సుసాధ్యం కావడంలో డబ్ల్యుహెచ్‌ఒ పాత్ర వెలకట్టలేనిది. ఆరోగ్య సంరక్షణకు గొడుగుపడుతున్న డబ్ల్యుహెచ్‌ఒ కొన్ని సందర్భాల్లో విమర్శలు కూడా ఎదుర్కొన్నది. సమయానుకూలంగా ప్రపంచ దేశాలకు ఆరోగ్య సమస్యల పట్ల హెచ్చరికలు చేయడం, ప్రాంతాల వారీగా వైద్య ఆరోగ్య స్థితిగతులను అధ్యయనం చేసి వివరించడం లాంటి విశిష్టసేవలకు వేదికగా నిలుస్తున్నది డబ్ల్యుహెచ్‌ఒ. దీనికి కావలసిన ఆర్థిక చేయూతను ప్రతిఏటా ముఖ్యమైన దేశాలు విరాళాల రూపంలో నిధులను అందిస్తున్నాయి. డబ్ల్యుహెచ్‌ఒ ద్వైవార్షిక బడ్జెట్ 6.8 బిలియన్ డాలర్లు ఉంటుందని, ఈ నిధుల్లో కేవలంఅమెరికా మాత్రమే అధికశాతం (2022-23లో దాదాపు 1.3 బిలియన్ డాలర్లు) నిధులను అందిస్తున్నది. డొనాల్డ్ ట్రంప్




తొలిసారి అధ్యక్షుడిగా పదవీకాలం 2000 సంవత్సరంలో చైనాలోని వూహాన్ ప్రాంతంలో జనించిన కరోనా వైరస్ ప్రపంచ దేశాలను చుట్టుముట్టి నాటి 800 కోట్లకు పైగా ప్రపంచ జనాభాకు ఊపిరాడకుండా చేయడం, కోట్ల మంది ప్రాణాలు విడవడం లేదా ఆసుపత్రులపాలు కావడం, దాని ప్రభావంతో నేడు కూడా ప్రజారోగ్యం దెబ్బ తినడం జరిగిన విషయం మనకుతెలుసు. 1956లో నాటిసోవియట్ యూనియన్, పశ్చిమ యూరోప్ దేశాలుకూడా ప్రచ్ఛన్న యుద్ధం విషయంలో ఐరాసతో విభేదించి డబ్ల్యుహెచ్‌ఒ నుంచి తొలగిపోవడం జరిగిందని తెలుసుకోవాలి. చైనా నుంచి ఎగిసిన కరోనా వైరస్ గూర్చి డబ్ల్యుహెచ్‌ఒ సత్వరమే సరైన పద్ధతిలో స్పందించి ప్రపంచ దేశాలకు తగు హెచ్చరికలు చేయలేదని, చైనాను కాపాడేందుకు, ఆ దేశానికి వత్తాసు పలికే విధంగా ప్రవర్తించిందని, సరైన సమయంలో సరైన సూచనలు లేదా సంస్కరణలు చేయడంలో విఫలం అయిందని, తటస్థ సంస్థగా అన్ని దేశాల మన్ననలు పొందలేదని, కొన్ని దేశాల రాజకీయాలకు తలొగ్గిందని ట్రంప్ అభిప్రాయపడడం జరిగింది. అదే క్రమంలో డబ్ల్యుహెచ్‌ఒకు అవసరమైన నిధుల కల్పనలో తమ దేశంపై అత్యధిక భారం పడుతున్నదని (18 శాతం), ప్రపంచ దేశాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని, తనకన్న 300 శాతం అధిక జనాభా కలిగిన చైనా నుంచి అతి తక్కువ నిధులు పొందుతున్నదనే అక్కసుతో తాము డబ్ల్యుహెచ్‌ఒ నుంచి తొలిగిపోతున్నామని 2020లోనే ట్రంప్ ప్రకటించారు. తర్వాత జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ గెలిచిన వెంటనే 2021లో ఆ ఉపసంహరణ నిర్ణయాన్ని వాపసు తీసుకోవడం చూసాం. నేడు 2025లో ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన వెంటనే మళ్లీ పాతపాటే పాడుతూ డబ్ల్యుహెచ్‌ఓ నుంచి తొలుగుతున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయడంచూస్తున్నాం. ఈనిర్ణయాన్ని తప్పనిసరిగాఅమెరికన్ కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉందని గమనించాలి. నేటి ట్రంప్ టెంపరి నిర్ణయంతో ప్రపంచ ఆరోగ్య సంరక్షణ సంక్షోభంలో పడనున్నట్లు కూడా విశ్లేషిస్తున్నారు. నేడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం వెంటనే అమలులోకిరాదని, వచ్చేఏడాది మాత్రమే దానిప్రభావం పడుతుందని తెలుసుకోవాలి. ఆధునికకాలంలో ప్రపంచంలో ఏమూలన కరోనాలాంటి వైరస్ పుట్టుకు వచ్చినా ప్రపంచ దేశాలన్నింటికి దాని దుష్ప్రభావం వెంటనే పడుతుందనే ఇంగిత జ్ఞానాన్నిమరిచి, తాను తమ దేశ ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తానని ట్రంప్ అనడం అవివేకమని విశ్లేషిస్తున్నారు. డబ్ల్యుహెచ్‌ఒ నుంచి అమెరికా తొలగిపోవడం వల్ల ప్రపంచ దేశాలకే కాకుండా యూఎస్‌ఏకు కూడా రానున్న రోజుల్లో పెనుప్రమాదం ఎదురుకావచ్చని విశ్లేషిస్తున్నారు. నేడు అమెరికాలో ప్రతియేటా 30,000 మంది వృద్ధులు ఇన్‌ఫ్లుయెంజా కారణంగా మరణిస్తున్నారని, ఇలాంటి ప్రజారోగ్య సమస్యకు టీకా మందు కనుగొనడానికి డబ్ల్యుహెచ్‌ఒ చొరవ అవసరం అవుతుందని అమెరికా గమనించాలి. నేడు ట్రంప్ తీసుకున్న ఉపసంహరణ నిర్ణయం కొనసాగితే ఒక వైపు చైనా,రష్యాలాంటి దేశాల సహాయంతో డబ్ల్యుహెచ్‌ఒ కొనసాగుతూ ప్రపంచ దేశాలకు అవి చేరువ కావడానికి ద్వారాలు తెరుచుకుంటాయని, మరోవైపు పలు దేశాలతో అమెరికా సంబంధాలు బలహీనపడతాయని వింటున్నాం.2020లో అమెరికా ఉపసంహరించుకున్న వెంటనే చైనా 30మిలియన్ డాలర్ల ఆర్థిక విరాళ సహాయం చేస్తానని డబ్ల్యుహెచ్‌ఒకు తెలుపడం గమనార్హం.ఆధునిక డిజిటల్ యుగంలో పెరుగుతున్న మానవతప్పిదాలు, దెబ్బతింటున్న జీవవైవిధ్యాలు, జంతువులతో మనిషికి పెరుగుతున్న అనుబంధాలతో రానున్న రోజుల్లో ప్రమాదకర మహమ్మారులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, ప్రపంచ దేశాలు ఒకే వేదిక మీద చేరి ప్రపంచ ఆరోగ్య సమస్యలకు తగు పరిష్కారాలను వెంటవెంటనే కనుగొనడానికి ఏకతాటి మీద నిలబడాల్సిందిపోయి, నేడు అమెరికా ట్రంప్‌ఆవేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచదేశాలకే కాకుండా అమెరికాకు కూడా ప్రతికూలంగా మారవచ్చని తెలుసుకోవాలి. ఒకవేళ అమెరికా తొలగితే డబ్ల్యుహెచ్‌ఒను కాపాడుకోవడానికి ఇతర దేశాలు పెద్ద మనసు చేసుకొని నిధుల కొరత లేకుండా జాగ్రత్త పడుతూ, అమెరికా ట్రంప్ పశ్చాత్తాపం చెందే విధంగా గుణపాఠం నేర్పుతూ అమెరికా పెద్దరికాన్ని ప్రశ్నార్థకం చేయాలి. ఏదేశం తొలగినా ప్రపంచ ఆరోగ్య సంస్థను మిగిలిన దేశాలు కాపాడుకోవాలని కోరుకుందాం, ప్రపంచ ప్రజారోగ్యానికి డబ్ల్యుహెచ్‌ఒ గొడుగుపడదాం. ●

# పరీక్షా సమయంలో పరేషాన్ ఎందుకు?

డాక్టర్ మోటె చిరంజీవి

మొదట ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివిన తర్వాత అందులో చదువని ప్రశ్నలు ఉన్నా కంగారు పడవద్దు. ఎందుకంటే ఇంకా చాలా ఇతర ప్రశ్నలుంటాయి గనుక. ప్రశ్నపత్రంలో అన్ని తెలిసిన ప్రశ్నలే రావు. చదివిన ప్రశ్నలే రావు. అలాంటప్పుడు మనస్సును నిర్మలంగా,నిచ్చలంగా ఉంచుకొని సమాధానాలను రాయాలి. విద్యార్థుల మేధస్సును పరీక్షించడానికి కొన్ని స్థాయిలలో ప్రశ్నలు అడగడం జరుగుతుంది. కావున ఎటువంటి టెన్షన్ లేకుండా, కూల్‌గా ఆలోచించినట్లయితే విద్యార్థులు పరీక్షలను బాగా రాయగలుగుతారు. పరీక్ష రాసేటప్పుడు ఇచ్చిన సెక్షన్, ప్రశ్న నెంబర్, స్పష్టంగా మార్జిన్‌లో మాత్రమే రాయాలి. విద్యార్థులు వారికి తెలిసిన, వారు చదివిన ప్రశ్నలను మొదట ఎంచుకుని జవాబులను స్పష్టంగా రాయాలి. అలా రాసినప్పుడు విద్యార్థులకు కొంత ఉపశమనం కలిగి, నేను రాయగలను అనే నమ్మకం ఏర్పడుతుంది. అంతేగానీ మొదటనే కొట్టివేతలతో అసంపూర్తిగా సమాధానాలను రాయరాదు. మొదటగా పూర్తిగా జవాబులు వచ్చిన వాటిని రాసినపిదప, మిగతా జవాబులను రాయాలి. అవసరమైన చోట జవాబులకు సంబంధించిన చిత్రాలు కొట్టివేతలు లేకుండా వేయాలి. వాటికి కూడా మార్కులు ఉంటాయి. కాబట్టి అవసరం జవాబుకు మాత్రమే ఆన్సర్ షీట్‌లో చిత్రాలను గీయాలి.ఒక జవాబు పూర్తి అయిపోయాక పెన్సిలుతో కానీ, పెన్నుతో కానీ అడ్డంగా ఒక లైన్‌డ్రాచేసి మరోకప్రశ్నకు జవాబు మొదలు పెట్టాలి. పరీక్షా పత్రంపై మీ సొంత వివరాలు అనగా ఫోన్ నెంబర్, మీ అడ్రస్ లాంటివి రాయకూడదు. ఒక ప్రశ్నకు ఎంతవరకు సమాధానం రాయగలవో, అంతవరకు ఖచ్చితంగా రాయాలి.ఒకవేళ పూర్తిగా విద్యార్థులు రాయలేకపోయినా, రాసిన జవాబును బట్టి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రశ్నకుకేటాయించిన మార్కులను బట్టి మనంరాసే సమాధానం ఉండాలి. ఎక్కువ మార్కులు ఉన్నదానికి ఎక్కువ పంక్తుల్లో సమాధానం రాయాలి. తక్కువ మార్కులు ఉన్న వాటికి తక్కువ పంక్తుల్లో సమాధానం రాయాలి.పిల్లలు పరీక్షాకాలంలో పరీక్షకు వెళ్లేముందు వారి వస్త్రధారణ మీదనే సమయం ఎక్కువ కేటాయించుతారు.ఇక్కడ ఒక్కవిషయం మరువరాదు. సంవత్సర కాలం చదివిన అంశాలను గుర్తుపెట్టుకుని విజయవంతంగాపరీక్ష రాయడానికి,విద్యార్థులు తమ సమయం కేటాయించాలి. అంతేగానీ ఇతర అనవసరవిషయాలపై మాత్రం దృష్టి పెట్టరాదు.సమయం ఉంటే రాయవలసినదానికన్నా ఎక్కువ జవాబులు రాస్తేమంచిది. ఇక ఇంటివద్ద విద్యార్థులుసెల్‌ఫోన్‌కు, ఆటలకు దూరంగా ఉండాలి. దానివల్ల మనకు తెలియకుండానే ఎక్కువ సమయం వృథా అవుతుంది. పరీక్షా సమయంలో టీవీ,సెల్‌ఫోన్, సినిమాలు,కంప్యూటర్‌కు దూరంగా ఉంటే చాలామంచిది. ఎంటర్టైన్మెంట్‌కు కాకుండా ఎడ్యుకేషన్‌కు ప్రయారిటి ఇవ్వాలి. పరీక్షల సమయంలో సులువుగా జీర్ణమయ్యే ఆహారంతీసుకుంటేమంచిది. ఎక్కువగా నూనె పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులు తీసుకోవాలి. పండ్లరసాలు, పండ్లు, సులువుగా జీర్ణమయ్యే పదార్థాలను ఆహారంగా తీసుకుంటే మంచిది. ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకోవడంవల్ల, అనారోగ్యంపాలైతే ఈ సమయంలో పరీక్షలు మంచిగా రాయక, ఇబ్బందులుపడాల్సి వస్తుంది.ఏదైనాపరీక్ష సమయంలో చిన్న అనారోగ్య సమస్య ఉన్ననూ ప్రతీ సెంటర్లో ప్రథమచికిత్స అందించే ఏర్పాటు ఉంటుంది. అందుకే అంటారు పెద్దలు, మీ చేతుల్లోనే మీ భవిష్యత్తు ఉందని,మీ తలరాతకు మీరే బాధ్యులు కాబట్టి, మంచి గమ్యంవైపు పయనించండి, కొన్ని కఠిన నిర్ణయాలు, నియమాలు పాటించినట్లయితే విజయం మీ సొంతం. ●

# త్రిభాషా సూత్రంపై రాష్ట్రాల వ్యతిరేకస్వరం!

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశం భాషాపరంగా విభిన్నమైన దేశం, దేశ వ్యాప్తంగా అనేక భాషలు మాట్లాడతారు. పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం, భారతదేశంలో సుమారుగా 780 భాషలు మాట్లాడబడుతున్నాయి. ఇది పాపువా న్యూగినియా తర్వాత ఒకే దేశంలో మాట్లాడే అత్యధిక భాషలలో రెండవది. ఈ భాషలు అనేక భాషా కుటుంబాలకు చెందినవి. వీటిలో ఇండో ఆర్యన్ భాషలు 78.05శాతం భారతీయులు మాట్లాడతారు. ఈ కుటుంబంలో ఎక్కువగా మాట్లాడే భాష హిందీ. ద్రావిడ భాషలు 19.64శాతం భారతీయులు మాట్లాడతారు. ఈ కుటుంబంలో తెలుగు, తమిళం, కన్నడ,మలయాళం అత్యంతప్రముఖ భాషలు. ఆస్ట్రోఏషియాటిక్ భాషలు దాదాపు 1.2శాతం భారతీయులు మాట్లాడతారు. సంతాలి, ముండారి వంటి భాషలు ఈ కుటుంబంలో భాగమయ్యాయి. సినోటిబెటన్ భాషలు దాదాపు 0.8శాతం మంది భారతీయులు మాట్లాడతారు. టిబెటన్ లడఖీ వంటి భాషలు ఈ కుటుంబంలో భాగం.వీటిలో చాలా భాషలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. కొన్ని రాష్ట్ర లేదా జాతీయ స్థాయిలో అధికారిక భాషలుగా గుర్తించబడ్డాయి. భారత రాజ్యాంగం 22 షెడ్యూల్డ్ భాషలను గుర్తిస్తుంది. వీటికి అధికారిక హోదా గుర్తింపు ఇవ్వబడ్డాయి.అయినప్పటికీ, భారతదేశంలోని అనేక భాషలు అంతరించిపోతున్నాయని పరిగణించబడుతున్నాయి. భారత దేశ జనాభా గణన 2001 ప్రకారం భారతదేశంలో 122 ప్రధాన భాషలు 1599 ఇతర భాషలు ఉన్నాయని నివేదించింది. ఇది దేశం అద్భుతమైన భాషావైవిధ్యాన్ని తెలియచేస్తుంది. భాషా వినియోగంపరంగా, భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ, బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో విద్యావంతులైన జనాభాలో ఇంగ్లీష్ కూడా విస్తృతంగా మాట్లాడబడుతుంది. మొత్తం మీద, భారతదేశం భాషా వైవిధ్యం దాని సాంస్కృతిక వారసత్వం ముఖ్యమైన అంశం. దేశంలోని అనేక భాషలను సంరక్షించడానికి ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం విద్యావిధానంలో త్రిభాషా విధానం మీద దేశంలోబాగా చర్చ జరుగుతున్నది. పాఠశాల విద్యావిధానంలో మొదట మాతృభాష, రెండవ భాషగా ఆంగ్లము, మూడో భాషగా హిందీ కచ్చితంగా బోధించాలి అని నూతన విద్యావిధానంలో పేర్కొనబడినది. ఈవిధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. మేము కేవలం ద్విభాషా విధానాన్ని అవలంబిస్తామని హిందీభాషను ఎటువంటి పరిస్థితుల్లోనూ మా మీద రుద్దవద్దని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఖరాకండిగా చెపుతున్నారు.ఇదే సమయంలో ఆయన ఉత్తరాది రాష్ట్రాల భాష అయినటువంటి హిందీ వలన అనేకరాష్ట్రాల మాతృభాషలు కొనఊపిరితో ఉన్నాయని




విమర్శిస్తున్నారు. అవసరమైతే విద్యావిధానంలో భాగంగా కేంద్రంనుంచి వచ్చే వేలాది రూపాయల డబ్బులు వదులుకుంటాము గానీ త్రిభాషా విధానాన్ని ఎటువంటి పరిస్థితులలోనూ అంగీకరించమని చెబుతున్నారు. నిజానికి జాతీయ నూతన విద్యా విధానంలో మాతృభాషకు ప్రాముఖ్యతను ఇవ్వవలెనని,ముఖ్యంగా ప్రాథమిక విద్యావిధానం అంతా మాతృభాషలో బోధించాలని,ఈవిద్యావిధానం చెబుతున్నది. కానీ దేశంలో ఎక్కువ రాష్ట్రాలలో వారి వారి మాతృభాషలో బోధనచేయకుండా, ఆంగ్లమధ్యమాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు ఆయారాష్ట్రాలు చెబుతున్నసమాధానం ఏమిటంటే, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆంగ్ల మాధ్యమాన్ని అంగీకరిస్తున్నాడటం వలన, కాదనలేని పరిస్థితి అని చెబుతున్నారు. మనం గమనించవలసిన అతిముఖ్య విషయం ఏమిటంటే, మాతృభాష ,సంస్కృతి, నాగరికత ఎప్పటికీ సజీవంగా ఉండాలి అనిచెబుతున్నాం.అదే సమయంలో మాతృభాషలో చదివితే విషయ పరిజ్ఞానం సంపూర్ణంగా పెరుగుతుంది అని చెబుతున్నాం. ఉపాధి అవకాశాలుకొరకు పరభాషలైనప్పటికీ, ఆ భాషలను అభ్యసించి, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. భాషా, సంస్కృతి,నాగరికతను, గొప్పవని చెబుతున్నాం కానీ, ఆ భాషలోనికి వైద్యరంగం, శాస్త్ర సాంకేతిక రంగం ,వాణిజ్య రంగం ఇలా భిన్నమైన ఉపాధి అవకాశాలు వచ్చే అంశాలను ,మాతృభాషలోనికి తర్జుమాచేసుకొని పొందలేకపోతున్నాం. ఆంగ్లభాష ద్వారా, ఈరంగాలు అన్నింటికీ అవకాశాలు మెండుగాఉన్నాయి. కనుక ప్రపంచవ్యాప్తంగా ఆంగ్ల భాష అగ్రగామిగా రాణిస్తున్నది. యూరోపియన్ దేశాలలో వారివారి భాషలోనే ఈరంగాలు అన్నియు బోధనచేయడానికి అవకాశాలున్నాయి. అందువల్లనే యూరోపియన్‌దేశాలలో వారివారి మాతృభాషలలో రాణిస్తున్నారు.విదేశీయులుసైతం యూరోపియన్‌దేశాలలో ఉన్నత చదువులు చదవాలన్న, అలాగే అక్కడ ఉద్యోగ అవకాశాలు పొందాలన్నా, కచ్చితంగా ఆయాదేశాల మాతృభాషలు నేర్చుకొని, అక్కడ విద్యను అభ్యసించడంగాని, ఉద్యోగ,ఉపాధి రంగాలలో అవకాశాలు పొందవలెను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, జపాన్,జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలలోముఖ్యంగా నర్సింగ్ కోర్స్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంవలన,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నర్సింగ్ విద్యార్థులకు ఆయాదేశాల మాతృభాషను నేర్పించుట కొరకు నిర్ణయం తీసుకున్నది. దీనినిబట్టి మనకు అర్థమవుతున్నది ఏమిటంటే, ఉపాధి అవకాశాలు ఏ భాష ద్వారా అందుతాయో అలాంటిభాషలు నేర్చుకుంటున్నారు. అలాంటి భాషలను ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోయినప్పటికీ, స్వతహాగా అభ్యసించి ఉపాధి అవకాశాలు పొందడానికి ప్రయత్నం చేస్తారు ఇదిసహజం. ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా భాషలను ఎంత గట్టిగా ప్రోత్సహించినప్పటికీవాటికి ప్రోత్సాహం లభించదు.అందుకని భారతదేశంలోఉన్న అన్ని రాష్ట్రాల పాలకులు, ఆయారాష్ట్రాల మాతృభాషను పరిరక్షించుకోవాలంటే, కచ్చితంగా మాతృభాషలను అభ్యసించడం కొరకు కొన్నిప్రత్యేకమైన ప్రోత్సాహకాలు ఇవ్వవలెను. మాతృభాషలో విద్యను అభ్యసించడం నిర్బంధం చేయాలి. అప్పుడు మాతృభాషలు దేదీప్యమానంగా వర్ధిల్లుతాయి. ●

# ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామి భారత్!

## బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధానిమోడీ



**న్యూఢిల్లీ, మార్చి 4:** ప్రపంచంమొత్తం ఇపుడు భారత్‌ను నమ్మకమైన భాగస్వామిగా చూస్తోందని, ఈతరుణంలో భారత పారిశ్రామికవేత్తలందరూ భారీ ప్రణాళికలకు ఉపక్రమించాల్సిన అవసరం వచ్చిందని ప్రధానిమోడీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలని ప్రపంచం మొత్తం ఇపుడు భారత్‌ను అత్యంత ఆప్తమిత్రునిగా చూస్తోందని దీనికితోడు భారత్ నాణ్యతాపరంగా ఉత్పత్తులు తయారుచేస్తుందన్న నమ్మకం ప్రపంచదేశాల్లో నెలకొన్నదని ఈతరుణంలో భారత పారిశ్రామికరంగం భారీ ప్రణాళికలు అమలుచేయాని మోడీ సూచించారు. బడ్జెట్ అనంతర వెబినార్‌లో మాట్లాడుతూ చట్టాలు, పెట్టుబడులు, సులభతర వాణిజ్యసంస్కరణలపై ఆయన సమగ్రంగా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అస్థిరతలు నెలకొని సరఫరా చైన్‌కు కొంత ఆటంకాలు కలిగించినప్పటికీ భారత్ నాణ్యతా ఉత్పత్తులు తయారుచేసిందని, అందువల్లనే విశ్వసనీయమైన సరఫరాచైన్‌ను కలిగి ఉందన్నారు. భారత్ ఒక్కటే ఈతరహా ఉత్పత్తి చేయగలిగిన సామర్థ్యం ఉందన్నారు. ఇపుడు లభించిన అవకాశం అత్యంత అరుదైనదని, మౌనంగా చూస్తు ఉండకుండా ప్రపంచ విశ్వసనీయతకు అనుగుణంగా ప్రణాళికలు అమలుచేయాలని సూచించారు. తమ ప్రభుత్వం పారిశ్రామిక రంగంతో కలిసి పదేళ్లుగా సమిష్టి కృషిచేస్తున్నదని, సంస్కరణలు తెచ్చామని, ఆర్థిక క్రమశిక్షణ తీసుకువచ్చామని, పారదర్శకత, సమ్మిళిత వృద్ధిని చూపించామని అన్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ఇపుడు భారత్ గ్రోత్ ఇంజిన్ వంటిదన్నారు. క్లిష్టసమయాల్లోకూడా భారత్ తన సత్తానుచూపించగలిగిందని, ప్రతి దేశం కూడా ఇపుడు భారత్‌తో భాగస్వామ్యానికి సిద్ధపడుతోందన్నారు. మన ఉత్పత్తిరంగం ఈ భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్కరణలు, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే భారత్ పారిశ్రామికరంగం కొత్త ఆత్మనిర్భరతను సాధించిందని, ఉత్పత్తి, ఎగుమతులరంగాల్లో రానున్న కాలంలో ఇదేతీరు కొనసాగాలని ప్రధాని ఆకాక్షించారు. పారిశ్రామికవృద్ధికి ఉత్పత్తిరంగమే కీలకమని కొత్త ఉత్పత్తులను ప్రపంచదేశాల్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులు తయారీకి సిద్ధం కావాలని, దీనితో మన ఎగుమతులు కూడా పెరుగుతాయన్నారు. ఉత్పత్తి రంగంలోకూడా కొత్త ఒరవడిని సృష్టించా లని, విలువలతో కూడిన ఉత్పత్తులు రావాలని హితవుపలికారు. అందుకు ఆర్‌అండ్‌డిని మరింత అభివృద్ధిచేయాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భౌగోళిక ఉద్రిక్తతల్లో భారత్‌ను గ్రోత్‌సెంటర్‌గా చూస్తున్నాయని అన్నారు. ఇందుకు రాష్ట్రాలు కూడా కలిసిరావాలని, ప్రగతికారక విధానాలు రూపొందించాలని, కంపెనీలకు ఆకర్షణీయ హబ్‌గా మారేవిధంగా ప్రోత్సాహం ఉండాలని, పెట్టుబడులకు కేంద్రంగా ఉండేవిధంగా రాష్ట్రాలు కూడా పోటీపడాలని ప్రధానిసూచించారు.



## హింసాత్మక సూడాన్‌లో 200మందిపై అత్యాచారం

### మిలిటరీ, ప్రత్యర్థులు కూడా లైంగిక దురాగతాలు

**కైరో, మార్చి 4:** హింసప్రజ్వరిల్లుతున్న సూడాన్‌లో ఈఏడాదిప్రారంభంనుంచి ఇప్పటివరకూ 200 మందికిపైగా చిన్నారులు అత్యాచారానికి గురయ్యారని ఐక్యరాజ్యసమితి బాలల విభాగం వెల్లడించింది. మొత్తం 61,800 మంది చిన్న పిల్లలు ఇక్కడ యుద్ధం ప్రారంభం అయినప్పటి నుంచి అదృశ్యం అయ్యారని యునిసెఫ్ వెల్లడించింది. యుద్ధంలో ఇదొక జిమ్మిక్కుకింద చిన్నారులపై విచ్చలవిడిగా విజృంభించి అత్యాచారాలు చేసారని వెల్లడించింది. 221 మందిచిన్న పిల్లలు వీరిలో బాలురిని కూడా ఆర్మీ సిబ్బంది అత్యాచారాలుచేసారని ఉత్తర ఆఫ్రికా దేశంలో లింగవివక్ష ఆధారంగా హింస జరుగుతోందని యునిసెఫ్ వివరించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచే సూడాన్‌లో యుద్ధం మొదలయింది. మిలిటరీ, ప్రత్యర్థి పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య హింస ప్రజ్వరిల్లింది. ఖర్టూన్‌తో పాటు దేశం చుట్టూకూడా హింస ప్రజ్వరిల్లింది. 20వేలమంది చనిపోయారని ఈ సంఖ్య మరింతగా పెరిగి ఉండవచ్చని యునిసెఫ్ వెల్లడించింది. సుమారు 14 మిలియన్ల ప్రజలు నిరాశ్రయులయ్యారని, దేశం దుర్భిక్షంలోకి నెట్టివేయబడిందని ప్రపంచ సంస్థ వెల్లడించింది. లైంగిక హింస, బలవంతపు బాల్యవివాహాలు, అత్యాచారాలుహింస దౌర్జన్యం పెరిగినట్లు తెలిపారు.

యునిసెఫ్ నివేదికల ప్రకారం 61,800 మంది చిన్నారులు నిరాశ్రయులయ్యారని యునిసెఫ్ తన నివేదికలో వివరించింది. చిన్నారులపై లైంగిక హింస కేసుల్లో 30శాతం మంది బాలురిపైనే జరిగాయి. ఐదేళ్లలోపు, నాలుగేళ్లలోపు పసికందులనుకూడా విడిచిపెట్టలేదన్నారు. గెడారెఫ్, కస్సాలా, గెజీరా, ఖర్టూన్, రివర్‌నైల్; నార్తరన్ స్టేట్; సౌత్ కోర్డోఫాన్, నార్త్ దార్‌ఫర్, వెస్ట్ దర్‌ఫర్‌ప్రాంతాల్లోనే ఎక్కువ చోటుచేసుకున్నాయి. 221 మంది చిన్నారులను రేప్‌చేసారని, 73 కేసులు ఈ ప్రభుత్వ హింసలో ఉంటే 71 కేసులు అత్యాచారాలుగానే నమోదయ్యాయి. పండ్లు కోసుకోడానికి వెళ్లిన చిన్నారులే లక్ష్యంగా మిలిటరీ సిబ్బంది ఈ అకృత్యాలకు పాల్పడినట్లు యునిసెఫ్ గుర్తించింది.



## మరింతగా ఆయుధ పరీక్షలు

### హెచ్చరించిన ఉత్తర కొరియా

**ప్యాంగ్యాంగ్, మార్చి 4:** అమెరికా, దాని మిత్ర దేశాలకు ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ హెచ్చరికలు చేశారు. తాము రెచ్చగొట్టే చర్యలు చేపడతామని బెదిరించారు. ఆయుధ పరీక్ష కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేస్తామంటూ వ్యాఖ్యలు చేశారు. దక్షిణ కొరియా, అమెరికా సైనిక విన్యాసాలు, ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగాలతో కొరియా ద్వీపకల్పంలో నిత్యం ఉద్రిక్త వాతావరణమే ఉంటుంది. దక్షిణకొరియా యూఎస్ సైనిక విన్యాసాలను తమపై దాడికి సన్నాహంగా కిమ్ ప్రభుత్వం భావిస్తోంది. తాజాగా దక్షిణకొరియాలోని బుసాన్ పోర్ట్‌లో అమెరికాకు చెందిన విమాన వాహక నౌకను మోహరించారు. ఇది కిమ్ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. అమెరికాలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరకొరియాపై రాజకీయంగా, సైనికంగా రెచ్చగొట్టే చర్యలను ముమ్మరం చేసింది. గత ప్రభుత్వ శత్రుత్వ వైఖరినే ఇది ముందుకు తీసుకెళుతోంది అని జోంగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ చర్య ఘర్షణాత్మ ఉన్మాదానికి ప్రతీక, అని దీటుగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. విమాన వాహననౌక బుసాన్ తీరానికి రాగా గత నెల ఈ రేవులో అమెరికా అణ్వాయుధ జలాంతర్గామిని నిలిపింది. దీనిని ఉత్తంకొరియా తీవ్రంగా ఖండించింది. ఘర్షణ కోసం అమెరికా బలమైన ఉన్మాదానికి ఇది అద్దం పడుతోంది. వాషింగ్టన్ ప్రమాదకర కవ్వింపు చర్యలతో మేము ఆందోళన చెందుతున్నాం. ఇది కొరియా ద్వీపకల్పం చుట్టుపక్కల తీవ్రమైన సైనిక ఘర్షణకు దారితీయెచ్చు. కవ్వించేవారిపై చర్యలు తీసుకొనే మా చట్టబద్ధమైన హక్కును ఖచ్చితంగా వాడుకొంటాం అని ఉత్తరకొరియా రక్షణశాఖ పేర్కొంది. అమెరికా గుడ్డిగా తన బలాన్ని నమ్ముకొంటోందని వ్యాఖ్యానించింది.

## మహారాష్ట్ర మంత్రి ముండే రాజీనామా





### సర్పంచ్ హత్యకేసులో మంత్రి అనుచరులు

### తక్షణమే ఆమోదించిన సిఎం ఫడ్నవిస్

**ముంబయి, మార్చి 4:** భీడ్‌జిల్లాలో ఒక సర్పంచ్ సంతోష్‌దేశ్‌ముఖ్‌ను కిడ్నాప్‌చేసి రెండురోజుల పాటుహింసించి హత్యచేసినముఠాతో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై మహారాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ధనుంజయ్‌ముండే రాజీనామాచేసారు. ఆయన రాజీనామాను ఆమోదించినట్లు కూడా సిఎం ఫడ్నవిస్ తెలిపారు. ఆతడిని కిడ్నాప్‌చేసి గుర్తుతెలీని ప్రాంతానికి తరలించి గ్యాస్ పైపులు, రాడ్‌లు, పదునైన ఆయుధాలతో హింసించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆతడిపై మూత్రంపోసి మరీ హింసించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

అయితే ఒక పారిశ్రామిక వేత్తను సొమ్ములు డిమాండ్‌చేసిన సంఘటనను సంతోష్ దేశ్‌ముఖ్ అడ్డుకున్నారన్న నెపంతోనే సర్పంచ్‌ను ఘోరంగా హింసించినట్లు తేలింది. పవన విద్యుత్ సంస్థ యజమానినుంచి రెండుకోట్లు డిమాండ్ చేసినట్లు తేలింది. ఈ హత్యకేసులో వాల్మికి కరద్‌మంత్రి ధనుంజయ్‌ముండే ప్రధాన అనుచరుడుగా గుర్తించారు.

ముంబయి కేంద్రంగా ఉన్న గ్రీన్ ఎనర్జీ కంపెనీ అవాడా భీడ్‌లోని మసాజోగ్ ప్రాంతంలో పవన విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ ఏర్పాటు చేస్తోంది. భీడ్‌తోపాటు పరిసర జిల్లాల్లో పవన విద్యుత్‌తో పాటు ఆర్థికంగా కొంత బూస్ట్ ఇచ్చినట్లవుతుందని ప్రభుత్వంప్రోత్సహిస్తోంది. అయితే స్థానిక నేరగాల్లు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలనిభావించి సొమ్ములు గుంజాలని నిర్ణయించారు. దేశ్‌ముఖ్ హత్యకు ముందే సుదర్శన్ గులే అనే నేరమాఫియా కింగ్ అవాడా ప్రాజెక్టు అధికారి సునీల్‌షిండేను కిడ్నాప్‌చేసాడు. ఆ తర్వాత పోలీసులు కేసు కూడా నమోదుచేసారు. ముండే అనుయాయుల తరపున విష్ణుఛాటే అవాడా సిబ్బందిని పిలిపించాడు. స్థానికంగా రాజకీయంగా శక్తిమంతుడైన వాల్మీక్‌కరద్ రెండు కోట్లు డిమాండ్‌చేసాడు.

ఆసమయంలో స్థానిక సర్పంచ్ సంతోష్ దేశ్ ముఖ్ జోక్యం చేసుకుని ఇలాంటి బెదిరింపులు వస్తే ఇక మసాజోగ్‌లో ఎవ్వరూ పరిశ్రమల స్థాప నకు రారని భావిం చాడు. దీనితోస్థానికుల జీవనోపాధి దెబ్బతింటుందని ఘులేను సంప్రదిం చాడు. ఆతర్వాత అవాడా ఉద్యోగులు కొందరిని ఈ నేరమాఫియా తీవ్రంగా కొట్టి హింసించారు. సంతోష్‌దేశ్‌ముఖ్ మరికొందరు ఆస్పాట్‌కువెళ్లి అడ్డగించారు. తమకు సర్పంచ్ అడ్డుతగులుతు న్నాడని భావించి వాల్మిక్ కరద్ ఆధ్వర్యంలో హత్యకు కుట్రలు వేసారు. దేశ్‌ముఖ్‌ను అనేక సార్లు బెదిరించారు. అయినా లొంగకపోవడంతో గత ఏడాది డిసెంబరు 9వ తేదీ హత్యచేసారు జఘులే, కరద్, విష్ణుఛాతేలు హత్యజరిగిన తర్వాతకూడా ఒకరినొకరు టచ్‌లోనే ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఈ సర్పంచ్ హత్యకేసులో కీలక నింది తుడు వాల్మిక్ కరద్ ఎన్సీపీ నాయకుడు అప్పటి మంత్రి ధనుంజయ్ ముండేకు ప్రధాన అనుచ రుడు. అందువల్లనే ముండేను రాజీనామా చేయాలని హైకమాండ్ ఆదేశించింది. అప్పటి ఎన్సీపినుంచి బిజెపిలోచేరి మంత్రి పదవిని పొందిన ముండే రాజీనామాను కూడా సిఎం ఆమోదించారు. సిఐడి ఈకేసులో 1200 పేజీల ఛార్జిషీటును దాఖలుచేసింది.

ఈకేసులో ముండే ప్రమేయం ఉందన్న ఆరోపణలపైనే ఆయన రాజీనామాచేయాలని ఆదేశించడం ఆమోదిం చడం జరిగింది. రాజీనామా తర్వాత ముండే మాట్లా డుతూ కీలక నిందితుడు వాల్మీక్ కదర్‌కు కఠినమైన శిక్ష విధించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సర్పంచ్‌కేసు ఇపుడు మహారాష్ట్రలో కులరాజకీ యాలకు ఆజ్యంపోసింది. మరాట్వాడా రీజియన్ పరిధిలోనికే భీడ్‌జిల్లా వస్తుంది. మరాఠాలు, ఒబిసి వంజరిల మధ్య కులయుద్ధం కొనసాగు తూనే ఉంటుంది.

ఈ హత్యకేసులో నిందితులు అందరూ అంటే కరద్, ఘులే, ఛాతేలు వంజరి కులస్తులు కావడంతో ఇపుడు మరాఠ్వాడా, వంజరిలమధ్య కులపోరాటానికి బీజం వేసింది. దీనివల్లనే బిజెపి మరాఠా నేత సురేష్‌దేశం ముందు దనంజయ్‌ముండే రాజీనామాచేయాలని డిమాండ్‌చేసారు. మొత్తంగాచెప్పే ఒక మరాఠా సర్పంచ్ హత్యకేసు అనుకోకుండా ధనుంజయ్ ముండేమెడకు చుట్టుకుని ఆయన మంత్రిపదవి నుంచి దిగిపోవాల్సిన పరిస్థితిని తెచ్చిపెట్టింది.

## బీహార్ బిజెపి చీఫ్‌గా మళ్లీ దిలీప్‌కుమార్ జైస్వాల్



**పాట్నా, మార్చి 4:** బీహార్ మాజీ మంత్రి సీనియర్ బిజెపి నాయకుడు దిలీప్‌కుమార్‌జైస్వాల్‌ను భారతీయ జనతాపార్టీ రాష్ట్రబిజెపి అధ్యక్షుడుగా మళ్లీ నియమించింది. ఈ ఏడాది అక్టోబరు నవంబరునెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బిజెపి సంస్థాగత పటిష్టతను కూడా చేపట్టింది. రాష్ట్ర రెవెన్యూ, భూసంస్కరణల విభాగంమంత్రిగా కేబినెట్ విస్తరణకు ముందే రాజీనామాచేసారు. మంగళవారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జైస్వాల్‌ను రాష్ట్రబిజెపిచీఫ్‌గా ఎన్నుకున్నారు. సోమవారం జైస్వాల్ తన నామినేషన్‌ను ఎన్నికల అధికారి బిజెపి రాష్ట్ర కార్యదర్శి రాజేశ్‌శర్మకు అందచేసారు. పార్టీ కేంద్రనాయకత్వం మంత్రివర్గంనుంచి రాజీనామా చేయాలని దిలీప్‌ను ఆదేశించింది. వన్‌పర్సన్ వన్‌పోస్టు సూత్రావళి ఆధారంగా ఆయన్ను కేబినెట్‌కు రాజీనామాచేయాలని ఆదేశించి అనంతరం జరిగిన మీట్‌లో ఆయన్ను రాష్ట్ర చీఫ్‌గా ఎంపికచేసింది. పార్టీ హైకమాండ్‌తనకు గొప్ప బాధ్యతను అప్పగించిందని, అధినాయకత్వం తనపైఉంచిన విశ్వాసానికి అనుగుణంగా శక్తివంచలేకుండా పనిచేస్తానని దిలీప్ జైస్వాల్ అన్నారు. మూడేళ్లపాటు ఆయన బిజెపి రాష్ట్ర చీఫ్‌గా కొనసాగుతారు. కేంద్ర ఇందనశాఖమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఈ ఎన్నికకోసం ముఖ్య పరిశీలకుడినగా పంపించారు. ఆయనతోపాటు బీహార్ బిజెపి ఇన్‌ఛార్జి వినోద్ తావ్డే, సహ ఇన్ఛార్జి దీపక్‌ప్రకాష్, బీహార్, కేంద్రమంత్రులు వచ్చారు. జిల్లా అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు ఇతర సీనియర్ నాయకులు అందరూ కూడా బిజెపి మండలి సమావేశానికి వచ్చారు.

మొత్తం 6వేలమందికిపైగా హాజరయిన ఈ సమావేశంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అనుస రించాల్సిన వ్యూహాన్ని చర్చించారు. కేబినెట్ విస్తరణ వెనువెంటనే బిజెపి రాష్ట్ర సమావేశం జరగడం గమనార్హం. గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగాను, నితీశ్ కేబినెట్‌లో మంత్రిగాను రెండుపదవుల్లోకొనసాగారు. బిజపి చీఫ్‌గా ఉన్న సామ్రాట్‌చౌదరిస్థానంలో ఆయన వచ్చారు. సామ్రాట్‌చౌదరికి డిప్యూటి సీఎంగా రావడంతో ఆయన రాజీనామాచేసారు. ఎన్డీయే కూటమిని సమన్వయంచేసుకుంటూ ఎన్నికల్లో తన వ్యూహాపటిమను నిరూపించాల్సిన అవసరం జైస్వాల్‌కు వెన్నంటి ఉంటుందని పార్టీ సీనియర్లు చెపుతున్నారు.

## మీనాయనను సిఎంను చేసింది నేనే!



### బీహార్ సిఎం, జెడియు చీఫ్ నితీశ్‌కుమార్

**పాట్నా, మార్చి 4:** బీహార్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి, మాజీ డిప్యూటిసిఎం ఆర్జేడి పక్షనేత తేజస్వియాదవ్‌లమధ్యతీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగింది. కుమార్ తన హయాంలో జరిగినఅభివృద్ధిని ఏకరువుపెడుతున్న తరుణంలో తేజస్విజోక్యంచేసుకుని ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. అంతకుముందు బీహార్‌లో ఏముంది. మీ తండ్రికి ఎంతమేలుచేసానో నీకు తెలుసా. అందువల్లనే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. నీకులం వాళ్లే ఎందుకు ఇలాచేస్తున్నావని కూడా ప్రశ్నించారు. అయినా కూడా నేను ఇప్పటికీ ఆయన్నే సమర్థిస్తున్నా అంటూ ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీనితో విపక్షంనుంచి తీవ్రస్థాయిలో నిరసన ఎదురయింది. అయినా కూడా నితీష్ కుమార్ మాట్లాడుతూ నీకు ఏమీ తెలియదు. అత్యంత వెనుకబడిన తరగతులు, వెనుకబడిన తరగతులుగా బీహార్‌లో విభజనచేస్తుంటే తాను మీ తండ్రితో కలిసి వ్యతిరేకించానని అది తప్పు అని ఆరోజే విభేదించామని గుర్తుచేసారు. అంతకుముందు తేజస్వి యాదవ్‌మాట్లాడుతూ తన తండ్రి హయాంలో బీహార్ పాలన చూడాలని, తన మాజీ మిత్రుడు ఎన్డీయే సిఎం నితీష్‌కుమార్ హయాంలో పాలన చూడాలంటూ ఎద్దేవాచేసారు. ఆర్జేడి నేత తేజస్వి నితీశ్‌కుమార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విమర్శలు చేయడంనుంచి ఈ వాగ్వాదానికి బీజం పడింది. బడ్జెట్ అంతా అంకెల గారడీయేనని అబద్ధాలను సిరాతో ముంచి రూపొందిచిన బడ్జెట్ అని అన్నారు. ఎలాంటి రాబడులు లేకపోగా బడ్జెట్ సైజు మాత్రం పెరుగుతున్నదని 3.71 లక్షల కోట్లు అనేది భారీగా అంకెల గారడీని సూచిస్తోందన్నారు. బహుశా సిరాతో ముంచిన అబద్ధాలతో తయారుచేసారని, వాళ్లు తలచుకుంటే ఐదులక్షల కోట్లు కూడా మార్చేస్తారని తేజస్వి సెటైర్లు వేసారు. 2024నుంచి ఆర్జేడి, జెడియులమధ్య సంబంధాలు తెగిపోయినప్పటినుంచి తేజస్వియాదవ్ సిఎం నితీశ్‌కుమార్‌పై విమర్శల దాడులు చేస్తూనే ఉన్నారు. ముందురోజే కూడా 15 ఏళ్ల కాలం చెల్లిన వాహనాలను ఎలా తొలగిస్తున్నామో బీహార్‌లో ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా తొలగించే సమయం వచ్చిందని సైటైర్లువేసారు. 20 ఏళ్ల ఎన్డీయే ప్రభుత్వం బీహార్‌లో కాలంచెల్లిన వాహనంగా మారిపోయిందని బీహార్‌లో ఈప్రభుత్వాన్ని తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. 2013లో బిజెపితో తన సంబంధాలను తెంచేసుకున్న జెడియుచీఫ్ నాలుగేళ్లతర్వాత ఆర్జేడీతో 2015, 2017, 2022లో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసారు. మళ్లీ ఆ తర్వాత మహాఘటబంధన్‌తో తెగతెంపులుచేసుకుని ఎన్డీయేతో జతకట్టిన సంగతి తెలిసిందే.

## ట్రంప్ వాణిజ్య యుద్ధం అత్యంత ప్రమాదకరం -వారెన్ బఫెట్

**వాషింగ్టన్, మార్చి 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం ప్రమాదకరమైందని దిగ్గజ ఇన్వెస్టర్‌వారెన్ బఫెట్ అభిప్రాయపడ్డారు. నేటినుంచి కెనడా, చైనా, మెక్సికోపై భారీ ఎత్తున సుంకాల విధింపును అగ్రరాజ్యం మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై బఫెట్ స్పందిస్తూ అది దుందుడుకు చర్యఅని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థపై తాను కామెంట్ చేయనని వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థలో ఎప్పుడూ అడగాల్సిన ప్రశ్నేంటంటే ఆ తర్వాతఏంటి?మీరుఎప్పుడూ ఈమాట అంటుండాలి. మంచిది.. ప్రస్తుతం అదే ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన అంశం. నేను దాని గురించి మాట్లాడను. కష్టం నిజంగానే మాట్లాడను అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. 94 ఏళ్ల బఫెట్‌ను ప్రపంచం ఓ దిగ్గజ ఇన్వెస్టర్‌లా భావిస్తుంది.

ఆయన ఇచ్చే టిప్స్, అంచనాల కోసం ఏటా కోట్ల మంది ఎదురుచూస్తుంటారు. ఆయన నేతృత్వంలోని బెర్క్‌షైర్ హాత్‌వే అమెరికా ప్రభుత్వానికి గత 60 ఏళ్లలో 101 బిలియన్ డాలర్లపై పన్ను రూపంలో చెల్లించింది. కెనడా, మెక్సికో, చైనాపై ట్రంప్ విధించిన అదనపు సుంకాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో కెనడా కూడా ప్రతి సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది.

అమెరికా నుంచి దిగుమతి అయ్యే 155 బిలియన్ డాలర్ల వస్తువులపై 25 శాతం సుంకాలు వసూలుచేస్తామని వెల్లడించింది. మరోవైపు చైనా తాము కూడా ధీటుగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది.

## అసెంబ్లీలో పాన్ ఉమ్మిన ఎమ్మెల్యే..

### పిలిచి వార్నింగ్ ఇచ్చిన స్పీకర్!

### సిబ్బందితో కలిసి శుభ్రంచేసిన సభాపతి



**లక్నో, మార్చి 4:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా మంగళవారం ఒక సంఘటనపైస్పీకర్ సీరియస్ అయ్యారు. ఓ ఎమ్మెల్యే సమావేశాలు జరుగుతుండగానే పాన్‌మసాలా నమిలి హాలులోనే ఉమ్మేశాడు. లంచ్ విరామంలో అది గమనించిన స్పీకర్ సతీష్‌మహానా సిబ్బందితోకలిసి శుభ్రం చేసారు. లంచ్ తర్వాత సెషన్‌ప్రారంభంకాగానే ఉమ్మివేసిన ఘటనపై సీరియస్‌గా స్పందించారు. సభ్యులు సభాప్రాంగణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలనికోరారు. అసెంబ్లీ హాలులో ఉమ్మివేసిన ఎమ్మెల్యే ఎవరో తనకు తెలుసనని విడియోలో చూసానన్నారు. ఆ ఎమ్మెల్యే తనకు తానుగా తన దగ్గరుకువచ్చి వివరణ ఇవ్వాలని లేదంటే తాను తనఛాంబర్‌కు పిలవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సభలో మరోసారి ఇలా జరక్కూడదని అందరూ బాద్యతగా ఉండాలని కోరారు. విధాన సభ హాల్‌లో ఈ ఉదయం జరిగిన ఓఘటన మీకు చెప్పాలి. సభ్యుల్లో ఒకరు పాన్‌మసాలా నమిలి అక్కడే ఉమ్మేశారు. విషయం తెలియగానే నేను స్వయంగా వెళ్లి సిబ్బందితోకలిసిశుభ్రంచేసాను. అక్కడ ఉమ్మేసిన ఎమ్మెల్యే ఎవరో నేను విడియోలోచూసాను. ఆయన తనంతట తానుగా నాదగ్గరకు వచ్చి వివరణ ఇవ్వాలి. లేదంటే నేనే పిలవాల్సి వస్తుందని స్పీకర్ అన్నారు. ఇకనుంచి ఎవరైనా అలాచేయడంగమనిస్తే వెంటనేఅడ్డుకోవాలని, అసెంబ్లీని శుభ్రంగాఉంచడం మనందరి భాధ్యత అన్నారు.

## ప్రైవేటులో యుద్ధవిమానాల తయారీ




### తేజస్ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకే: డిఫెన్స్ ప్యానెల్

**న్యూఢిల్లీ, మార్చి 4:** భారత్‌లో యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేట్ రంగం కూడా అడుగుపెట్టేందుకు మార్గం మరింత సుగమం అయింది. తాజాగా ఇందుకు సంబంధించి డిఫెన్స్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఈ మేరకు పలు సూచనలు చేసింది. తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు అయిదుగురు సభ్యుల కమిటీని ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఇది తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. తాజాగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు మాట్లాడుతూ రక్షణ మంత్రి ఈ సూచనల అమలును దశలవారీగా చేపట్టాలని తెలిపారు. వాయుసేన చీఫ్ అమర్‌ప్రీత్‌సింగ్ కొన్ని నెలల నుంచి భారత్‌లో తేజస్ ఉత్పత్తి, డెలివరీల్లో జాప్యంపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఓ పక్క వాయుసేన ఆపరేషనల్ స్క్వాడ్రన్ల సంఖ్య పడిపోతుండటంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కమిటీకి రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్‌సింగ్ అధ్యక్షత వహించారు. తాజాగా ఇది స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలతో తేజస్ తయారీల్లోని సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా ప్రైవట్ రంగాన్ని భాగస్వామిని చేయడంతో ఈ సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. వాయుసేన వచ్చే 20 ఏళ్లలో వివిధ వేరియంట్లకు చెందిన దాదాపు 350 తేజస్ విమానాలను వినియోగించాలని భావిస్తోంది. కానీ, అమెరికా నుంచి ఇంజిన్ల రాకలో జాప్యం, మందకొడి ఉత్పత్తి వంటి కారణాలతో ప్రణాళిక అమల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకొంది.

## మద్యం మత్తులో దూషించాడని డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన అసోం మాజీ సిఎం కుమార్తె

**గౌహతి, మార్చి 4:** మద్యం మత్తులో తనను దూషించిన డ్రైవర్‌కు అస్సాం మాజీ సిఎం కుమార్తె దేహశుద్ధి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమ డ్రైవర్ మద్యం మత్తులో తనను దూషించాడని ఆరోపస్తూ అస్సాం మాజీ సిఎం ప్రఫుల్లకుమార్ మహంత కుమార్తె డ్రైవర్‌పై తీవ్రంగా విరుచుకుపడుతూ చెప్పుతోకొట్టారు. ప్రభుత్వ ఎమ్మెల్యే క్వార్టర్లలో ఆమె అతడిని కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె మాట్లాడుతూ ఆ డ్రైవర్ తమ వద్ద చాలా కాలంగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. అతను ఎప్పుడూ మద్యం మత్తులో ఉండి తనను దుర్భాషలాడుతూ, వేధిస్తుంటాడని అన్నారు. అయినా కూడా అతడికి ఉన్న సమస్యల వల్ల అలా ప్రవరిస్తాడని తాము సహనంతో ఉంటామని, అలా ప్రవర్తించవద్దని ఎన్నిసార్లు చెప్పినా అతడిలో ఎటువంటి మార్పు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. తను ఇంట్లో ఇండగా తలుపును గట్టిగా బాదుతూ బయటకు రావాలని దూషించాడని తెలిపారు. అందువల్లే అతడికి తగిన బుద్ధి చెప్పానని అన్నారు. అయితే డ్రైవర్ ప్రభుత్వ ఉద్యోగినా లేదా వ్యక్తిగతంగా ఏర్పాటుచేసుకున్న వ్యక్తా అనే విషయంపై స్పష్టత లేదు. అస్సాం గణపరిషత్ మాజీ అధ్యక్షుడు ప్రఫుల్లకుమార్ మహంత రెండుసార్లు అస్సాం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన శాసనసభ్యుడు కాకపోయినా వారి కుటుంబం ప్రభుత్వానికి సంబంధించిన ఎమ్మెల్యే క్వార్టర్లలో నివాసం ఉండటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీల నిర్వహణ

## రాష్ట్ర మహిళా విభాగం క్రీడా పోటీలు ప్రారంభించిన మంత్రి



ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం క్రీడపోటీలు ప్రారంభ సందర్భంగా బెలూన్స్ ఎగరేస్తున్న క్రీడ శాఖ మంత్రి

**విజయ వాడ. మార్చి4, ప్రభా తవార్తప్రతినిధి:** అంతర్జా తీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆటల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలాపించారు. మహిళ మూర్తులు ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయంగా ఉందని, శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కుమారి, కన్వీనర్ మాధవి గారు, ఆల్ ఇండియా ఎన్ ఈసీ మెంబెర్ శాంతి శ్రీ, మహిళ ప్రతినిధులు శివ లీల, విజయశ్రీ, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్2 అధ్యక్షుడు ఎం రాజబాబు, ఏపీ ఎన్జీజీవో నగర శాఖ అధ్యక్షులు సి వి.ఆర్ ప్రసాద్ ఉన్నారు. ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోషియేషన్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మహిళలకు సింగింగ్, వక్తృత్వం, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగిందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ శేషమ్మ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున విశిష్ట అతిధులచే బహుమతులు అందజేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా హంస అధ్యక్షుడు వినుకొల్లు రామకృష్ణ, ఉమ్మడి కృష్ణా జిల్లా హంస సహ ఉపాధ్యక్షులు కేటీసీ శేఖర్, ఆశాలత, సమత, వనిత ట్రెజరర్ సిద్ధంశెట్టి రమణ, విజయవాడ సిటీ అధ్యక్షులు శ్రీమతి జాలం సరోజినీ కార్యదర్శి బొమ్మగంటి రాంబాబు, భార్గవి ముఖ్య అతిథులుగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్ నాగ శేషమ్మ జిల్లా ట్రెజరర్ సిద్ధంశెట్టి రమణ, నర్సింగ్ సూపర్నెంట్ శ్రీమతి విజయలక్ష్మి, ఉమెన్స్ సెక్రటరీ వెంకటరమణ, పాల్గొన్నారు.



చిత్తూరు జైలులో వైకాపా నాయకులను పరామర్శించి వస్తున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

# తప్పుడు కేసులతో అరాచకం

### - రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఇప్పుడు సెంటీమీటర్ చేస్తే వైఎస్సార్సీ అధికారంలోకి వస్తే కిలోమీటరు చేస్తాం : మాజీ మంత్రి ఆర్‌కె రోజా

**చిత్తూరు, మార్చి 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి అరాచకం చేస్తోందని మాజీ మంత్రి ఆర్‌కె రోజా ధ్వజమెత్తారు. నగరి నియోజకవర్గంలో ఐదు మంది వైకాపా నాయకులపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసి చిత్తూరు జైలుకు తరలించడంతో మంగళవారం మాజీ మంత్రి ఆర్‌కె రోజా వారిని పరామర్శించడానికి వచ్చారు. ఈ సందర్భంగా జైలులో వైకాపా నాయకులు, కార్యకర్తలను పరామర్శించి వెలుపలికి వచ్చిన మాజీ మంత్రి ఆర్‌కె రోజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అరాచకం సృష్టిస్తుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట ఒక సెంటీమీటర్ చేస్తే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే దానిని ఒక కిలో మీటరు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారిందని ఆమె ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతుందని, ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ మద్యంను ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నానా చంద్రబాబునాయుడు నివాసం వుంటున్న గుంటూరు జిల్లాలో డ్రగ్స్ విచ్చలవిడిగా లభ్యమవుతుందన్నారు. తన నియోజకవర్గం పుత్తూరులో సైతం తెలుగు యువత నాయకులు డ్రగ్స్‌ను విచ్చలవిడిగా సరఫరా చేసి లక్షల రూపాయలు దండుకుంటున్నారన్నారు. తన నియోజకవర్గం నగరిలో పాఠశాల విద్యార్థులు గంజాయిని సేవించి హెడ్మాస్టర్ కాలర్ పట్టుకున్న సంఘటన జరిగిందని ఆమె వివరించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం గంజాయి సాగుకు అడ్డాగా మారిందన్నారు. రెడ్ బుక్ రాజ్యంగం అంటూ ప్రభుత్వం రాజ్యంగ విరుద్ధ పనులు చేసి వైకాపా నాయకులు, కార్యకర్తలను భయపెడుతుందని, దీనికి ఎవ్వరు వైకాపా నాయకులు భయపడరని ఆర్‌కె రోజా స్పష్టం చేశారు. వైకాపా నాయకులపై కేసులు పెట్టి బెయిల్ పొందేలోపు మరో కేసు నమోదు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అన్ని కేసులకు పిటీ వారెంటు ఇచ్చి ఒకే చోట విచారణ నిర్వహించాల్సి వుండగా అందుకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇటీవల అరెస్టు అయిన పోసాని మురళీకృష్ణపై సైతం ఇదే తరహా కేసులు నమోదు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. పోసాని మురళీకృష్ణకు ఆరోగ్యం సరిగ్గా లేకపోయినప్పటికీ పోలీసులు ఆయనను టార్చర్ పెడుతున్నారని ధ్వజమెత్తారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చి అధికార పార్టీ చెప్పినట్లు అధికారులు ప్రవర్తిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఏర్పడేది వైఎస్ఆర్ కాగ్రెస్

పార్టీ ప్రభుత్వమని ఇప్పుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు, కూటమి ప్రభుత్వ నేతలను ఎట్టి పరిస్థితుల్లోను వైకాపా ప్రభుత్వం వదలిపెట్టదని స్పష్టం చేశారు.

# ప్రముఖ కవిప్రసాదమూర్తికి చిన్నినారాయణరావు సాహతీ ఫౌండేషన్ అవార్డు

**విజయవాడ, మార్చి 4, ప్రభాతవార్త :** సుప్రసిద్ధ కవి, రచయిత బి.ప్రసాదమూర్తి నెల్లూరు చిన్ని నారాయణరావు సాహతీఫౌండేషన్ అవార్డు కు ఎంపికయ్యారు. చిన్ని నారాయణరావు సాహతీఫౌండేషన్ ద్వితీయవార్షికోత్సవం సందర్భంగా సాహిత్యంలో విశేషకృషిచేసిన సాహతీవేత్తలకు అవార్డులు ప్రకటించారు. 'కలనేత' కవితీసంపుటితో అడుగులు ప్రారంభించి అసాధారణ వాక్యనిర్మాణం, నిత్యనూతన శైలీతో ఇప్పటివరకు 14 పుస్తకాలను తెలుగు పాఠకులకు అందించిన ప్రసాదమూర్తికి పౌండేషన్ ప్రధాన అవార్డును అందించనుంది. జ్ఞాపికతోపాటు రూ.10వేల నగదు పురస్కారాన్ని ప్రసాదమూర్తికి అందించనున్నారు. సత్యవేటి శ్రీకాంత్, తుంగా రాజగోపాల్‌రెడ్డి, నాగభైరవ కోటేశ్వరావు స్మారక సాహతీ పురస్కారాలను పి.శ్రీనివాస్‌గౌడ్, కొమ్మవరపు విల్సన్‌రావు, అవధానుల మణిబాబులకు అందించనున్నారు. ఈమేరకు ఏప్రిల్‌లో నెల్లూరులో జరిగే ఫౌండేషన్ ద్వితీయవార్షికోత్సవ వేడుకల్లో అవార్డులను అందించనున్నట్లు చిన్ని నారాయణరావు తెలిపారు. అవార్డులకు ఎంపికయిన సాహతీవేత్తలను పలువురు అభినందించారు.



# దుర్గమ్మ హుండీలో రూ.4కోట్ల విలువైన కానుకలు

**ఇంద్రకీలాద్రి, మార్చి 4, ప్రభాత' వార్త' :** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారిని దర్శించుకున్న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన సొమ్మును మంగళవారం లెక్కించగా రు.4కోట్ల 7లక్షల, 39 వేల 829ల నగదు, 700 గ్రాముల బంగారం, 6550 గ్రాముల వెండి లభించినట్లు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రు.2,81,386లను భక్తులు కానుకలుగా దుర్గమ్మవారికి సమర్పించారన్నారు. ఈలెక్కింపుల కార్యక్రమంలో ఇఓ కె రామచంద్రమోహన్, డిప్యూటి ఇఓ ఎం రత్నరాజులు పర్యవేక్షణ చేయగా వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి: వైఎస్సార్సీ సభ్యుల డిమాండ్

**సచివాలయం,మార్చి 4,ప్రభాతవార్త :** శాసనమండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవా ్వలని వైకాపా శాసనమండలి సభ్యులు డిమాం డ్ చేశారు.శాసనమండలి ఛైర్మన్ మోషన్‌రాజు నిరుద్యోగ భృతిపై వైకాపా సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడంతో సభ్యులు ప్లకార్డులతో ఛైర్మన్‌కు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ బిజినెస్‌లో లేని అంశాలపై చర్చకు ఎలా అనుమతి ఇస్తామంటూ సభ ్యలనుద్దేశించి తెలిపారు.ప్రశ్నోత్తరంలో భాగంగా నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని నిధులు ఎంత కేటాయించారని అనకాపల్లి అంశంపై బడ్జెట్లో లేకపోవడం బాధాకరమని దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరంఉందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి కోరారు.కేవలం సామాజిక ఫించన్లు కు సంబంధించిన వివరాలు మాత్రమే ఉన్నాయని నేతన్న ఫించన్ అమలు కూడా సక్రమ ంగా జరగటం లేదని తెలిపారు.దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వివరిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ఈ రాష్ట్రంలోని ఎసీ ్స,ఎస్టీ,బిసి,మైనార్టీల అభివృద్ధికి వేలకోట్ల నిధులు కేటాయించిందని గత ప్రభుత్వం కేవలం మా ఎసీ ్స నా ఎస్టీ నా బిసి అంటూ ప్రచారం చేసుకోవడం తప్పవారికి మేలు చేసిందేమీ లేదని తెలిపారు.ఎమ్మెల్సీ జగన్మోహనరావు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఎప్పటినుండి అమలుచేస్తారో చెపా ్పలంటూ పట్టుబటా ్టరు.వైకాపా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం అంచనాలు తగ్గించే విషయంలో స్పష్టత ఇవా ్వలని కోరారు.దీనికి సంబందించి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బదులిస్తూ ఎటి ్ట పరిస్థితుల్లోనూ 2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం తలపెట్టిన అంచనాల ప్రకారమే నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

పోలవరం విషయంలో గత ప్రభుత్వం కేవలం రెండుశాతం పనులు మాత్రమే చేసి ఈ విషయాలపై ప్రశ్నించడం సరికాదని చెపా ్పరు.దీంతో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రారంభించింది దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని తెలిపారు.ఈ విషయంపై శాసనమండలి సభ్యుల మధ్య వాదోపవాదాలు జరగడంతో ఛైర్మన్ మోషన్‌రాజు మండలిని బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# ఎగువ సభకు కూడా సీనియర్లకు చోటు లేనట్లే

**ఒంగోలు, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఆలోచన పూర్తిగా మారింది. పార్టీ పది కాలాల పాటు అధికారంలోకి రావాలంటే యువతకు అవకాశాలు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. చట్ట సభల్లో ఏ పోస్టు ఖాళీ అయినప్పటికి దానికి యువకులను ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో ఉంది. టీడీపీలో కష్టపడితే పదవులు వస్తాయన్న సంకేతాలను బలంగా పంపడానికే ఈ రకమైన నిర్ణయం పార్టీ హైకమాండ్ తీసుకుం టున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతల సేవలను ఇప్పటి వరకు వినియో గించుకున్నా వారిని పార్టీ సేవలకే ఉపయోగించుకోవాలని డిసైడ్ అయి నట్లు సమాచారం. ఎలాంటి మొహ మాటాలు లేకుండా సీనియర్లను నిరార్ధక్షిణ్యంగా పక్కన పెట్టాలని భావిస్తున్నారు. పార్టీ ఏర్పడి దాదాపు యాబై ఏళ్లు కావస్తుండటంతో సీనియర్ నేతలు టీడీపీలో పాతుకుపోయి ఉన్నారు. వారు మర్రిచెట్టులాగా తయారయ్యారన్న విమర్శలు క్యాడర్ నుంచి ఎదురవుతున్నాయి. వారు తప్పించి నియోజకవర్గాల్లోనూ, మరే పదవుల్లోనూ మరొకరికి స్థానం దక్కదన్న బలమైన అభిప్రాయం ద్వితీయ శ్రేణి నేతల్లో ఉంది. 2019 నుంచి 2024 వరకు యువనేతలే ఎక్కువగా పార్టీకి కష్టపడ్డారు. చంద్రబాబు నిర్వహించిన అనేక సభలకు జనసమీకరణను కూడా వారే దగ్గరుండి చూశారు. సీనియర్ నేతలు పెద్దగా ఆ ఐదేళ్లు పార్టీని పట్టించుకోలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. సీనియర్ నేతలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికి అందులోనూ యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని దాదాపుగా డిసైడ్ అయినట్లు తెలిసింది. కొందరు ఇప్పటికే తప్పుకోగా.. ఇప్పటికే కొందరు తమంతట తామే రాజకీయాల నుంచి తప్పుకోగా, మరికొందరు పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. వారు పార్టీకి భారంగా మారారన్న వాదన బలంగా వినిపిస్తుంది. నియోజకవర్గాల్లో క్యాడర్‌ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, అలాగే తమ రాజకీయాల కోసం పార్టీని బలి చేస్తున్నారన్న వాదన మాత్రం అధినాయకత్వం జరిపిన సర్వేల్లోనూ వెల్లడి కావడంతో ఇక సీనియర్లకు చెక్ పెట్టాలన్న నిర్ణయానికి పార్టీ అధినాయకత్వం వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను కూడా యువలకే ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ క్యాడర్ మనోభిప్రాయాలను గౌరవిస్తూ భవిష్యత్ నేతలను తయారు చేసుకునే పనిలో సైకిల్ పార్టీ ఉందనే చెప్పాలి. ఇక నారా లోకేష్ యువగళం కావడంతో యువతకే ప్రాధాన్యం ఇస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదు. మంత్రి వర్గం కూర్పులోనే ఈ విషయం స్పష్టమైంది. యువత అయితే పార్టీని నమ్ముకుని పని చేయడమే కాకుండా తమకు వచ్చిన పదవితో సంతృప్తి పడతారని, అదే సీనియర్ నేతలయితే ఎమ్మెల్సీ పదవి వచ్చినా తమకు మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తిలో నిత్యం ఉంటారన్న భావన అధినాయకత్వంలోనే ఉంది. అందుకే ఈ నాలుగు సీట్లలోనూ తాను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు భర్తీ చేస్తా రంటున్నారు. సీనియర్ నేతలకు పొలిట్ బ్యూరో లో స్థానం కల్పిం చకుండా, పార్టీ సలహాలు, సూచనలకు మాత్రమే పరిమితం చేయాలని హైకమాండ్ డిసైడ్ అయింది.

# మద్యం, బీర్ ద్వారా రూ.3113 కోట్లు దోచుకున్న గత ప్రభుత్వం

### - రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వంలో మద్యం, బీర్ ద్వారా రూ.3113 కోట్లు దోచుకున్నారనే ఆధారాలున్నాయని ఏపీ ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేసారు.మద్యం పేరిట గత అయిదేళ్ళలో జరిగిన అక్రమాలు అన్ని,ఇన్ని కావాన్నారు.శాసనసభలో మంగళవారం కొల్లు రవీంద్ర ప్రశ్నోత్తరాల సమయంలోను,బడ్జెట్ అంశాలపైన మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో మద్యం ఆర్డర్లన్నీ నచ్చిన వారికి ఇచ్చుకున్నారు. కొత్తగా 7 కంపెనీలను ఏర్పాటు చేసి, దాదాపు 63 శాతానికి పైగా ఆర్డర్లు ఆ ఏడు కంపెనీలకు కట్టబెట్టారు. ప్రతి కేసుకు సగటున రూ.200 వరకు అనధికారికంగా వసూల్ చేసినట్లు ఆరోపణలున్నాయి. మద్యం, బీర్ ద్వారా రూ.3113 కోట్లు దోచుకున్నారనే ఆధారాలున్నాయి. గతంలో ఐఎంఎఫ్‌ఎల్ మద్యం అన్ని రాష్ట్రాల్లో కూడా దొరికేవే ఇక్కడా దొరికేవి. కానీ గత ఐదేళ్ల స్థానిక బ్రాండ్లను తీసుకొచ్చి మిగిలిన బ్రాండ్లను తొక్కిపెట్టారు. గతంలో జాతీయ, అంతర్జాతీయ మద్యం కంపెనీలు మద్యం సరఫరా చేస్తే, గత ఐదేళ్లు వాటిని బెదిరించి, భయపెట్టి వాటిని కంపెనీలను లాక్కున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా వినని పేర్లతో కంపెనీలను స్థాపించి ఆయా కంపెనీలకే 60 శాతానికి పైగా ఆర్డర్లు ఇచ్చారు. కమిషన్లు ఇవ్వని కంపెనీలను ఎంత దారుణంగా తొక్కిపెట్టారంటే.. 2018లో ఆఫీసర్స్ ఛాయిస్ 35 లక్షల కేసులు సరఫరా చేస్తే.. గత ప్రభుత్వంలో సరఫరా చేసింది కేవలం 5 లక్షల కేసుల ఆర్డర్లు మాత్రమే ఇచ్చారు. మెక్ డోవల్స్ అయితే 22 లక్షల కేసుల నుండి 5 కేసులకు కుదించారు. 201819లో తెలంగాణతో పోలిస్తే రెవెన్యూ వ్యత్యాసం రూ.4186 కోట్లు మాత్రమే, కానీ 202324 నాటికి ఏకంగా రూ.42,762 కోట్లకు చేరింది. ఇందుకు కారణం నాణ్యమైన బ్రాండ్లను దూరం చేసి కల్తీ, నాసిరకమైన జే బ్రాండ్లను తీసుకురావడమే. కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దడంతో జంగారెడ్డిగూడెంలో ఏకంగా 42 మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం నాణ్యతను గాలికి వదిలేయడంతో మద్యం ఆధారిత నేరాలు, ఆత్మహత్యలు, కిడ్నీ, లివర్ సమస్యలు భారీగా పెరిగాయి. గుంటూరు జీజీహెచ్ డీఅడిక్షన్ కేంద్రంలో 2018లో 343 కేసులుంటే.. 2023 నాటికి ఏకంగా 4913 మందికి చేరారు. కూటమి అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యం అందించడమే లక్ష్యంగా పరీక్షలకు ప్రాధాన్యత ఇచ్చాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ఈఎన్ఏని 13 రకాలుగా, విస్కీ, బ్రాందీ, జిన్, వోడ్కాను 9 రకాలుగా, రమ్ 9 రకాల పరీక్షలు, బీర్ ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏ స్థాయిలో కూడా కల్తీ అవ్వడానికి వీల్లేకుండా ప్రొడక్షన్ నుండి మద్యం షాపుల వరకు శాంపిల్స్ తెప్పించి పరీక్షిస్తున్నాం. గత ఐదు సంవత్సరాల పాటు ఎక్కడా డిజిటల్ పేమెంట్స్ లేకుండా క్యాష్ అండ్ క్యారీతో ప్రజల్ని దోచుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 3396 షాపుల్ని అత్యంత పారదర్శకంగా కేటాయించాం. దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.1797 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. తొలిసారిగా ఏపీలో కల్లుగీత కార్మికులకు 350 షాపులు కేటాయించాం. లైసెన్సు ఫీజులో రూ.103 కోట్ల సబ్సిడీ భరిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక 150కి పైగా బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చి వినియోగదారులు కావాల్సిన బ్రాండ్ తీసుకునే వెసులుబాటు కల్పించాం. అదే సమయంలో రూ.99కే క్వార్టర్ మద్యాన్ని తీసుకొచ్చి పేదలు కల్తీ మద్యం వైపు, నాటు సారా వైపు మళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

సీఐడీ విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలన్నీ బయట పెడతాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మద్యం అక్రమాల విచారణకు సెట్ ఏర్పాటు చేసిన రోజునే తాడేపల్లి ప్యాలెస్ వద్ద డాక్యుమెంట్లు తగులబెట్టారు. ప్రజల జేబులు కొల్లగొట్టిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# మరింత సేవాభావంతో విధులు

### - టిటిడి ఛైర్మన్ నాయుడు

**తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి::** తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత బాధ్యతగా సేవాబావంతో సేవలందించేందుకు సత్యసాయిసేవాసంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్రనివేదిక రూపొం దించింది. ఈ బృందం మంగళవారం టిటిడి పరిపాలన భవనంలోని ఇఒ శ్యామలరావు ఛాంబర్‌లో నివేదికను అందించారు. శ్రీవారి భక్తులకు మరింత మెరుగైనసేవలందించేందుకు దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణా పరమైన సూచనలను, సలహాలను అమలు చేయాలని రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటనలో ఆదేశించారు. ఇందులో బాగంగా సత్యసాయి సేవాసంస్థలకు చెందిన నలుగురు బృందం రాష్ట్రఅధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు చుండూరి కొమరగిరి శ్యామ్‌ప్రసాద్, చుండూరి సురేంద్ర, విశ్వనాధరెడ్డి, ఐదురోజులపాటు తిరుమలలో క్షేత్రస్థాయిలో శాఖలవారీగా పరిశీలించి నివేదికలు తయారుచేశారు. దీన్ని ఇఒకు అందజేశారు. నివేదికలో సేవకులకు మాస్టర్ ట్రైనర్స్‌ద్వారా శిక్షణ, సులభంగా రిజిస్ట్రేషన్, క్షేత్రస్థాయిలో శిక్షణ, గ్రామస్థాయిలో ధర్మప్రచారానికి సేవకులతో సమన్వయం వీటితోబాటు శాఖలవారీగా చేపట్టాల్సిన అంశాలను ,

సౌకర్యాలను నివేదికలో పేర్కొన్నారు. 7పేజీల నివేదిక ఇచ్చిన ప్రతినిధులను ఈ సందర్భంగా ఇఒ శ్యామలరావు అభినందించారు.

తదుపరి నివేదిక ఆధారంగా అమలుతీరు ఉండాలని సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవికి ఇఒ సూచించారు.

# ఘనంగా జనసేన ఆవిర్భావ సభ

ఒంగోలు, ప్రభాతవార్త: ఆవిర్భావ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆ పార్టీకి ఈ ఎన్నికల్లో మంచి ఫలితం దక్కింది. అందుకే పార్టీ అవిర్భావ సభను ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. అధినేత పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనే ఏర్పాటు చేస్తున్నారు. జనసేన ఏర్పాటు చేసి పది సంవత్సరాలు గడుస్తున్న తరుణంలో, ప్రతిష్ఠాత్మకంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు గాను పక్కా ప్రనాళికలను సిద్ధం చేశారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి రెండు కీలక కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.

ఈనెల 14న పిఠాపురంలో ఆవిర్భావ సభ జరగనుంది. ఆవిర్భావ దినోత్సవ సభ ఏర్పాటులో కీలక నేతలకు కమిటీల్లో స్థానం కల్పిస్తున్నారు. ఇప్పటికే అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మంత్రి కందుల దుర్గేష్ తో కూడిన పదిమంది సభ్యులతో మరో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపల్లి సుబ్బారాయుడు, పడాల అరుణా లాంటి నేతలకు ఆ కమిటీలో ఛాన్స్ ఇచ్చారు. జన సమీకరణ కోసం జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా జిల్లాల్లో కీలక నేతలకు ఆ బాధ్యతలు అప్పగించారు. జనసేనకు గుడ్ న్యూస్.. తెలంగాణలో సైతం గుర్తింపు. సరిగ్గా 10 ఏళ్ల కిందట 2014 మార్చి 14న జనసేన ఆవిర్భవించింది. అయితే ఆ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంది. ఏపీలో టీడీపీకి, జాతీయ స్థాయిలో బీజేపీకి మద్దతు తెలిపింది జనసేన. రెండు చోట్ల మద్దతు తెలిపిన పార్టీలే అధికారంలోకి వచ్చాయి.

2019 ఎన్నికల్లో తొలిసారిగా రంగంలోకి దిగింది జనసేన. ఆ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కళ్యాణ్ సైతం ఓటమి చవిచూశారు. అయితే ఐదేళ్ల తిరగకముందే పడిలేచిన కెరటంలా మారింది జనసేన. సూపర్ విక్టరీని అందుకుంది.

జనసేనను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలన్నది పవన్ కళ్యాణన ప్రణాళిక. ఒక ప్రాంతానికో.. ఓ కులానికో పరిమితం చేయకూడదని భావిస్తున్నారు ఆయన. అందుకే ఈసారి జనసేన ఆవిర్భావ దినోత్సవ వేదిక నుంచి కీలక నిర్ణయాలు వెల్లడించనున్నారు.

పార్టీ బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. ఇంకో వైపు రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలో నేతలు జనసేనలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

# రాష్ట్రం కట్టాల్సిన అప్పులు, వడ్డీలు రూ.65,962 కోట్లు

### - శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా పలు కీలకాంశాలు వెల్లడించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని ఆర్థికంగా బలిష్టం చేస్తూనే, అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేసారు.గత ప్రభుత్వ ఆర్థికంగా రాష్ట్రాన్ని పూర్తిగా విధ్వంసానికి గురిచేసిందన్నారు.ఈ పరిస్థితులను తుట్టుకుంటూనే సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వ పరిధిలో అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు.బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.ఎంత క్లిష్ట పరిస్థితుల్లో బడ్జెట్ వచ్చిందనేది అందరూ గుర్తించారు ఇక్కడికి రాని శాసనసభ్యులు బయట నుండి విమర్శలు చేస్తున్నారు చట్టాలు చేయడం, ఆమోదించడం సభ బాధ్య త కొందరు సభకు రాకుండా ఉన్నవి లేనివి కల్పించి ప్రచారం చేస్తున్నారు చేసిన పాపాలు వెంటాడటం వల్లే వారు సభకు రాలేకపోతున్నారేమో గత ప్రభుత్వ లోపాలు ఎత్తి చూపుతారని శాసనసభకు ముఖం చాటేస్తున్నారు రాష్ట్రంలో ఐదేళ్లపాటు ఆర్థిక విధ్వంసం సృష్టించారు గతంలో విలువలు వదిలేసి ప్రతిపక్షాల గొంతు నొక్కడం పైనే దృష్టి పెట్టారు బక్కోడి బువ్వ లాక్కున్నందుకే వారు 11 స్థానాలకు పరిమితమయ్యారు వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని చెబుతున్నారు గతంలో ప్రాజెక్ట పూర్తయింది.. జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రచారం చేశారు పూర్తి అయ్యాక ప్రాజెక్టుకు ఏం కేటాయింపులు చేయాలి?.. ద్వంద్వ వైఖరేంటి? కేవలం ఓట్ల కోసం ప్రజలను మోసగించేందుకే ప్రాజెక్ట ప్రారంభించారు సభకు వస్తే వీటన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితులు లేవు సీమ సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయిస్తే వీరికి అనుమానాలు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే అనుమానాలు అభివృద్ధి పనులపై ఒత్తిళ్లను ఎలా



అధిగమించాలనేది మా తప న రాష్ట్రాన్ని గాడిన పెట్టే స్ఫూర్తి మా నాయకుడు ఇస్తున్నారు రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి ఆర్థిక శాస్త్రవేత్తలు, బ్యాంకింగ్ అధికారులను నిత్యం సంప్రదిస్తున్నాం చంద్రబాబు వస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది మా కాళ్ళకు సంకెళ్లు.. మా చేతులను తాళ్లతో కట్టేసిన పరిస్థితులు ఉన్నాయి రాష్ట్రాన్ని ఎలాంటి పరిస్థితుల్లో నడుపుతున్నామనేది ప్రజలకు తెలపాలి మా చేతుల్లో మంత్రదండం లేదు అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్తున్నాం వైసీపీ రాష్ట్రానికి హానికరం అనేది మనం గుర్తించాలి ప్రజల జీవితాలతో చెలగాటమాడి, ఆర్థిక వనరులతో విధ్వంసం సృష్టించారు రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవస్థలను స్తంభింపజేశారు ప్రజలకు జరిగిన నష్టం గురించి తెలపాల్సిన బాధ్యత మాపై ఉంది ఇవన్నీ ఆలోచించిన తర్వాతే ప్రజలు కూటమికి పట్టం కట్టారు సభలో మాట్లాడే సమయం ఇవ్వట్లేదు అని ఆరోపణలు చేస్తున్నారు మీరు వస్తే నాతో పాటు మిగతా సభ్యులు సమయం తగ్గించుకుంటాం గత ప్రభుత్వంలో రైతు బజార్లు, కలెక్టరేట్లు ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారు గవర్నర్ కు రాజ్యాంగం కల్పించిన రక్షణ తొలగించేలా జీవో ఇచ్చారు డబ్బుల వసూళ్ల కోసం గవర్నర్ పైనా కేసులు పెట్టవచ్చునెలా ఒప్పందాలు చేసుకున్నారు గత తప్పిదాలు ఎత్తిచూపితే కేంద్ర ప్రభుత్వం నివ్వెరపోయింది జీతభత్యాలపై ఏపీ 90 శాతం తెలంగాణ 30 శాతం ఖర్చు చేస్తోంది గత ఐదేళ్లుగా ఆదాయం పెరగడం ఆగిపోయింది కేంద్రం నుంచి పన్నుల రూపంలో రూ.52,080 కోట్లు రావాల్సి ఉంది ఏపీ కట్టాల్సిన అప్పులు, వడ్డీలు రూ.65,962 కోట్లు కట్టాల్సి ఉంది.

# ఇద్దరు అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

### 45 వేల రూపాయల విలువైన 15 కేజీల గంజాయి స్వాధీనం

**రేణిగుంట మార్చి 4 ప్రభాతవార్త** రేణిగుంట రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి మంగళవారం రేణిగుంట రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నంబర్ 3 పై ఇద్దరు అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద సుమారు 45 వేల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డిఎస్పి హర్షిత దేశాల మేరకు పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. ఈక్రమంలో రేణిగుంట మూడో నెంబర్ ప్లాట్ ఫామ్ పై ఇద్దరు వ్యక్తులు బ్యాగులు ధరించి అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో రైల్వే ఆర్పిఎఫ్, జీఆర్పి పోలీసులు సంయుక్తంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పశ్చిమ బెంగాల్ కు చెందిన మిల్టన్ (28), మదన్ మండల్(39) గా గుర్తించారు. వీరి వద్ద బ్యాగుల్లో ఉన్న 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు 45 వేల రూపాయలు ఉంటుంది. ముద్దాయిలను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రైల్వే కోర్టుకు తరలించారు. దాడుల్లో పాల్గొన్న జిఆర్పి సిఐ యతేంద్ర, ఆర్పిఎఫ్ సి ఐ సందీప్, జిఆర్పి ఎస్సై రవి, ఆర్పిఎఫ్ ఎస్సై రమేష్ సిబ్బందిని రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు.



మంగళవారం స్వామి వారికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

## మల్లన్నను దర్శించిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

**కొమురవెల్లి, మార్చి 4, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సీపీ డాక్టర్ అనురాధ, ఆలయ ఈవో రామాంజనేయులు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అనంతరం స్వామివారి వేద మంత్రాలతో పూర్ణకుంభమ్మతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు గర్భాలయంలో ప్రత్యేక పూజ చేసి ఆశీర్వాదం అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒగ్గు పూజారులచే పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుట్టపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మెదక్ ఎంపి రఘునందన్‌రావు, పార్టీశ్రేణులు, ప్రత్యేక అధికారి రామకృష్ణ, ప్రధానఅర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

**కొండపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్న దత్తాత్రేయ**

**జగదేవ్‌పూర్, మార్చి 4 ప్రభాతవార్త:** హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సమేతంగా మంగళవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామసమీపాన వెలసిన శ్రీ కొండపోచమ్మ అమ్మవారిని మెదక్ ఎంపి రఘునందన్‌రావుతో కలిసి దర్శించుకొని బోనం, పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆలయ ఈఓ రవికుమార్, సిబ్బంది పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కొండపోచమ్మ వద్ద ఫంక్షన్‌హాల్ ఏర్పాటుకు కృషి కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసేందుకు తగిన నిధులను మంజూరు చేసేవిధంగా కృషి చేస్తానని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు అన్నారు.



మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి.

## ప్రజావాణికి 401దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), మార్చి 4,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 401దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి 60దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 38దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 40దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 216 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 47దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించారు.

### డబ్బులు రాకపోవడంతో ఎటిఎంకు నిప్పు

## కాలి బూడిదైన 7 లక్షల నగదు

**అత్తాపూర్ మార్చి4,ప్రభాతవార్త :** ఏటీఎంలో డబ్బుల చోరీకి విఫలయత్నం చేసిన దుండగులు నగదు రాకపోవడంతో ఏటీఎం మిషన్‌కు నిప్పు పెట్టడంతో ఏడు లక్షలనగదు కాలి బూడిద అయింది. ఈ సంఘటన మైలార్ దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధుబన్ కాలనీ వద్ద ఉన్న ఎస్బిఐ ఏటీఎంలోకి ఆదివారం రాత్రి చొరబడిన దొంగలముఠా నగదు చోరీకి విఫలయత్నం చేసింది. దీంతో ఏటీఎం మిషన్ పగలగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అనంతరం దుండగులు పెట్రోల్ పోసి మిషన్‌కు నిప్పంటించారు. మంటల్లో మిషన్, 7 లక్షల కరెన్సీ నోట్లు కాలి బూడిద అయ్యాయి. నిర్వాహకులు ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం



కాలిపోయిన ఎటిఎం

ఇన్‌స్పెక్టర్ నరేందర్ పేర్కొన్నారు.ఎస్ఓటి పోలీసులు సీసీ కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



మంగళవారం గాంధీ ఆసుపత్రి వార్డులలో తనిఖీ జరుపుతున్న మంత్రి దామోదర రాజనరసింహా

## గాంధీ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఆరోగ్య మంత్రి

### వార్డులలో రోగులతో మాట్లాడి వివరాలు సేకరణ

### రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్న మంత్రి

**సికింద్రాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** పేద రోగులకు వైద్య సేవలు అందించే డాక్టర్లు, సిబ్బంది వీధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. మంగళవారం గాంధీ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజేష్ రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిలతో కలిసి ఆయన ఆస్పత్రిలోని ఓపి విభాగంలో ఫార్మసీ, డయాగ్నొస్టిక్స్, ఎక్స్ రే, స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాతా, శిశు సంరక్షణ భవనంలోని ఐవిఎఫ్ కేంద్రం సందర్శించారు. వార్డులలోకి వెళ్లి రోగులతో మాట్లాడి, వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. సంతాన సాఫల్యత కోసం వచ్చే తల్లిదండ్రులకు అందిస్తున్న సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు లేని దంపతులకు ఐవీఎఫ్ కేంద్రం ఒక వరం లాంటిదని ఆయన అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో సర్కారు దవాఖానకు పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

దవఖానాలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అన్ని విధాల సహకరిస్తున్నామని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, అలాంటి వారికి షోకాజ్ నోటీసు జారీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

# యాదాద్రిలో వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు

### వటపత్రశాయి అలంకారంలో కనుల విందుగా స్వామి ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు





మంగళవారం వటపత్రశాయి అలంకారంలో మాడమీధులలో విహరిస్తున్న లక్ష్మీ నరసింహాస్వామి, ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు

**యాదగిరిగుట్ట, మార్చి 4 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవముగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవములో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారి ఆలయములో నిత్యారాధనల అనంతరము ఉదయం గం.900లకు స్వామి వారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారిని వటపత్రశాయి అలంకారంలో అలంకరించి ఆలయ ప్రధానార్చకులు ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందము, పారాయణీకులు మేళ తాళాలు మంగళ వాయిద్యాల వేద పారాయణ నడుమ ఆలయ మాడవీధులలో ఊరేగింపు సేవ నిర్వహించి ఆలయ తూర్పు రాజగోపురం ముందు స్వామి వారిని వేంచేపు చేసి ఆలయ ప్రధాన అర్చకులు నల్లందిగల్ లక్ష్మీనరసింహ ఆచార్యులు ఉప ప్రధానార్చకులు అర్చకులు స్వామివారి వైభవాన్ని వటపత్రశాయి అలంకార విశేషాలు భక్తులకు వివరించారు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని సేవిస్తూ తరించారు. **వటపత్రశాయి అలంకార శేవ ప్రత్యేకత :**భక్తులను సంరక్షించడానికి స్వామివారు వివిధ అవతారములలో ఈ లోకములో అవతరించి భక్త కోటిని రక్షిస్తారని భక్తుల విశ్వసనీయమైన నమ్మకం వటపత్రశాయి. అనగా మట్టి ఆకుపై పవళించిన పరమాత్మ యొక్క బాలముకుంద స్వరూపం. **సాయంకాల కార్యక్రమములు :**హంస వాహన శేవలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారుసాయంకాలము 700 గంటలకు స్వామి వారిని హంస వాహన శేవ లో అలంకరించి తిరుమాడ వీధులలో ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవముగా ఊరేగింపు వేడుక నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్స వములలో నిర్వహించు సాంస్కృతి కార్యక్రమములలో భాగంగా మంగళవారం శ్రీరామభక్త భజన మండలి, రాయగిరి వారిచే భజన నిర్వహించారు సాయిబాబా సేవా సమితి, రామంతాపూర్ వారిచే భజన నిర్వహించారు. ఆలయ ఆస్థానం విద్వాంసులు చే మంగళవాద్యం నిర్వహించారు. ఆలయ ఆస్థానం విద్వాంసులు చే వైదిక ప్రార్థన నిర్వహించారు విజయకుమారాచార్య స్వామి, హైదరాబాద్ వారిచే నృసింహ అవతార వైభవము వాహన సేవల గూర్చి ప్రవచనము ఉపన్యాసం నిర్వహించారు శ్రీమతి వేదవతి భాగవతారిణి, ఒంగోలు వారిచే సీతా రామ కళ్యాణము హరికథా గానము నిర్వహించారు. భువనగిరి నుండి సిరి కూచిపూడి నృత్యాలయం నిర్వహించారు, సి.హెచ్.రఘునందన్, వేములవాడ వారిచే భక్తి సంగీతం నిర్వహించారు సాయంకాలము గం.600ల నుండి రాత్రి గం.9 00ల వరకు ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్ మరియు వారి బృందం ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఈ వేడుకలలో ఆలయ ఆనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఆలయ కార్యనిర్వహణా ధికారి ఎ.భాస్కరరావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, రమేష్ బాబు.ఆలయ అధికారులు ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని సేవించుకున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బిజెపి గెలవడం ఒక చరిత్ర

### రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభసభ్యుడు కె.లక్ష్మణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి4:** కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి గెలవడం ఒక చరిత్ర అని ఆ పార్టీ కీలక నేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మల్క కొమురయ్య గెలుపుతో ఉత్తర తెలంగాణలో బిజెపి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఎవరికీ అవకాశం లేకుండా మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే తాము గెలిచామని అన్నారు. టిచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో బిజెపి గెలవలేదని, ఈ గెలుపుతో చరిత్ర తిరగ రాశామని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కిషన్‌రెడ్డి,బండి సంజయ్‌ను విమర్శించే వారంతా ముందు రాష్ట్ర అభివృద్ధికి వారేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేసి ప్రజల దృష్టిని మరల్చడానికి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలన చేతకాక అయోమయం, గందరగోళంతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ సర్కార్ అధోగతి పాలు చేస్తోందని దుయ్యబట్టారు. రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ ముసుగులో గత ప్రభుత్వంలోని బీఆర్ఎస్ నేతలు లబ్ధి పొందారని, ఆ ప్రాజెక్ట్ ఉత్తర భాగం రైతులకు నష్టం చేశారని పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ రైతులకు న్యాయం చేస్తామని ప్రియాంక గాంధీతో చెప్పించారని, ఇప్పటి వరకు న్యాయం చేయలేదని అన్నారు. ఉత్తర భాగం రైతులు అలైన్మెంట్ మార్చాలని అడిగితే పట్టించుకోని ముఖ్యమంత్రి దక్షిణ భాగంలో మాత్రం మార్చారన్నారు. దీనిలో ఆంతర్యం ఎంటి, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చాలని అనుకుంటున్నారా అని ఆయన ప్రశ్నించారు. రిజనల్ రింగ్‌రోడ్డ్ ప్రాజెక్ట్ డీపీఆర్ లోపభూయిష్టంగా ఉంది అని ఆరోపించారు. కేసీఆర్ చేసిన తప్పిదాలే రేంత్‌రెడ్డి చేస్తున్నారని, కేసీఆర్‌కు పట్టినగతే రేవంత్‌కు పడుతుందన్నారు. ముందు వరంగల్ వేదికగా ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రైతుడిక్లరేషన్‌ను సమగ్రంగా అమలు చేసి చూపించాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ నేతల్లో ఎవరికీ పరిపాలనపై అవగాహన లేదని విమర్శించారు. అంతా రేవంత్‌రెడ్డి సీటు ఎప్పుడు ఖాళీ అవుతుందా?ఎప్పుడు లాక్కుందామా? అనే చూస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది కాబోతుంది అనివిమర్శించారు.

కాగా, అంతకు ముందు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మల్క కొమురయ్యకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలియ జేశారు. తెలంగాణ బిజెపి చేస్తున్న అవిశ్రాంత పోరాటాన్నిఉపాధ్యాయులుగుర్తించి ఆదరించారని సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఈ గెలుపు గుణపాఠం అని పేర్కొన్నారు.

# నీట్-2025 పరీక్ష ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

### మే 4న దేశవ్యాప్తంగా జరగనున్న పరీక్ష



**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ సీట్ల భర్తీ కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ ఎగ్జామ్(నీట్)-2025పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మే 4న జరగనున్న నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ మహేశ్ భగవత్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేందర్ ఇతర అధికారులు టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో రాష్ట్రానికి మంచి ట్రాక్ రికార్డు ఉందని, మౌలిక సదుపాయాలు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వంటి ప్రభుత్వ భవనాలను వెంటనే గుర్తించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భూ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) పురోగతిని కూడా సీఎస్ సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన దరఖాస్తులకు రిబేట్ (రాయితీ)పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గతంలో నామ మాత్రపు ఫీజులు చెల్లించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని కూడా పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు.

## పంటలకు సరిపడా నీరు అందించండి: సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంటలకు సరిపడా సాగు నీరు అందించాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సచివాలయం నుండి అన్ని జిల్లాల కలె క్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ యాసంగి పంటలకు నీటి నిర్వహణ సమర్థవంతంగా జరిగేలా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతేడాదితో పోలిస్తే నికర సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ నీటి లభ్యత సౌకర్యంగా ఉందన్నారు. రాబోయే పది రోజులలో విద్యుత్, నీటి సరఫరాను జాగ్రత్తగా సమన్వయం చేయాలన్నారు. జిల్లాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు మండల స్థాయి బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన నిర్వహణ ఉండేలా కలెక్టర్లు పర్యవేక్షి ంచాలన్నారు. అలాగే రాష్ట్రంలో నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా తగినంత పరిమాణంలో ఉన్నాయని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని సీఎస్ సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు ఉత్తమ పద్ధతులను ఎంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎంబిఎస్ ఎండి సుఖేష్ గుప్తా సహా నలుగురిపై ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇడి

**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** తప్పుడు పత్రాలతో బంగారం కొనుగోలు కోసం రుణం పొంది, ఆనక దానిని ఎగ్గొట్టిన నేరంపై అరెస్టయిన ఎంబిఎస్ అధినేత సుఖేష్ గుప్తాతో పాటు ముసద్దీలాల్ జ్వెవల్లర్స్ సంస్థకు చెందిన మరో ముగ్గురిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. వీరి వద్ద నుంచి ఇప్పటికే వంద కోట్ల రూపాయలకు పైగా బంగారం నగలను ఈడీ జప్తు చేయడం తెలిసిందే.

వీరంతా నేరం చేసినట్లు ఆధారాలు సేకరించిన ఈ డీ తాజాగా వీటిని కోర్టుకు ఛార్జిషీట్ ద్వారా అందించింది. అభియోగాలు మోపబడిన వారిలో సుఖేష్ గుప్తాతో పాటు కర్రి రవి ప్రసాద్, వల్లూరి మోహన్ కుమార్ కూడా వున్నారు.

## ఎల్ఆర్ఎస్ స్కీమును సద్వినియోగం చేసుకోండి

### శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు

**శంషాబాద్. మార్చి 4, ప్రభాతవార్త :** 2025లో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎంఆర్ఎస్)ను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీంను పునరుద్ధరించిందని ఆయన తెలిపారు. అనధికార లేఅవుట్‌లను చట్టబద్ధం చేయడానికి. భూ యజమానుల కోసం అనేక ప్రయోజనాలను అందించడానికి ఈ పథకాన్ని ప్రభుత్వం రూపొందించబడిందని వివరించారు.

**ఎల్ఆర్ఎస్ 2025 ప్రయోజనాలు:** చట్టబద్ధమైన యాజమాన్యం ఎల్ఆర్ఎస్ ద్వారా, భూ యజమానులు తమ స్థలాలకు చట్టబద్ధమైన హక్కులను పొందవచ్చు. ఇది భవిష్యత్ లావా దేవీలు. నిర్మాణ అనుమతులకు మార్గం సుగమం చేస్తుందని స్పష్టం చేశారు.

**నిర్మాణ అనుమతులు :**చట్టబద్ధమైనస్థలాలు నిర్మాణ అనుమతులను సులభంగా పొందగలవు, ఇది భవన నిర్మాణాలను వేగవంతం చేస్తుందన్నారు.

**బ్యాంకు రుణ సదుపాయాలు:** చట్టబద్ధమైన స్థలాలు బ్యాంకు రుణాలను పొందడంలో సులభతరం చేస్తాయి, ఇది భవన నిర్మాణం లేదా ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

**రిజిస్ట్రేషన్ ఛార్జీలపై 25 రాయితీ:** 2025 మార్చి 31వరకు, రిజిస్ట్రేషన్ ఛార్జీలపై 25 రాయితీని ప్రభుత్వం అందిస్తోంది, ఇది భూ యజమానులపై ఆర్థిక భారం తగ్గిస్తుందని సుమన్ రావు వివరించారు.

**సులభతరమైన రెగ్యులరైజేషన్ ప్రక్రియ:**కనీసం 10 రిజిస్ట్రేషన్‌చేసిన ప్లాట్లు ఉన్న లేఅవుట్‌లు ఇప్పుడు రెగ్యులరైజేషన్‌కు అర్హత కలిగి ఉం టాయన్నారు. ఇది అనేకమందిభూ యజమానులకు లాభదాయకంగాఉంటుందని తెలిపారు.శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని శాతం రాయి రెవిన్యూ పరిధిలో ఇది వర్తిస్తుందని అన్నారు.

## సిఏ ఇంటర్, ఫౌండేషన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థుల హవా

### హైదరాబాద్‌కి చెందిన దీపాన్షి అగర్వాల్ ఆల్ ఇండియా టాపర్

### ఏపీకి చెందిన సోమనాథ్ శేషాద్రి నాయుడు ఆల్ ఇండియా 2వ ర్యాంక్

**హైదరాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:** ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ) సిఏ ఇంటర్, ఫౌండేషన్ పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. హైదరాబాద్‌కి చెందిన అమ్మాయి దీపాన్షి అగర్వాల్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సొంతం చేసుకుంది. విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రినాయుడు ఆల్ ఇండియా 2వ ర్యాంక్‌ను సాధించాడు. అలాగే తెలంగాణలోని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చేరాల సిరి సహస్ర సీఏ ఫలితాల్లో 35వ ర్యాంకు సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌కు చెందిన సర్థాక్ అగర్వాల్ మూడో ర్యాంక్ సాధించాడు. దేశవ్యాప్తంగా 48,261మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6781 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జనవరి నెలలో ఈ పరీక్షలు నిర్వహించగా ఫలితాలను మంగళవారం ప్రకటించారు. దేశవ్యాప్తంగా కేవలం 14.05 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.



ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న సాంస్కృతిక కళాకారులు

## ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

### లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తాం : నిరుద్యోగ కళాకారుల సంఘం

**హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమాన్ని ఉగ్రూతాలూగించిన నిరుద్యోగ కళాకారులకు రాష్ట్ర సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలిస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని. లేనిపక్షంలో త్వరలోనే అసెంబ్లీని ముట్టడిస్తామని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనువోజు వెంకటేశం డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్ మీడియాతో మాట్లాడారు. గత కెసిఆర్ ప్రభుత్వం కళాకారులను పట్టించుకొన్న పాపానపోలేదన్నారు. నాటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వెంటనే 1500 మంది నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథి లో ఉద్యోగాలిస్తామని హామీనివ్వడమేకాక, మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచారని తెలిపారు. ఈ విషయమై సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతికశాఖ సారథి చైర్ పర్సన్ గుమ్మడి వెన్నెలకు విన్నవించుకోగా, త్వరలోనే కమిటీ వేస్తాం, నిరుద్యోగ కళాకారులను ఆదుకొంటామని చెప్తూ కాలయాపనతో జాప్యం చేయడం సరి కాదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కళాకారులందరికీ ఉద్యోగాలిచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కళావేదిక గ్రేటర్ హైదరాబాద్ ఇన్చార్జి ప్రవీణ్‌కుమార్, పాట మహేశ్ పాలాటిరాజు, మోతేరమేశ్ రాజోజు మధు ఎండిసలీం. శారద పాల్గొన్నారు.

# 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సక్సెస్ మీట్

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద ప్రదీప్ రంగనాథన్ హీరోగా అశ్వత్ మారిముత్తు తెరకెక్కించిన చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహార్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్. అఘోరం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మించారు. ఫిబ్రవరి 21న వచ్చిన ఈ చిత్రం వంద కోట్ల క్లబ్బులో జాయిన్ అయింది. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో యూనిట్ అంతా కలిసి సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. నిర్వహించిన ఈ సక్సెస్ మీట్‌లో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, 'ఓ ఫ్రెండ్‌కు మంచి సినిమా ఇవ్వాలని అశ్వత్ ఈ కథను మొదలు పెట్టారు. ప్రయత్నిస్తే కచ్చితంగా జరుగుతుంది అనే పాయింట్‌తో ఈ సినిమాను స్టార్ట్ చేశాం. మంచి సినిమాను చేయాలనే ఉద్దేశంతోనే మా నిర్మాత అర్చనా మేడం ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్‌ను థియేటర్లో చూసి అశ్వత్ ఎమోషనల్ అయ్యారు. తెలుగు ఆడియెన్స్ చూపించిన ప్రేమకు మేం ముగ్ధులం అయ్యాం. లియోన్ జేమ్స్ మంచి సంగీతాన్ని ఇచ్చారు. మాకు ఇంత పెద్ద హిట్ ఇచ్చిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్. అనుపమ పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. అడాప్టెడ్ సన్ అంటూ నా మీద మీమ్స్ వేస్తున్నారు. నన్ను మీలో ఒకడిగా చేర్చుకున్నందుకు థాంక్స్. తెలుగు ఆడియెన్స్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని అన్నారు. అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ, 'రాజమౌళి నాకు స్ఫూర్తి. సినిమాలో ఎమోషన్ కనెక్ట్ అయితే అన్ని ప్రాంతాల వారికి కనెక్ట్ అవుతుందని ఆయన నిరూపించారు. ప్రేమ, స్నేహం, తల్లిదండ్రులు అనేది యూనివర్సల్ కాన్సెప్ట్. ఈ మూడు కూడా మా సినిమాలో ఉన్నాయి. అందుకే మా చిత్రాన్ని ఆడియెన్స్ ఇంత పెద్ద హిట్ చేశారు. నా టీం, హీరోతో ఉన్న స్నేహం వల్లే మా చిత్రం ఇంత బాగా వచ్చింది. మహేష్ బాబు ఓ మై కడవలే సినిమా గురించి ట్వీట్ వేయడంతో బాగా రీచ్ వచ్చింది. తెలుగు ఆడియెన్స్ అంతా ఆ సినిమాను చూశారు.



# నా కెరీర్‌లో గుర్తుపెట్టుకునే క్యారెక్టర్ 'రాబిన్‌హుడ్'

హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయికగానటించింది. ఈ సినిమా మార్చి 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నట కిరీటి రాజేంద్రప్రసాద్ విలేకరుల సమావేశంలో రాబిన్‌హుడ్ విశేషాలు పంచుకున్నారు.



**రాబిన్‌హుడ్ జర్నీ ఎలా అనిపించింది?** సినిమా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్ళు అయ్యింది. రాబిన్‌హుడ్ చేశాక యాక్టర్‌గా నామీద నాకు కాన్ఫిడెన్స్ లెవల్ పెరిగింది. రాబిన్‌హుడ్ చూసాక నేను హీరోగా చేసిన ఎంటర్ టైనింగ్ సినిమాలు, ఆనాటి రోజులు ఆడియన్స్‌కి గుర్తుకు వస్తాయి. నేను హీరోగా నటించిన పాత రోజులు మళ్ళీ గుర్తుకు వచ్చాయి. ఈ సినిమా, క్యారెక్టర్ పట్ల చాలా హ్యాపీగా వుంది.

**రాబిన్‌హుడ్‌లో మీకు, నితిన్‌కి మధ్య కెమిస్ట్రీ ఎలా వుంటుంది?** ఇందులో ఇండియాలోనే హయ్యస్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ నాది. నా ఏజెన్సీలో పని చేయడానికి హీరో వస్తాడు. ఇంతకంటే కథ చెప్పకూడదు (నవ్వుతూ) ఈ కాంబినేషన్‌లో చాలా అద్భుతంగా వుంటుంది.

**డైరెక్టర్ వెంకీ కుడుముల గురించి?** వెంకీ కుడుముల చాలా బిగ్ డైరెక్టర్ అవుతారు. ఈ మధ్య కాలంలో వన్ అఫ్ ది బెస్ట్ క్యారెక్టర్ రాబిన్‌హుడ్‌లో చేశాను. డైరెక్టర్ వెంకీ స్పెషల్‌గా ఈ క్యారెక్టర్‌ని నా గురించి రాసుకున్నారు. వర్క్ చేస్తున్నప్పుడే చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా ఇది. వెంకీ, త్రివిక్రమ్ దగ్గర అసిస్టెంట్‌గా చేశారు. ఆయన లక్షణాలు అన్నీ వచ్చాయి. డైలాగ్‌లో మంచి పంచ్ వుంటుంది. తను కథ చెప్పినప్పుడు చాలా ఎంజాయ్ చేశాను.

**రాబిన్‌హుడ్‌లో శ్రీలీల క్యారెక్టర్ ఎలా ఉండబోతోంది?** శ్రీలీల చాలా మంచి సినిమాలు చేస్తోంది. చాలా మెచ్యూర్ యాక్టర్‌గా కనిపించింది. ఇందులో ఆమె బిహేవియర్ నాకు చాలా నచ్చింది. ఇందులో ఫారిన్ నుంచి వచ్చిన తనకి సెక్యూరిటీ ఇచ్చే బాధ్యత మాది. చాలా సరదాగా వుంటుంది.

**మైత్రి మూవీ మేకర్స్ గురించి?** శ్రీమంతుడు సినిమా నుంచి వారితో నాకు మంచి అనుబంధం వుంది. సినిమా అంటే చాలా పాషన్ వున్న నిర్మాతలు.

**కొత్త దర్శకులకు మీతో వర్క్ చేయడం ఎలా వుంటుంది?** నాకు కొత్త పాత అని వుండవు, కొత్త దర్శకులు నాతో వర్క్ చేయడానికి చాలా ఇష్టపడతారు. అందరికంటేముందు నేనేసెట్స్‌లో అల్లరి చేస్తాను.




# 'కింగ్‌స్టన్' ప్రి రిలీజ్ ఈవెంట్

కోలీవుడ్ ఇండస్ట్రీలో మ్యూజిక్ డైరెక్టర్‌గా, నటుడిగా, నిర్మాతగా రాణిస్తున్న యంగ్ హీరో జీవీ ప్రకాష్ కుమార్. విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన తాజాగా కింగ్‌స్టన్ మూవీతో థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. ఫస్ట్ సీ అడ్వెంచర్ ఫ్యాంటసీ మూవీగా రూపొందుతున్న ఈ మూవీలో బ్యాచిలర్ తరువాత మరోసారి దివ్యభారతి, జీవీ ప్రకాష్ జంటగా కనిపించబోతున్నారు. ఈ మూవీకి కమల్ ప్రకాష్ దర్శకత్వం వహించగా, జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. జీ స్టూడియోస్ తో పాటు జీవీ ప్రకాష్ కుమార్ తన సొంత బ్యానర్ ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్‌పై ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన ట్రైలర్ సినిమా అంచనాలను అమాంతం పెంచింది. తమిళ, తెలుగు భాషల్లో మార్చ్ 7న రిలీజ్ చేయబోతున్నారు. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి తెలుగులో సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్లో కింగ్‌స్టన్ ప్రి రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల, మరో డైరెక్టర్ వెంకీ అట్లూరి, మైత్రి మూవీ మేకర్స్



రవిశంకర్ గెస్ట్‌లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో నితిన్ మాట్లాడుతూ, కింగ్‌స్టన్ ట్రైలర్ స్టన్నింగ్‌గా ఉంది. విజువల్స్ ఫెంటాస్టిక్‌గా ఉన్నాయి. ఇలాంటి స్పెక్టాకులర్ విజువల్స్ అందించినందుకు డైరెక్టర్ కమల్‌కు అభినందనలు. ట్రైలరే ఇలా ఉంటే, ఇంకా సినిమా ఎలా ఉంటుందో అనే ఆతృత పెరిగింది. నేను ఈ మూవీ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నాను. కింగ్‌స్టన్ మూవీ మార్చ్ 7న రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులకు విజువల్ ఫీస్ట్ ఇస్తుందని నమ్ముతున్నాను. ఇది ఫస్ట్ సీ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్. సినిమా ఖచ్చితంగా బాగుండాలని, బాగా ఆడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. దివ్య మీరు తెలుగు చాలా బాగా మాట్లాడారు. అందులో బ్లాక్ బస్టర్ సాంగ్స్, అవార్డులు వస్తూ ఉంటాయి. నువ్వు ఎలా మేనేజ్ చేస్తున్నావు? నీ సీక్రెట్ ఏంటి నాకు చెప్తే, నేను వెంకీ నేర్చుకుంటాము అన్నారు నితిన్. జీవీ ప్రకాష్ కుమార్ స్పందిస్తూ ఎలాంటి సీక్రెట్స్ లేవు సార్. నేను రోజు పని చేస్తాను అని చెప్పుకొచ్చాడు. అంటే మేము పని చేయమా అని సెటైర్ వేశారు నితిన్. మీరు యాక్టింగ్ ప్రిఫర్ చేస్తారా లేదంటే మ్యూజిక్ నా? అనే నితిన్ ప్రశ్నకు, మీరు నన్ను ప్రిఫర్ చేసినప్పుడు మ్యూజిక్, షూటింగ్ ఉన్నప్పుడు యాక్టింగ్ అన్నారు జీవీ ప్రకాష్ కుమార్. రాబిన్ హుడ్ బాగుందా? కింగ్‌స్టన్ బాగుందా? అనే ప్రశ్నకు, మీరంతా ఉన్నప్పుడు రాబిన్ హుడ్ బావుంది. మీరు వెళ్లిపోయాక కింగ్‌స్టన్ బాగుంది అని సరదాగా సమాధానం చెప్పారు. రాబిన్ హుడ్ మూవీకి మ్యూజిక్ బాగుందా? కింగ్‌స్టన్‌కు బాగుందా? నీ మూవీకి బాగా కొట్టుకున్నావా? అని నితిన్ అడగ్గా, రాబిన్ హుడ్ మూవీ మ్యూజిక్కే స్పెషల్. కామెడీ యాక్షన్ పోర్షన్ అద్భుతంగా ఉంది. నేను ఇప్పటికే సినిమా చూశాను.

# '8 వసంతాలు' లవ్ మెలోడీ సాంగ్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్‌సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ అందమా అందమాను విడుదల చేసి మ్యూజిక్ జర్నీ ప్రారంభించారు. సోల్ ఫుల్ నెంబర్స్‌కి పాపులరైన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఒక అందమైన లవ్ మెలోడీని స్వరపరిచారు, ఇది ఒక యువకుడి మనసుని దోచుకున్న అమ్మాయి పట్ల అతని అనురాగాన్ని ప్రజెంట్ చేస్తోంది. విన్నవెంటనే కనెక్ట్ అయ్యే ఈ పాట ఆడియన్స్‌ని కట్టిపడేసింది. మెలోడిక్ అకౌస్టిక్ గిటార్ సోల్ ఫుల్ టచ్ తీసుకొచ్చింది. ప్రతి వాయిద్యం లవ్ ఎమోషన్ డెప్త్ ప్రజెంట్ చేస్తోంది. వనమాలి రాసిన సాహిత్యం కవితాత్మకంగా వుంది. హేషమ్ అబ్దుల్ వహాబ్, ఆవాని మల్హార్‌తో కలసి మెస్మరైజింగ్‌గా ఈ పాటని ఆలపించారు. హను రెడ్డి, అనంతిక బ్యుటీఫుల్ కెమిస్ట్రీ షేర్ చేసుకున్నారు. విజువల్స్ పాటలానే ఆకట్టుకున్నాయి. నవీన్ యెర్నేని,వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. అరవింద్ ములే ప్రొడక్షన్ డిజైన్‌ను, శశాంక్ మాలి ఎడిటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతమైన కథనంతో ఆకట్టుకుంటుంది. నిర్మాతలు త్వరలో సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేస్తారు. తారాగణం: అనంతిక సనిల్‌కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా, స్వరాజ్ రెబ్బాప్రగడ, సమీరా కిషోర్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ఫణీంద్ర నర్సెట్టి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్, సిఇఒ: చెర్రీ, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, డీఓపీ: విశ్వనాథ్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: అరవింద్ మ్యూల్, ఎడిటర్: శశాంక్ మాలి
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబాసాయి కుమార్ మామిడిపల్లి
యాక్షన్ కొరియోగ్రఫీ: వింగ్ చున్ అంజి
పీఆర్వో: వంశీ శేఖర్
మార్కెటింగ్: ఫస్ట్ షో.



# 'పెళ్లి కాని ప్రసాద్' హిలేరియస్ టీజర్

సప్తగిరి అప్ కమింగ్ అవుట్‌అండ్‌అవుట్ ఎంటర్టైనర్ పెళ్లి కాని ప్రసాద్. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహిస్తున్నారు. విజన్ గ్రూప్‌కు చెందిన కె.వై. బాబు, థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 21న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. చాగంటి సినిమాటిక్ వరల్డ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌విసి) విడుదల చేస్తుంది. ఈ రోజు రెబల్ స్టార్ ప్రభాస్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు.

"ప్రసాద్ అనే నేను.. కట్నం శాసనాల గ్రంథంలో ఉన్న రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కు గౌరవం ఇస్తూ తరతరాలుగా కట్నం విషయంలో మా తాతముత్తాతలు ఫాలో అవుతున్న షరతులకు కట్టుబడి ఉంటానని మా తాతముత్తాతల మీద ప్రమాణం చేస్తున్నా" అంటూ సప్తగిరి చెప్పే డైలాగ్స్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా సాగింది. శాసనాల గ్రంథం ప్రకారం అతను పెళ్లి చేసుకోవ డానికి కనీసం 2 కోట్ల రూపాయలు కట్నం తీసుకోవాలి. అంతకన్నా తక్కువ అయితే కుదరదు. మరో సవాల్ ఏమిటంటే, కట్నం నగదు రూపంలో చెల్లించాలి. ఇంత కఠినమైన పరిస్థితులలో సప్తగిరి పెళ్లి కాని ప్రసాద్ (శాశ్వత బ్రహ్మచారి)గా ఎప్పటికీ ఉంటాడా? పెళ్లి అవుతుందా? అనేది చాలా హిలేరియస్‌గా ప్రజెంట్ చేశారు. సప్తగిరి తన అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ప్రియాంక శర్మ హీరోయిన్ పాత్రలో నటిస్తుండగా, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ కీలక పాత్రల్లో అలరించారు. సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ రిచ్‌గా వుంది. శేఖర్ చంద్ర నేపథ్య సంగీతం ఫన్‌ని మరింత ఎలివేట్ చేసింది. మధు ఎడిటర్. హ్యూమర్, సోషల్ కామెంటరీతో అలరించిన ఈ టీజర్ సినిమాపై అంచనాలని పెంచింది. తారాగణం: సప్తగిరి, ప్రియాంక శర్మ, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, అన్నపూర్ణమ్మ, ప్రమోదిని, బాషా, శ్రీనివాస్, ప్రభావతి, రోహిణి, రాంప్రసాద్, సాంకేతిక సిబ్బంది: స్క్రీన్ ప్లే అండ్ దర్శకత్వం: అభిలాష్ రెడ్డి గోపిడి, నిర్మాతలు: కెవై.బాబు (విజన్ గ్రూప్), భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల.



# 7న 'రా రాజు'

మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది మామూలు సాహసం కాదు. ఆర్టిస్టుల్ని చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిచే సినిమా ఇది. శ్రీమతి పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'. ఇలాంటి అద్భుతమైన ప్రయోగం చేసి మెప్పించేందుకు రెడీ అయింది 'రా రాజా' టీం. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 7న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో చిత్ర యూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బి. శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'నిర్మాతగా సినిమాలు చేస్తున్న టైంలో నా మైండ్‌లోకి వచ్చిన పాయింట్‌ను కథగా మార్చాను. అలా అనుకోకుండానే నేను దర్శకుడిగా మారిపోయాను. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటి వరకు చూసిన వారంతా మెచ్చుకున్నారు. ఈ చిత్రం మార్చి 7న రాబోతోంది.అందరూ చూసి ఆదరించా లని కోరుకుంటున్నాను' అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర మాట్లాడుతూ, 'రా రాజా చిత్రానికి మంచి మ్యూజిక్ ఇచ్చే స్కోప్ దక్కింది. శివ ప్రసాద్ నాకు నిర్మాతగా ఎప్పటి నుంచో తెలుసు. రా రాజా కథ గురించి ఆయన చెప్పారు. కానీ అప్పుడు నిర్మాతగా చెబుతున్నారని అనుకున్నా.. కానీ దర్శకుడిగా కథ చెబుతున్నారని తరువాత అర్థమైంది. కథ చాలా బాగుంది. సినిమా బాగా వచ్చింది. మీడియా, ఆడి యెన్స్ అందరూ సినిమాకు సపోర్ట్ అందించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. కెమెరామెన్ రాహుల్ శ్రీ వాత్సవ్ మాట్లా డుతూ, 'రా రాజా సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాత లకు థాంక్స్. ఈ చిత్రం చాలా బాగా వచ్చింది. అందరూ చూసిసక్సెస్ చేయండి' అని అన్నారు.



# 'టుక్ టుక్' టీజర్ లాంచ్

వైవిధ్యమైన సినిమాలకు, న్యూ కాన్సెప్ట్‌లకు, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే చిత్రాలకు తెలుగులో ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అలాంటి చిత్రాలను చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా అఖండ విజయాన్ని అందిస్తుంటారు మన తెలుగు ప్రేక్షకులు. ఇప్పుడు ఈ కోవలోనే ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం టుక్ టుక్. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు,సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సి.సుప్రీత్ కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని మరియు ఆర్ వై జి సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణలు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు మేకర్స్. మంగళవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా శాన్వీ మేఘన మాట్లాడుతూ, పుష్పక



విమానం తరువాత నేను చేసిన ఆటో ఎంటర్‌టైనర్ టుక్ టుక్. టీజర్ అందరికి నచ్చిందని అనుకుంటున్నాను. ఈ సినిమాలో సూపర్ నేచురల్, మ్యాజికల్ పవర్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ సినిమాలో ఉన్న చాలాసర్‌ప్రైజెస్ ఎంజాయ్ చేయడానికి అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడాలి అన్నారు. రోషన్ మాట్లాడుతూ టీజర్ అందరికి నచ్చిందని అనుకుంటున్నాను. ముగ్గురు యువకుల ప్రయాణం. వాళ్ల జీవితంలో వచ్చిన మ్యాజికల్ ఎలిమెంట్స్‌ను ఎలా ఫేస్ చేశాడో ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. తప్పకుండా ఈ సినిమా అందరి హృదయాలకు హత్తుకుంటుందనే నమ్మకం ఉంది అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ, చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేశాం. ఈ సినిమాలో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ ఉన్నాయి. అందరూ సినిమాను ఎంజాయ్ చేస్తారు. మంచి కిక్ ఇస్తుంది అన్నారు. దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ, థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా ఇది. డిఫరెంట్ కాన్సెప్ట్. త్వరలో ఈ సినిమా గురించి ఓ బిగ్గెస్ట్ సర్‌ప్రైజ్ రాబోతుంది.

# 'మహారాణి' సీజన్ 4 టీజర్ విడుదల

మన ఓటీటీ మాధ్యమాల్లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన వెబ్ సిరీస్‌ల్లో ఒకటి 'మహారాణి'. అందరి మనసుల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న ఈ సిరీస్ నుంచి నాలుగో సీజన్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. ప్రముఖ నటి హ్యూమా ఖురేషి ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్ సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ 'మహారాణి' సీజన్ 4కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. చదువు రాని ఓ గృహిణి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రాణి భారతి (హ్యూమా ఖురేషి) జీవిత ప్రయాణాన్ని తెలియజేసే సిరీస్ ఇది. ఈ వ్యవస్థలో ఆమెకు ఎదురైన సవాళ్లు, అధికారంలో ఉన్న ఇబ్బందులు, కుట్రలు, రాజకీయ వైరుధ్యాలు ఇందులో మనం చూడొచ్చు. ప్రేక్షకాదరణ పొందిన గత మూడు సీజన్స్ తరహాలోనే నాలుగో సీజన్ కూడా మరింత గ్రిప్పింగ్ ప్రేక్షకులను మెప్పించనుంది.



టీజర్‌ను గమనిస్తే ఎంతో ఆసక్తి కరంగా ఉంది. ఎలాంటి భయం లేకుండా ఉండే ముఖ్యమంత్రి రాణి భారతిగా హ్యూమా ఖురేషి తన రాష్ట్ర ప్రజలను కాపాడుకోవటానికి ఎంత దూరమైనా వెళ్లే పవర్‌ఫుల్ పాత్రలో అలరించబోతున్నారు. టీజర్ చాలా గ్రిప్పింగ్‌గా ఉంటూ రానున్న సీజన్ 4పై అంచనాలను మరింతగా పెంచుతోంది. త్వరలో సోనీ లివ్‌లో ప్రసారం కానున్న 'మహారాణి' సీజన్ 4లో పవర్‌ఫుల్ రాణి భారతిని వీక్షించడానికి సిద్ధం కండి.




# పాతికేళ్లకే ప్రతిష్టాత్మక పురస్కారం

**వేశ్యల జీవితాలు, సమాజంలో వాళ్లదుర్కొనే కష్టాలే కథాంశంగా తెరకెక్కిన సినిమాలెన్నో! హాలీవుడ్ చిత్రం ఖిఅనోరాఖి కూడా అలాంటి కథతో రూపొందించిన సినిమానే! తాజా ఆస్కార్ అవార్డుల్లో ఒకటి కాదు.** రెండు కాదు.. ఏకంగా ఐదు విభాగాల్లో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం గెలుచుకుంది చిత్రం. ఇందుకు ఈ చిత్ర కథానాయిక మైకీ మ్యాడిసన్ నటన కూడా ఓ కారణమే అంటున్నారు సినీ విశ్లేషకులు. ఈ సినిమాగాను తాజాగా 'ఉత్తమ నటి'గా ఆస్కార్ అందుకున్న మైకీకి ఇది తొలి అకాడమీ పురస్కారం. అంతేకాదు... పాతికేళ్లకే ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకొని.. ఈ ఘనత సాధించిన రెండో అతి పిన్న నటిగా చరిత్రకెక్కింది హాలీవుడ్ తార. దీంతో ఈ యువనటి పేరు ప్రస్తుతం ప్రపంచమంతా మార్మోగుతోంది.

**అమ్మ ప్రోత్సాహంతో...**

సినీ నేపథ్యం ఉన్న వారికే అంతంతమాత్రంగా ఉన్న ఈ రోజుల్లో సొంత ప్రతిభతో సినిమాల్లోకి రావాలనుకోవడం నిజంగా సాహసమనే చెప్పాలి. మైకీ అలాంటి సాహసమే చేసిది. లాస్ ఏంజెల్స్‌లో పుట్టిన ఆమెను చిన్నప్పట్నుంచే సినిమాలపై ఈ ముక్కుతోనే హాలీవుడ్‌లో అడుగుపెట్టానుకుందామె. కానీ ఒకానొక దశలో అది అందని ద్రాక్షే అని రియలైజైన మైకీని ఆమె తల్లి ఈ దిశగా ప్రోత్స హించాలనుకుంది సినిమాల్లోకి రావాలని కలలు కంటోన్న కూతురి మనసు తెలుసుకున్న ఆమె.. టీజీలో ఉన్నప్పుడే ఆమె యార్టింగ్ స్కూల్లో చేర్పించింది. "మా అమ్మానాన్న లిద్దరూ మానసిక వైద్య నిపుణులు చిన్నప్పట్నుంచీ గుర్రపు స్వారీపై పట్టు పెంచుకున్నా. అయితే ఈ క్రీడతో నాకు సంతృప్తి దక్కినా ఏదో ఓ మూల వెలితిగా అనిపించేది ప్రపంచంతో సంబంధం లేకుండా ఒంటరిగా గడుపుతున్నా నేమో అన్న భావన కలిగేది. దీన్ని దూరం చేసుకోవడానికే ఈ సమాజంతో మమేకమయ్యేలా కెరీర్‌ని ఎంచుకోవాలనుకుంటున్నాను. ఈ ఆలోచనతోనే నాకెంతో ఇష్టమైన నటనపై దృష్టి పెట్టా. అమ్మ ప్రోత్సాహంతో యాక్టింగ్ స్కూల్లో చేరి నా నట ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నా. అలా టీనేజ్‌లోనే నా సినీ ప్రయాణం ప్రారంభమైంది. అంటూ ఓ సందర్భంలో గుర్తుచేసుకుంది. మైకీ .

**బుల్లితెరపై తొలి అవకాశం ...** తన నట ప్రతిభతో 2016లో బుల్లితెరపై తొలి అవకాశం అందుకుంది మైకీ.ఇందులో ఒక రెజల్ అమ్మాయిగా కనిపిస్తూనే అటు కామెడీ పండిస్తూ, ఇటు నవ్వులు పూయిస్తూ ఎంతోమందిని ఆకట్టుకుంది. అయితే వెండితెరపై మాత్రం తొలి చిత్రంతోనే సువర్ణావకాశం ట్రాన్స్‌ఫట్, లియోనార్డో డికాప్రియో.. వంటి మేటి నటుల సరసన నటించే అవకాశం చక్కబెట్టుకుంది.ఇక ఆపై వెనుతిరిగి చూడలేదు మైకీ.

**పోల్ డ్యాన్స్ నేర్చుకున్నా..** సినిమాల్లో ఆయా పాత్రల కోసం వివిధ నైపుణ్యాలు నేర్చుకోవడం నటీనటులకు కొత్త కాదు. గతేడారి 'అనోదా' చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశాలు అందుకున్న మైక్రో. అందులో వేశ్య పాత్ర కోసం విభిన్న నైపుణ్యాలు నేర్చుకుంటున్నాను. న్యూయార్క్ బ్రూక్లిన్ పొందిన వేశ్య కథ ఇది. ఇందులో నా పాత్ర పేరు అనీ, ఈ పాత్ర కోసం నేను మూడు నెలల పాటు పోల్ డ్యాన్స్ నేర్చుకున్నా కొన్ని రకాల యాక్షన్ స్టంట్స్ సాధించాను. అంతేకాదు రష్యన్ భాష కూడా నేర్చుకున్నా. వేశ్యల జీవితాలు, సమాజంలో వాళ్లు ఎదుర్కొంటోన్న సమస్యల గురించి పలుమార్లు సెక్స్ క్లబ్స్‌కి కూడా వెళ్లాను. ఈ విధంగానే వాళ్ల బాధలు, సమాజం నుంచి వాళ్లెదుర్కొనే ఛీత్కారాలు ప్రత్యక్షంగా చూశాను. వాళ్లకూ సమాజంలో ఓ గుర్తింపు తీసుకురావాలనిపించింది.. అందుకే ఈ సినిమాకు సంతకం చేశా. అంటూ ఆస్కార్ వేదికపై ఎమోషనల్ అయిన మైకీ.. ఈ ఏడాది బాఫ్టా అవార్డుల్లోనూ ఇదే చిత్రానికి 'ఉత్తమ నటి'గా అవార్డులు గెలుచుకుంది. అయితే ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేయాలంటే ఆ సమయంలో ప్రకటించిందీ అందాల నాయిక ఇలా అనీ పాత్రలో ఒదిగిపోయి ఆమె నటించిన తీరుకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. హాలీవుడ్ చిత్ర దర్శకనిర్మాత సీన్ బేకర్ రూపొందించిన ఈ సినిమాకు ఈ ఏడాది ఐదు విభాగాల్లో అస్కార్ అవార్డులు చక్కగా.. 'ఉత్తమ నటి'గా మైకీ ఈ పురస్కారం అందుకుంది. ఎంతోమంది మహామహులకు సైతం తీరని కలగా మిగిలిపోయే ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పాతికేళ్లకే అందుకోవడం గర్వంగా ఉందంటోంది యువ నటి. ❐

# అవని.. జనని.. ప్రేరణి !

**అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా..**

**యుగయుగాలుగా తరతరాలుగా పరిఢవిల్లే స్త్రీ శక్తిని వర్ణించడం మాటలతో అసాధ్యం. సాధారణంగా మన సమాజం పురుసాధిక్యంతో ఉంటుందనుకుంటే ఆ** పురుషులను కన్నతల్లి కూడా అమ్మే. రాజాధి రాజైనా ఒక తల్లి బిడ్డే అవుతాడు. అవనిలో అమ్మలేందే ఏ జీవులకూ పుట్టుక ఉండదు. ఆమె పాత్రలు అనేకం అనుకుంటే ఒక జనని ఒక భార్య అక్క, వదిన, కోడలు, కూతురు మనుమరాళ్ళు అన్నీ ఆమే. దేవతలందరూ ఒక వైపుంటే రెండో వైపు ప్రాధాన్యత స్త్రీలదే. ఒక వృద్ధి చెందాలంటే కారకురాలు ఆమే అవుతుంది. 'ముదితలు నేర్వంగరాని విద్య కలదే ముద్దార నేర్పించిననే' అన్నట్లుగా ఆడది తలచుకోవాలే గాని ఆమె చేయలేని ఘనకార్యాలు ఉండవు. కలకంఠి కట కన్నీరొలికిన సరి ఇంట నిలవదు' ఆడపిల్లలు తల్లిదండ్రులు మగబిడ్డలతో సమానంగా, విద్యా బుద్ధులు పనిపాటలు నేర్పిస్తే, వారికి ఏ రంగంలోనైనా విజయాలే గానీ అపజయాలు ఆమడ దూరంలో ఉండిపోతాయి. పురుణాల కాలంనుండీ, సీత, తార, అహల్య ద్రౌపతి, సావిత్రి, మండోదరి, వంటి పతి వ్రతలకు పేరొందిన పుణ్యభూమి మనది. ఏ శిక్షణలు లేని అనాది కాలంలోనే ఎంతోమంది స్త్రీలు రచనలు చేసారు. మొల్లరామాయణం, సత్యభామ శ్రీకృష్ణుని ప్రియసతీ, ఏ మాత్రం సంకోచించక కోపంతో వారిని కాలితో సత్కరించి, నరకాసుర వధలో ప్రధాన పాత్ర ధరించిన వీరనారి మీరజాలగలడా నా ఆనతి' అని ఆపరమ పురుషుడినే సవాల్ చేసింది. ఝన్సీలక్ష్మీబాయి ధైర్యానికే ఒక ఉదాహరణగా శత్రుసేనలను చీల్చి చెండాడిన ధీరురాలు. ఇంకా రాణీ రుద్రమదేవిరెడ్డి నాగమ్మ మాంచాల పద్మినిలు పౌరుషానికి ప్రతీకలుగా చరిత్ర ప్రసిద్ధులు. ఉపదేశం 'చెప్పేవాడికి వినేవాడు లోకువ' అనటం నానుడి. అయితే, అది వింటున్నారు కదాని అనవసర ప్రస్తావన చేయటం, చాడీలు చెప్పడం లాంటి విషయాల గురించి మాత్రమే. నిజానికి ఉపదేశానికి అమితమైన శక్తి వుంటుంది. గర్భస్థ పిండదశలోనే అభిమన్యుడు పద్మవ్యూహాన్ని విని గుర్తుంచు కోవటాన్ని గమనిస్తే ఏకాగ్రతతో, స్థిరచిత్తంతో విన్నది ఎప్పటికీ మరచిపోవటం జరగదని అర్థమౌతుంది. అలాగే, వ్యక్తికి గానీ, సమాజానికి గానీ మేలు జరుగుతుందని తెలిసినపుడు అవతలి వారికి ఉచితమైన సలహాలు ఇవ్వటం ప్రయోజనంతో కూడుకున్నదని తెలుస్తుంది.ఆది గురువుగా అమ్మ బిడ్డకు ప్రతిక్షణం మంచి చెడుల గురించి అవగాహన కలిగిస్తుంది. తరువాత, గురువు విద్యార్థులకు వివిధ విద్యల్లో నిష్ణాతులయ్యేలా శిక్షణతో కూడిన ఉద్బోధ చేస్తాడు. వీరిద్దరి ఉపదేశాల్లోనూ నిస్వార్థ ప్రేమ, ఉన్నతిని కాంక్షించే తత్వమే గోచరిస్తుంది. వీరిద్దరి తరువాత నిజమైన స్నేహితులు, పెద్దలు హితవు చెప్పగలరు. ఎవరు చెప్పినా చెప్పే విషయంలోని ఉద్దేశ్యం, పరిణామాల గురించి తనలో తను తర్కించుకుని నిజమైన ఉపదేశాన్ని ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత బుద్ధిజీవి అయిన మనిషి స్వయంగా తీసుకోవలసిన నిర్ణయం పైన ఆధారపడి ఉంటుంది. అందుకే సుమతీ శతకంలో 'వినదగు నెవ్వరు చెప్పిన వినినంతనె వేగపడక' అన్నారు.భాగవతంలో అర్జునుడు కూడా కురుక్షేత్ర సంగ్రామం లో తన సౌర్య పరాక్రమాల కన్నా, కర్తవ్య దీక్ష కన్నా అయోమయావస్థతో దుష్టులైనా తనవారిని మన్నించాలా? లేక బంధు ప్రీతిని వదిలి సమాజ హితవుకోరి దండించాలా? అన్న సందిగ్ధానికి లోనై చేష్టలుదక్కి వుండిపోవలసి వచ్చింది. అటువంటి సమయంలో లోక కళ్యాణార్థమే అవతరించిన శ్రీకృష్ణ భగవానుడు గీతో పదేశం కావించి గీతాచార్యుడై అర్జునునిలోని సందేహాలన్నీ పటాపంచలయ్యేలా సమాధానపరిచి, నిస్సంకోచంగా కార్యోన్ముఖుడై తనవల్ల జరగవలసిన విధిని నిర్వర్తించ గలిగే స్ఫూర్తినిచ్చాడు. కేవలం అర్జునునికే కాదు ప్రతి ఒక్కరికీ భగవద్గీత ఓ గొప్ప కర్తవ్యబోధామృతంగా ప్రసాదింపబడింది. ఎటు వంటి సమస్యలోనైనా కృంగిపోని మనసుతో ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పొందే ఓ దివ్యౌషధం ఉపదేశం. జగద్గురువు కృష్ణావతారంలో మానవాళికి దిశా నిర్దేశం చేస్తూ అడగకనే ఇచ్చిన గొప్ప వరం. గీతాధ్యయనం సర్వోత్తమ జీవన పరమార్థం. సర్వ దుఃఖ హారం. కృష్ణం వందే జగద్గురుం. భారతదేశ ప్రతిష్ఠను పెంచి ఏలిన భరతుడు అలనాటి శకుంతల సంతానం కావడం భారతా నికే గర్వకారణం. దయా మయులుగా దీనుల సేవకు కంకణం కట్టుకున్న, సరోజినీ నాయుడు మదర్‌థెరీసా వంటి మహిళామణు మంచి పనులకు పూనుకున్న ఆదర్శప్రాయులు. ఇండియా ప్రధానిగా 18సం॥లు తిరులగులేని నాయకురాలుగా, మొండి ధైర్యంతో ఏలు బడి సాగించిన ఉక్కుమహిళగా పేరుగాంచి చివరకు దేశంకోసం ప్రానాలొడ్డిన ఏకైక పరిపాలకురాలు బడుగు వర్గాలకై పరితపించి, వారి ప్రగతికై పాటు పడిన దయా మయి. ఇంధిగాంధీగారు 'గరీబీ హటావో' నినాదంతో గర్జించి బడుగు బర్గాలకై శ్రమించిన భారత ప్రధాని ఇందిర ఇలా చెప్పుకుంటూ పోతే అబలసబలే కాదు దుర్భరురాలు కాదు అని విశదం అవుతుంది. దౌర్జన్యాలతో మహిళలను అణచి వేయాలనుకునేవారికి పుట్టగతులు ఉండవు.





**- యం.వి. రమణకుమారి**

# కార్టూన్లకు బానిసల్ని చేయొద్దు..

**కార్టూన్లు, రైమ్స్ ఛానెళ్ల పేరు వినపడిందంటే చాలు... పిల్లలు రయ్ రయ్ మంటూ వచ్చి టీవీలకూ, ఫోన్లకూ అతుక్కుపోతారు. నెలల పిల్లలిదీ ఇదే పరిస్థితి ఈ రకంగానైనా వాళ్ల అల్లరి తగ్గుతుందని తల్లిదండ్రులూ వదిలేస్తున్నారు. కొందరైతే పిల్లల దృష్టి మరల్చడానికీ, వాళ్ల పనులు పూర్తిచేసుకోవడానికి దీన్ని ఆయుధంలా వాడుతున్నారు. కానీ దీనివల్ల వచ్చే దుష్ప్రభావాలేంటో ఆలోచించారా?**

✦దీనిలో వేగంగా మారే దృశ్యాలూ, ప్రకాశవంతమైన రంగులూ పిల్లల్ని అతిగా ఆకర్షిస్తున్నాయి. పిల్లల మెదడుకు మితిమీరిన ఉత్తేజాన్ని ఇస్తున్నట్లు పలు అధ్యయ నాలు చెబుతున్నాయి.

✦ కార్టూన్లు, రైమ్స్ అధికంగా చూసే పిల్లల్లో మాటలు రావడం ఆలస్యం అవుతుందట. దీని ప్రభావం ఎక్కువై చాలామంది పిల్లలు సైగలకే పరిమితం అవుతున్నారట. భాషాపరమైన వృద్ధి జరగక... వాళ్లని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఏవేవో ప్రయత్నాలు చేయాల్సి వస్తుందట.

✦సెకన్లలో మారిపోయే విజువల్స్, ఆడియో స్టిమ్యులేషన్ వల్ల పాఠశాల చదువుల్లో, పనుల్లో ఏకాగ్రత కోల్పోతున్నారు. వేగంగా మారే దృశ్యాలున్న కార్యక్రమాలు చూసే పిల్లల్లో ఏకాగ్రత లోపిస్తుందని, అమెరికన్ అకాడమీ ఆఫ్ చైల్డ్ అండ్ అడాల్‌సెంట్ సైకియాట్రి వెల్లడించింది కూడా.



✦ యానిమేషన్, గ్రాఫిక్స్ ఉచ్చులో పడి స్క్రీన్ టైమ్‌కి అలవాటుపడుతున్న పిల్లల సంఖ్య ఇదివరకే పలు అధ్యయానాల్లో నానాటికీ పెరుగుతోంది. దీనివల్ల శారీరక చురుకుదనం కలిగించే ఆటల మీద ఆసక్తిని కోల్పోతున్నారు.

వీలైనంతమేర దీన్ని చూడటం తగ్గించమని... సామాజిక మాధ్యమాల వేదికగా పీడియాట్రీషియన్లు వాళ్ల అనుభవాల్ని కేస్ స్టడీస్లో సహా పంచు కుంటున్నారు. పిల్లలకు వీటిని చూపించొద్దంటూ సూచనలూ చేస్తున్నారు. అందుకే కార్టూన్లు, రైమ్స్ చూసే పిల్లల స్క్రీన్ సమయం తగ్గించండి. రోజుకి 20- 30 నిమిషాలకి మించకుండా జాగ్రత్త పడండి. ఆరుబయట ఆడుకోవడం, చదవడం, బొమ్మలు గీయడం, రంగులు వేయడం, ఇంటి పనుల్లో యం చేయడం లాంటివి ప్రోత్సహించండి. నెలల పిల్లలు తినడం లేదనో, మీకేదో పనుందనో వాళ్లను ఫోన్లకూ, టివిలకూ బానిసల్ని చేయకండి. ❐

# సుగంధ స్నానంతో ఆరోగ్యం..

లేచింది మొదలు నిద్రపోయేవరకూ మహిళలు పనుల వెంట పరుగులు తీస్తూనే ఉంటారు. దాంతో ముప్ఫైల్లోనే ముఖంపై ముడతలు, వలభైల్లోనే ఒళ్ల నొప్పులు..! ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఒత్తిడిని అదుపు చేసుకోవాలి. ఇందుకు సుగంద స్నానం. సాయపడుతుంది.



**అదేలాగంటారా?**

❖. పూర్వం మహారాణులు చర్మ సంరక్షణకూ, సేద తీరడానికి ఇలా సుగంధ స్నానాలు చేసేవారు. ఇది శరీరాన్నే కాదు మనసునీ తేలికపరుస్తుంది. ముందుగా గోరువెచ్చని నువ్వుం/కొబ్బరి నూనెను తల, ఒంటికి రాసుకుని మర్దన చేయాలి. ఆపై పెసరపిండిలో, కొద్దిగా అరగదీసిన చందనం, రెండు చెంచాల తాజా గులాబీల పేస్టు, కాసిని పాలు కలిపి ఒంటికి రాసి ఆరనివ్వాలి. పావుగంటయ్యాక మృదువుగా రుద్దుతూ స్నానం చేస్తే సరి. చర్మం. నిగారించడంతోపాటు మనసూ హాయిగా ఉంటుంది.

❖ అలసటగా ఉన్నప్పుడు వేడినీళ్లతో స్నానం చేస్తే చాలనుకుంటాం కానీ, అది తాత్కాలికంగా అనిపించే భావనే తప్ప ఫలితం ఉండదు. బదులుగా గోరువెచ్చని నీళ్లను వాడండి. అందులో కప్పు ఎప్సం సాల్ట్, ఓ రెండు చుక్కల లావెండర్ నూనె కలపండి. ఈ సువాసనలు మిమ్మల్ని తేలికపరుస్తాయి. నొప్పుల్నీ, మనసులోని ఆందోళనల్ని అదుపు చేస్తున్నారు. చక్కటి నిద్ర పడుతుంది.

❖ గోరువెచ్చని నూనెతో మర్ధన పూర్తయ్యాక... మూడు కప్పుల కొబ్బరి పాలల్లో కాస్త సెనగపిండి, చెంచా తేనె, రెండు చుక్కల గులాబీ నూనె కలిపి ఒంటికి పూత వేయండి. ఇది ఆరాక పంచదారను రాసి తడుపుతూ రుద్దేయండి. ఈ మిశ్రమంలో సువాసనలు ఒత్తిడిని తగిస్తాయి. పోషకాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ❐

# కివీతో ప్రయోజనాలెన్నో..

**ఇది విదేశీ పండు అయినా ఇప్పుడు మనదగ్గరా ఎక్కువగానే పండిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్లూ, ఖనిజాలు ఆరోగ్యానికి ఎతో మేలు** అంటున్నారు నిపుణులు. అవేంటో చూసేద్దాం.



✦. కివీలోని కాల్షియం, ఫాస్ఫరస్ ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్-బి 6 పుష్కలంగా ఉన్నాయి. వీటిని రోజూ అరటి, స్ట్రాబెర్రీ వంటి పండ్లతో కలిపి ఉదయం లేదా సాయంత్రం తినడంవల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

✦. పండ్లు అంటేనే పిల్లలు తినడానికి ఇష్టపడరు. అందుకే వీటిని అనినన రకాల ఫ్రూట్స్‌తో కలిపి సలాడ్స్‌గా లేదా ఐస్‌క్రీమ్‌గా మార్చి వాళ్లకి ఇవ్వండి. ఇష్టపడి తింటారు. ఇది మెదడు చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

✦ వయసు పైబడే కొద్దీ కొందరిలో ఎముకల పనితీరు, కంటి చూపు మందగిస్తుంది. కివీని రోజూ తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఎముకలను బలపరు స్తాయి. విటమిన్-ఎ కంటిచూపును మెరుగుపరుస్తుంది.

✦. కొంతమందిలో అలసట లేదా ఒత్తిడి కారణంగా నిద్రలేమి కనిపిస్తుంటుంది. కివీ తింటే సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి ప్రశాంతమైన నిద్ర పడుతుంది.

✦. కివీలోని విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లూ ఆస్తమా ఉన్నవారిలో శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. ఇందులోని పొటాషియం రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సాయపడుతుంది. ❐

# చావల్ మురియా

**సాధారణంగా అన్నంతో ఈసారి కాస్త ప్రత్యేకంగా ఖిచావల్ మురియాఖి ప్రయత్నించి చూడండి ఇంట్లో అందరూ వారేనా అనడం తథ్యం**

బియ్యం కప్పు, పపిండి అర కప్పు అల్లం మిర్చి పేస్టు చెంచా, కరివేపాకు దెబ్బలు, ఉప్పు రుచికి తగినంత, పసుపు చిటికెడు, ఎండుమిర్చి2, నూనె ముంచేందుకు సరిపడ, జీలకర్ర అర చెంచా, నువ్వులు ఒకటిన్నర చెంచా, పచ్చిమిర్చి ముక్కలు చెంచా ఉల్లి తరుగు



పావు కప్పు బియ్యం కడిగి నానబెట్టి అర గంట తర్వాత ఉడికించాలి. అందులో శనగపిండి, అల్లం మిర్చి పేస్టు తప్పు, పసుపు, ఎండు మిర్చి, కరివేపాకు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ముద్దలు చేసి కుక్కర్లో సుమారుగా 20 నిమిషాలు ఉడికించాలి. కుక్కర్కు వెయిట్ పెట్టదాచను. చల్లారిన తర్వాత వాటిని చిన్న ముక్కలు గా కట్ చేసుకోవాలి. నాన్ స్టిక్ ప్యాన్‌లో నూనె వేడయ్యాక నువ్వులు, జీలకర్ర వేయాలి. అవి వేగాక ఉల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు రెండు నిమిషాలు వేగ నివ్వాలి అందులో మురియా వేసి.. బంగారు రంగు వచ్చే వరకు మేస్తే సరి పోతుంది. ఈ చావల్ మురియా ఏదైనా చట్నీ లేదా కూరతో సర్వ్ చేయొచ్చు. ❐

# సమయాన్ని ట్రాక్ చేస్తున్నారా?



ఇంటి నుంచి ఎవరైనా బయటకెళ్ళిన ప్పుడు వాళ్లెక్కిన వాహనం సరైన మార్గంలో వెళుతుందో లేదో ట్రాక్ చేస్తాం. కొరియర్ చేసిన వస్తువు గమ్యాన్ని చేరిందో లేదో చెక్ చేస్తాం. ప్రతిదాన్నీ పరిశీలించేటప్పుడు, మరి మన సమయాన్ని ఎప్పుడైనా ట్రాక్ చేస్తున్నామా? రచయిత, క్రియేటర్ అంటార్ వారికి వంటి వాళ్లకు తను సమయాన్ని ట్రాక్ చేసే అలవాటు ఉంది. అదెలాగో చూద్దాం. ఆఫీసులో టార్గెట్ చేరలేకపోయినా, అంతెందుకు ఇంటి పని అనుకున్నట్లుగా పూర్తికాకపోయినా... మన సమయం ఎక్కడో వృథా అవుతుందని అర్థం చేసుకోవాలి. దాన్ని మనం లెక్కించాలంటే వారం రోజులపాటు మన పూర్తి సమయాన్ని రికార్డు చేయాలి. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి ప్రతి గంటను ఎలా గడుపుతున్నాం. ఏం చేస్తున్నామన్నది ఒక పుస్తకంలో పొందుపరచాలి. ఆ తర్వాత ఆ వారంలో గంటల రాత్రి క్రోడీకరించాలి. వాటిలో అనుకున్న పని పూర్తికావడానికి ఎంత సమయం వెచ్చించాం. ఇతర ప్రయోజనాల కోసం వినియోగించినవీ లేదా వృదాగా గడిచినవీ అంటూ ఆయా గంటలను విడివిడిగా రాయాలి. ఆపై ఈ మూడింటిలో దేనికోసం ఎక్కువ సమయాన్ని వినియోగించామో గుర్తించాలి. ఇలా మన సమయాన్ని మనమే ట్రాక్ చేయొచ్చు. దీనికోసం పలురకాల యాప్స్ కూడా వస్తున్నాయి. వీటిద్వారానూ మన సమయం ఎలా గడుస్తుందో గుర్తించొచ్చు. దీనితో దేనికెంత సమయాన్ని వెచ్చించాలనేదానిపై అవగాహనతోపాటు సమయపాలనా వస్తుంది. ❐

# విద్యా దాత్రి సరస్వతి

విద్యా దాత్రి సరస్వతి
దోర్భిర్యుక్తా చతుర్భిః
స్ఫటికమణిని
భైరక్షమాలాందధానా హస్తేనైకేన
పద్మం. అన్నారు వీణాపాటణి నాలుగు చేతుల్లో ధరించే వీణ, పుస్తకం, అక్షమాల, పద్మం సైతం మనకు జ్ఞానబోధ చేయగలవు. సరస్వతి వీణ పేరు కచ్ఛపి. అది సృజనాత్మకత, కళలు భావాలు భావోద్వేగాలకు ప్రతీక పుస్తకాలు, నాలుగు వేదాలకు సంకేతం. అవి సార్వత్రిక, దైవిక, శాశ్వత, అనువర్తనీయ జాడాలను సూచిస్తూ అడుగడుగునా మార్గనిర్దేశం చేస్తాయి. అక్షమాల లేదా స్ఫటికమాల ధ్యానాన్ని సూచిస్తుంది. స్వీయ అంతర్దర్శనానికి దారితీసి తద్వారా విచక్షణ కలిగిస్తుంది. అమ్మ చేతిలోని పద్మం దైవత్వాన్ని సూచిస్తుంది. సమస్త విద్యలూ ప్రాప్తింపచేస్తుంది. అమ్మ హంసవాహిని, స్వభావరీత్యా హంస నీటిని వేరుచేసి స్వచ్ఛమైన పాలను గ్రహిస్తుంది. అలాగే బుద్ధిమంతులు చుట్టూ ఉన్న విషయాల్లోంచి మంచిని మాత్రమే గ్రహించాలి. పవినరత మాఘ మాసంలో శుద్ధపంచమిన అమ్మ అవతరించిందని వేదోక్తి. అందుకే ఆ రోజు తెలుపు లేదా పసుపు దుస్తులు ధరించి పూజపీఠంపై పుస్తకాలనుంచాలి. వాటిని అమ్మగా భావించి జ్ఞానప్రాప్తికై షోడశోపచార పూజ చేయాలి. తెల్లటి పూలు, శ్రీగంధంతో ఆర్చించి క్షీరాన్నం, రేగుపళ్లు, చెరుకురసాలను నివేదించాలి. మేధ, ఆలోచన, ప్రతిభ ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే వాగ్దేవి. అందుకే అమ్మ సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తారు. బెంగాల్లో సరస్వతీ పూజను ఘనంగా నిర్వహిస్తారు. ❐



ఆధ్యాత్మికం

# మొటిమలా.. ఇవొద్దు !

**అందమైన ముఖానికి చిన్న మొటిమ చాలదూ.. కళతప్పడానికి?** పైగా నొప్పి. పోనీ వచ్చింది వచ్చినట్టు పోతుందా అంటే అదీ ఉండదు. మచ్చను మిగులుస్తుంది. వచ్చాక క్రీములు రాయడం కంటే రాకుండా చూసుకుంటే మంచిది. డెయిరీ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. వీటిల్లోని ప్రొటీన్స్, ఫ్యాట్ యాక్నేకి కారణమవుతాయి.పాటు లేకుండా ఉండేలమనిపిస్తే సోయా, బాదం, ఓట్ మిల్క్, యోగర్ట్ వంటివి ప్రయత్నిస్తే మేలు.


❖ అమ్మాయిలు, తీపి పదార్థాలను విడదీయలేం కదూ! కానీ స్వీట్లు, పేస్ట్రీలతో అదనపు కొవ్వులు వచ్చి చేరతాయి. అంతేనా.. వీటిల్లో చక్కెర ఇన్ఫ్లమేషన్‌కు కారణమై మరిన్ని మొటిమలు వచ్చేలా చేయగలదు. కాబట్టి, తీపికి కళ్లెం వేయాలి. బదులుగా బెల్లంతో చేసినవి తీసుకోండి. కొద్ది మొత్తంలో డార్క్ చాక్లెట్ వరకూ తినొచ్చు.



❖ మాంసప్రియులా? దాన్నీ వీలైనంత తక్కువ తినాల్సిందే! మాంసంలో అమైనో యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవీ మొటిమలకు కారణమయ్యేవే. కావాలంటే మష్రూమ్, చేపలు ఎక్కువ తీసుకోవచ్చు.

ఇంకా ఎ,సి,ఇ విటమిన్లు ఎక్కువగా లభించే యాపిల్, బొప్పాయి, సిట్రస్ ఫలాలకు అధికా ప్రాధాన్యమివ్వాలి. అలాగని జ్యూసులు కాదు, నేరుగా పండ్లనే తింటే మేలు. అలాగే స్ట్రాబెర్రీ, ఎండిన బెర్రీ ఫలాలను రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే చర్మానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయి. ❐

# రోజంతా తాజాగా..



బద్దూల తయారీలో పచ్చ కర్పూరాన్ని వాడటం మంచిది. దీనివల్ల ఆహార పదార్థాల రుచి, వాసన పెరుగుతుంది. ఇది సువాసనను మాత్రమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. కీళ్ల, కండరాల నొప్పుల నివారణకు తోడ్పడుతుంది. కొబ్బరి నూనెను వేడిచేసి పచ్చ కర్పూరం కలిపి నొప్పి ఉన్నచోట రాస్తే ఉపశమనం లభిస్తుంది.!! స్నానం చేసే నీటిలో కాస్త పచ్చ కర్పూరం కలపడం వల్ల చర్మం తాజాగా ఉండటంతోపాటు సువాసనలు వెదజల్లుతుంది. !! పంటి నొప్పిని కూడా తగ్గించుకోవచ్చు. కొబ్బరినూనెలో కర్పూరాన్ని కరిగించి.. దూది ముంచి పంటినొప్పి ఉన్నచోట పెడితే ఫలితం ఉంటుందంటారు.!! గంధంలో పచ్చ కర్పూరం, కొన్ని నీళ్లా కలిపి ఆ మిశ్రమాన్ని నుదిటికి రాస్తే జ్వర తీవ్రత తగ్గుతుంది. .. దీని వాసనను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత సమస్యల నుంచీ ఉపశమనం పొందొచ్చు. జీర్ణసంబంధిత ఇబ్బందులనూ ఇది నియంత్రిస్తుంది. ❐

# రిషబ్‌కు వరల్డ్ స్పోర్ట్స్ అవార్డు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్‌బ్యాటర్ రిషబ్ పంత్ జీవితాన్ని మార్చిన ఘోర ప్రమాదం నుంచి తిరిగి నిలిచి మైదానంలో తన మునుపటి జోరును ప్రదర్శిస్తున్నాడు. రిషబ్ పంత్ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డ్స్‌లో కమ్‌బ్యాక్ ఆఫ్ ది ఇయర్ విభాగానికి నామినేట్ అయ్యాడు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవం ఏప్రిల్ 21న స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరగనుంది. కాగా 2022 డిసెంబర్ 30న ఢిల్లీ నుండి తన స్వస్థలం రూర్కీకి కారులో వెళ్తూ రిషబ్ పంత్ ప్రమాదానికిగురైయాడు. భారత్ క్రికెట్ బోర్డు ప్రత్యేక ఏర్పాట్లతో ముంబైకి తరలించి, స్పెషలిస్ట్ కన్సల్టెంట్ల సహాయంతో చికిత్స అందించారు. కోలుకునే క్రమంలో ఫిజియోథెరపిస్టులు, ట్రైనింగ్ నిపుణులు, బిసిసిఐ వైద్య బృందం అతనికి అద్భుతమైన సహాయాన్ని అందించారు. ఫలితంగా సుదీర్ఘ విరామం అనంతరం రిషబ్ పంత్ ఐపీఎల్ 2024లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మైదానంలోకి అడుగుపెట్టాడు. ముల్లన్‌పూర్ వేదికగా పంజాబ్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శిం చాడు. ఐపీఎల్ విజయవంతంగా పూర్తి చేసిన పంత్, తొలి అంతర్జాతీయ మ్యాచ్‌గా బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆడాడు. తన మానసిక స్థిరత్వాన్నిరుజువుచేస్తూ ఆ మ్యాచ్ లో సెంచరీ సాధించాడు. భారతజట్టు 280 పరుగుల తేడాతో విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా భావించే లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డులలో కమ్‌బ్యాక్ ఆఫ్ ది ఇయర్ విభాగానికి ఎంపిక కావడం అతని శ్రమకు, పట్టుదలకూ ప్రతిఫలంగా నిలిచింది.




# మాస్టర్ లీగ్‌లో దక్షిణాఫ్రికా బోణి

## 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ టీ20 టోర్నీలో దక్షిణాఫ్రికా మాస్టర్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. వడోదర వేదికగా ఇంగ్లండ్ మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో టి అంబ్రోస్ (53) టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (36), స్కోఫీల్డ్ (20) రాణించారు. ఓపెనర్లు మస్టర్డ్ (0), ఇయాన్ బెల్ నిరాశపరిచనప్పటికి మోర్గాన్, అంబ్రోస్ కీలక ఇన్నింగ్స్‌తో ఇంగ్లీష్ జట్టును ఆదుకున్నారు. ఆఖరిలో ట్రిమ్‌లెట్ (4 బంతుల్లో 19 పరుగులు) హ్యాట్రిక్ సిక్స్‌లు బాది జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ప్రోటీస్ బౌలర్లలో ఫిలాండర్, హెన్రీ డేవిడ్స్, సబాలాల, కుర్గర్ తలా వికెట్ సాధించారు. ఇక 158 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.1 ఓవర్లలో చేధించింది. సఫారీల కెప్టెన్ హాషీమ్ ఆమ్లా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఊతికారేశాడు. కేవలం 55 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్సర్‌తో 82 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు, పీటర్సన్ (56) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో స్టువర్ట్ మీకర్ రెండు, ర్యాన్ సైడ్‌బాటమ్ ఓ వికెట్ సాధించారు. సౌతాఫ్రికా జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగవ స్థానంలో ఉంది.

# మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# గుజరాత్ జెయింట్స్ విక్టరీ

## 81 పరుగుల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ కీలక విజయాన్ని అందుకుంది. దీంతో గుజరాత్ ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. లక్నో వేదికగా యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 81 పరుగుల తేడాతో జెయింట్స్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన యూపీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బెత్ మూనీ యూపీ బౌలర్లను భయాందోళనకు గురిచేసింది. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు సాధించింది. ఓపెనర్ బెత్ మూనీ (59 బంతుల్లో 96 నాటౌట్; 17 ఫోర్లు) త్రుటిలో సెంచరీ అవకాశం కోల్పోగా, హార్లీన్ డియోల్ (32 బంతుల్లో 45; 6 ఫోర్లు) రాణించింది. అనంతరం వారియర్స్ 17.1 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. షినెల్ హెన్రీ (14 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్సు),



గ్రేస్ హారిస్ (30 బంతుల్లో 25; 3 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో కాశ్వీ, తనూజ చెరో 3 వికెట్లు తీశారు. వాజ్పేయి ఇకానా స్టేడియంలో ఇదే తొలి డబ్ల్యూపీఎల్ మ్యాచ్ కాగా సొంత మైదానంలో యూపీ చిత్తుగా ఓడింది. తొలి ఓవర్లోనే హేమలత (2) వికెట్ కోల్పోయినా మూనీ, హార్లీన్ రెండో వికెట్‌కు68 బంతుల్లోనే101 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. యూపీ బౌలర్లంతా సమష్టిగా విఫలం కాగా, ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న హైదరాబాదీ లెఫ్టార్మ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానాకు ఒక్క ఓవర్ కూడా వేసే అవకాశం రాలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రెండు వికెట్లు తీసి డాటిన్ దెబ్బ కొట్టగా, పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 4 వికెట్ల నష్టానికి 29 పరుగులకు చేరింది. ఆ తర్వాత ఏ దశలోనూ యూపీ కోలుకోలేకపోయింది. కాగా రెండు రోజుల విశ్రాంతి అనంతరం ఈ నెల 6వ తేదీన జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ తలపడనుంది.




# ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్కో రన్‌కు
# రూ.3 లక్షలు రాబడి

## మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్‌గా ఉల్‌హక్

## రోహిత్, కోహ్లీ రూ.వేలకే పరిమితం

**న్యూఢిల్లీ:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ–2025 ఊహించని ట్విస్టులు, అదిరిపోయే పర్ఫామెన్స్‌లతో క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తోంది. ఈ టోర్నీలో మరిన్ని విషయాలు హాట్‌టాపిక్‌గా మారుతున్నాయి. వాటిలో అత్యంత ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే, మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్ అని చెప్పవచ్చు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ కాకుండా మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్‌గా పాకిస్థాన్ క్రికెటర్ ఇమామ్ ఉల్‌హక్ రికార్డు సృష్టించాడు. అతని ఒక్కో రన్ సంపాదన అక్షరాలా రూ.3 లక్షలు. ఒక్క మ్యాచ్ ఆడినా, టాప్ ప్లేయర్లందరినీ దాటేసి మరీ సంపాదించడం విశేషం. కాస్ట్ పర్ రన్ చార్ట్‌లో టాప్‌లో ఉన్నాడు. ఒక్కో పరుగుకు రూ.3 లక్షలు సంపాదిస్తున్నాడు. గాయపడిన ఫఖర్ జమాన్ స్థానంలో జట్టులోకి వచ్చాడు, కానీ ఇండియాపై కేవలం 10 పరుగులే చేశాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆ ఒక్క మ్యాచ్‌కే అతనికి రూ.30 లక్షలు చెల్లించింది. దాంతో టోర్నీలోనే మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్ పర్ రన్‌గా నిలిచాడు. ఇక పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ రెండు మ్యాచ్‌ల్లో 87 రన్స్ చేశాడు. అతని ఒక్కో పరుగు సంపాదన రూ.1 లక్షకు పైనే ఉంది. పాక్ క్రికెట్ బోర్డు కాంట్రాక్ట్ ప్రకారం వన్డేలకు అతనికి 45 లక్షల పాకిస్తానీ రూపాయలు (పీకేఆర్) అందుతుంది. దాంతో పాకిస్థాన్‌లో అత్యధిక పారితోషికం తీసుకునే క్రికెటర్లలో ఒకడిగా ఉన్నాడు. కాగా ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కో పరుగుకు రూ.19,672 సంపాదించాడు. సెమీ ఫైనల్స్ కాకుండా రెండు మ్యాచ్‌ల్లో మొత్తం 61 రన్స్ చేశాడు. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఒక్కో వన్డే మ్యాచ్‌కు రూ.6 లక్షలు ఫీజు ఇస్తుంది. దాంతో టోర్నీలో ఇప్పటివరకు మంగళవారం జరిగిన మ్యాచ్‌తో సహా అతని మొత్తం సంపాదన రూ.18 లక్షలు. అయితే తొడ కండరాల గాయం కారణంగా రోహిత్ న్యూజిలాండ్‌తో జరిగే తర్వాతి మ్యాచ్‌కు దూరం కావచ్చు అని రిపోర్ట్స్ చెప్తున్నాయి. అలాగే విరాట్ కోహ్లీ ఇండియా టాప్ పర్ఫార్మర్స్‌లో ఒకడు. రెండు మ్యాచ్‌ల్లో 122 రన్స్ చేశాడు. కానీ అతని ఒక్కో పరుగు సంపాదన రూ. 9,806 మాత్రమే. ఇది ఇమామ్ ఉల్ హక్‌తో పోలిస్తే చాలా తక్కువ. రోహిత్ లాగే కోహ్లీ కూడా ఒక్కో మ్యాచ్‌కు రూ.6 లక్షలు సంపాదిస్తాడు. దాంతో టోర్నీలో అతని మొత్తం సంపాదన రూ.12 లక్షలు. మంగళవారం జరిగిన మ్యాచ్‌తో రూ.18 లక్షలకు చేరింది

# కెరీర్ బెస్ట్ ర్యాంకర్లుగా
# రిత్విక్, యూకీ

**న్యూఢిల్లీ:** అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్, భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు బొల్లిపల్లి రిత్విక్ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 24 ఏళ్ల రిత్విక్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 65వ



ర్యాంక్‌కు చేరుకున్నాడు. సాంటియాగోలో జరిగిన చిలీ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో కొలంబియాకు చెందిన నికోలస్ బరియెంతోస్‌తో కలిసి ఆడిన రిత్విక్ డబుల్స్ టైటిల్ గెలిచాడు. దాంతో అతని ర్యాంక్ మెరుగైంది. మరోవైపు భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీకూడా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)తో కలిసి దుబాయ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నీలో యూకీ డబుల్స్ టైటిల్ గెలిచాడు. ఫలితంగా తాజా ర్యాంకింగ్స్‌లో యూకీ ఐదు స్థానాలు పురోగతి సాధించి 39వ ర్యాంక్లో నిలిచాడు. అలాగే భారత దిగ్గజం రోహన్ బోపన్న ఒక స్థానం మెరుగు పర్చుకొని 21వ ర్యాంక్‌లో ఉన్నాడు. మెక్సికోలో జరిగిన అకాపుల్కో ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న భారత ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ మరోసారికెరీర్ బెస్ట్ 61వ స్థానానికిచేరుకున్నాడు. భారత ఇతర ప్లేయర్లు అర్జున్ ఖడే87వ స్థానంలో, జీవన్ నెడుంజెళియన్ 93వ స్థానంలో ఉన్నారు.

# సెబి మాజీ చీఫ్‌పై ఎఫ్ఐఆర్ నిలుపుదల

**ముంబై, మార్చి 4:** సెబి మాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు బాంబే హైకోర్టులో ఊరట లభించింది. తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులపై మాధవి పురి బచ్‌తో పాటు మరో అయిదుగురు ఉన్నతాధికారులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. నాలుగు వారాల పాటు కింది కోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తూ తాజాగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. 'పూర్తి స్థాయి పరిశీలన లేకుండా కింది కోర్టు ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల వాదనలు పరిశీలించిన తర్వాత వాటిని నిలిపి వేస్తున్నాం' అని ఉన్నత న్యాయస్థానం వెల్లడించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీలను లిస్ట్ చేయడంలో పెద్ద ఎత్తున ఆర్థిక మోసం, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ థానేకుచెందిన జర్నలిస్ట్ సపన్ శ్రీవాత్సవ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక న్యాయ మూర్తి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. మాధవి పురి బచ్‌తో సహా ఐదుగురు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా మాధవి పురి బచ్‌లు పలు వివాదాల్లో చిక్కుకున్నారు. అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధవి పెట్టుబడులు పెట్టారని గతేడాది ఆగస్టులో హిండెన్‌బర్గ్ చేసిన పోస్ట్ సంచలనంగా మారిన విషయం విదితమే. ఆ తర్వాత ఆమెపై మరిన్ని ఆరోపణలు వచ్చాయి. ఇందులో తన భర్త ధావల్



బచ్‌కు కూడా పెట్టుబడులు ఉన్నాయని పేర్కొనడం చర్చకు దారి తీసింది. అవన్నీ తప్పుడు ఆరోపణలే అంటూ బచ్ దంపతులు వివరణ ఇచ్చిన విషయం విదితమే.

# మస్క్‌కు హెవీ లాస్..రూ.7లక్షల కోట్లు నష్టం

**వాషింగ్టన్, మార్చి 4:** చైనా ఎఐ స్టార్టప్ డీప్ సీక్ కారణంగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఒక్క నెలలో తన సంపదలో ఏకంగా 90 బిలియన్ డాలర్లను కోల్పోయారు. టెక్ దిగ్గజాలకు 94 బిలియన్ డాలర్లు అంటే రూ.7.8లక్షల కోట్లు నష్టం కలిగించింది. చైనాకు చెందిన ఎఐ స్టార్టప్ డీప్‌సీక్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్, ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్, మెటా సిఇఒ



మార్క్ జుకర్‌బర్గ్ వంటి టెక్ ప్రపంచంలోని ప్రముఖులు భారీగా సంపదను కోల్పోయారు. డీప్ సీక్ ఊహించని విజయం టెక్ పరిశ్రమను దెబ్బతీయడమే కాకుండా ఈ ప్రభావవంతమైన టెక్ నాయకుల నికర విలువ నుంచి బిలియన్ల డాలర్లు అదృశ్యం కావడానికి దారితీసింది. ఫార్చ్యూన్ నివేదిక ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్ సంపద ఈ సంవత్సరం 90 బిలియన్ డాలర్లు అంటే రూ.7.46 లక్షల కోట్లు తగ్గింది. ఫిబ్రవరి ప్రారంభంలో బ్లూమ్‌బెర్గ్ మస్క్ నికర విలువ దాదాపు యుఎస్‌డి 433 బిలియన్లు అంటే దాదాపు రూ.35.9 లక్షల కోట్లుగా అంచనావేసింది. కానీ నెలాఖరు నాటికి, అతని సంపద యుఎస్‌డి 349 బిలియన్లకు పడిపోయింది. ఈ నాటకీయ క్షీణత డీప్ సీక్ బ్రేక్‌అవుట్ ద్వారా దెబ్బతిన్న టెక్ బిలియనీర్ల జాబితాలో అతన్ని అగ్రస్థానంలో నిలిపింది. ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్, మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ కూడా గణనీయమైన నష్టాలను చవిచూశారు. హువాంగ్ నికర విలువ 20 బిలియన్ డాలర్లు తగ్గగా, జుకర్ బర్గ్ నికర విలువ 11 బిలియన్ డాలర్లు తగ్గింది. ఫిబ్రవరి ప్రారంభంలో జుకర్ బర్గ్ సంపద 243 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. కానీ నెలాఖరు నాటికి అది 232 బిలియన్ డాలర్లకు తగ్గింది. డీప్‌సీక్ ప్రభావం ప్రముఖ ఎఐ చిప్ తయారీ సంస్థ అయిన ఎన్విడియాపై తీవ్రంగా పడింది. ఈ చైనీస్ స్టార్టప్ విజయం ఎన్విడియా షేర్లలో గణనీయమైన అమ్మకాలకు దారితీసింది. దీని వల్ల కంపెనీ మార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లు పడిపోయింది. ఇది అమెరికా స్టాక్ మార్కెట్ల చరిత్రలో అతిపెద్ద పతనాలలో ఒకటి అని బ్లూమ్ బెర్గ్ పేర్కొంది.

# మెగా ఐపిఒకు టాటా గ్రూప్ రెడీ!

**ముంబై, మార్చి 4:** దేశంలో మరో పెద్ద ఐపిఒ సిద్ధమవుతోంది. టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కేపిటల్ పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలు మొదలుపెట్టింది. ఇటీవల ఐపిఒ కోసం బోర్డు నుంచి ఆమోదం పొందిన ఆ సంస్థ స్టాక్ మార్కెట్లో ఎంట్రీ కోసం సన్నాహాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో కంపెనీ మార్కెట్ విలువ 11 బిలియన్ డాలర్లుగా లెక్క గట్టింది. టాటా కేపిటల్ పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు 2 బిలియన్ డాలర్ల వరకు సమీకరించొచ్చని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ కథనాలు వస్తున్నాయి. ఐపిఒలో భాగంగా 23 కోట్ల తాజా షేర్లను కంపెనీ ఇష్యూ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా మరికొన్ని షేర్లు జారీ చేయనుంది. ఐపిఒకు సంబంధించిన పూర్తి వివరాలను కంపెనీ ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న నేపథ్యంలో త్వరలోనే పూర్తి వివరాల్ని ప్రకటించే అవకాశం ఉంది. టాటా టెక్నాలజీస్ బంపర్ లిస్టింగ్ తర్వాత ఈగ్రూప్ నుంచి రానున్న మరో అతిపెద్ద ఐపిఒ కావడంతో ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. టాటా కేపిటల్‌ను నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థగా రిజర్వ్ బ్యాంకు




ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం, ఎన్‌బిఎఫ్‌సిలుగా ఉన్న సంస్థ షేర్లు మూడేళ్లలోపు లిస్ట్ చేయడం తప్పనిసరి. అంటే 2025 సెప్టెంబరులోపు కంపెనీ షేర్లు మార్కెట్లో లిస్ట్ కావాల్సి ఉంది. దీంతో టాటా కేపిటల్ సంస్థ, ఐపిఒకు సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత టాటా గ్రూప్ నుంచి 2023లో టాటా టెక్నాలజీస్ ఐపిఒకు వచ్చింది. తర్వాత ఆ గ్రూప్ నుంచి వస్తున్న మరో సంస్థ ఇదే.

# ఎఎండి, సిస్కో, నోకియాతో జియో టైఅప్

**ముంబై, మార్చి 4:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ జియో ప్లాట్‌ఫామ్ కోసం ప్రముఖ టెక్ కంపెనీలైన ఎఎండి, సిస్కో, నోకియాతో జట్టు కట్టింది. నెట్‌వర్క్ సెక్యూరిటీని, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు టెక్నాలజీ ఖర్చును తగ్గించేందుకు టెలికం ఎఐ ప్లాట్‌ఫామ్ ను రూపొందించేందుకు భాగస్వామ్యం కుదుర్చుకుంది. బార్సిలోనా వేదికగా జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ వేదికగా ఈ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆయా సంస్థల సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. నెట్‌వర్క్ ఆపరేషన్స్‌లోని ప్రతీ విభాగంలోనూ ఎఐ, ఆటోమేషన్‌ను జోడించడం ఈ ఎఐ ప్లాట్‌ఫామ్ ముఖ్య ఉద్దేశమని రిలయన్స్ పేర్కొంది. ఓపెన్ టెలికం ఎఐ ప్లాట్‌ఫామ్ ను రూపొందించడం వల్ల యుజర్ ఎక్స్‌పీరియన్స్ మెరుగవుతుందని, డిజిటల్ ఎకోసిస్టమ్‌లో కొత్త రెవెన్యూ అవకాశాలు అందిపుచ్చుకోవడం సాధ్యమవుతుందని రిలయన్స్ జియో సిఇఒ మాథ్యూ వూమెన్ తెలిపారు. ఎఐ ప్లాట్‌ఫామ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌తో రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.



# వాణిజ్యం

# షారుక్ ఖాన్ లాంటిదే నిఫ్టీ..రాధికా గుప్తా


**ముంబై, మార్చి 4:** అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల మధ్య స్టాక్ మార్కెట్లు గత కొన్ని రోజులుగా వరుసగా నష్టాల్లోకి జారుకుంటున్నాయి. దీంతో ఇన్వెస్టర్లలో భయందోళనలు నెలకొన్నాయి. మరోవైపు మార్కెట్ ట్రెండ్‌పై నిపుణులు తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడిస్తున్నారు. అనేక చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో నిఫ్టీని బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్‌తో పోల్చారు ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ సిఇఒ, ఎండీ రాధికా గుప్తా. 'అబ్ ఇండియా కరేగా గ్రో' పేరిట తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఇన్వెస్టర్లకు కొన్ని సూచనలు చేశారు. నిఫ్టీ బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్ ఖాన్ లాంటిది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తిరిగి పుంజుకుంటుంది. ఎదురుదెబ్బలు తిని కోలుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి' అని రాధికాగుప్తా అన్నారు. మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనైన సమయంలో ఇన్వెస్టర్లు ఓపికగా ఉండాలని సూచించారు. మార్కెట్ క్రాష్‌లకు భయపడకుండా, దాన్ని పెట్టుబడి అవకాశాలుగా చూడాలన్నారు. దీర్ఘకాల వృద్ధికి అవకాశాలుగా మార్చుకొని పోర్ట్‌ఫోలియోని సర్దుబాటు చేసుకోవాలన్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)లపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని గుప్తా అన్నారు. సిప్‌లు ఆపొద్దని, వాటిని వాయిదా వేయడం దీర్ఘకాలిక సంపద వృద్ధిని దెబ్బతీస్తుందన్నారు. పెట్టుబడిలో మహిళలు మరింత చురుకైన పాత్ర పోషించాలని రాధికా అన్నారు. దీర్ఘకాలిక సంపదను పెంచుకోవడానికి బంగారం ఇటిఎఫ్‌లు, బాండ్లు, డిజిటల్ బంగారం లాంటి ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టాలని ఆమె ప్రోత్సహించారు. గతేడాది సెప్టెంబరులో 85,478.25 వద్ద గరిష్ఠ స్థాయికి చేరుకున్న సెన్సెక్స్, ఇప్పటివరకు దాదాపు 12 శాతంపైగా కుంగింది. సెప్టెంబరులో గరిష్ఠ స్థాయికి



చేరినప్పటి నుంచి నిఫ్టీ గత 29 సంవత్సరాల్లో అత్యధిక నష్టాలను నమోదు చేసింది. దాదాపు రూ.90 లక్షల కోట్ల పెట్టుబడిదారుల సంపద తుడిచిపెట్టుకుపోయింది. విదేశీ పెట్టుబడిదారులు క్రమంగా తమ నిధుల్ని మార్కెట్ నుంచి బయటకు తీసుకెళ్లడం, డొనాల్డ్ ట్రంప్‌సుంకాలపై తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రపంచ ఆర్థిక ఆందోళనలు వంటి అంశాలు స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నాయి.

# ఈక్విటీలకు నష్టాల ఊగిసలాట

**ముంబై, మార్చి 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం కూడా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాల నేపథ్యంలో మనమార్కెట్లూ అదేధోరణిలో కదలాడాయి. ముఖ్యంగా రిలయన్స్, ఐటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ 73వేల దిగువకు చేరింది. స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్ మాత్రం స్వల్పంగా లాభపడ్డాయి. చివరికి సెన్సెక్స్ 96 పాయింట్లు నష్టపోయి 72,989.93 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 36.65 పాయింట్ల నష్టంతో 22,082.65 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 5 పైసలు మేర బలపడి రూ.87.27గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఏసియన్ పెయింట్స్, భారతీఎయిర్‌టెల్ వంటి షేర్లు నష్టపోయాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జొమాటో, టిసిఎస్, అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 70.58 డాలర్ల వద్ద ట్రేడయింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.